



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 74 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 25 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 74 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 25 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ...

### ఇద్దరు మావోలు అరెస్ట్

- దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్ సాల్మన్, ఆయన భార్య అరెస్ట్
- అచ్చంపేటకు వచ్చిన మావోయిస్టు దంపతులు
- అరెస్ట్ చేసిన నాగర్ కర్నూలు పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లతో భారీగా దెబ్బతిన్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, మిలిటరీ

- మిగతా 2లో...



## అమెరికాలో మంచు తుపాను విలయతాండవం...

### 16 రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ, 8,000 విమానాలు రద్దు!

- అమెరికాను ముంచెత్తుతున్న భారీ మంచు తుపాను
- దాదాపు 20 కోట్ల మంది ప్రజలపై తీవ్ర ప్రభావం
- 16కు పైగా రాష్ట్రాల్లో స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ విధింపు
- వారాంతంలో 8,000కు పైగా విమాన సర్వీసులు రద్దు
- పలు ప్రాంతాల్లో విపత్తు స్థాయి మంచు పేరుకుపోయే ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన మంచు తుపానుల్లో ఒకటి దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. టెక్సాస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు సుమారు 2,000 మైళ్ల విస్తీర్ణంలో ఈ తుపాను ప్రభావం చూపుతుండటంతో అగ్రరాజ్యం గజగజ వణికిపోతోంది.

- మిగతా 2లో...

## సింగరేణిపై విషపురాతలు.. ఎవరి కోసం?

- ఎవరికి లబ్ధి చేకూర్చడానికో ప్రజలకు తెలియాలన్న ఉప ముఖ్యమంత్రి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు వెల్లడి
- రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ప్రకటన




**హైదరాబాద్ పెన్ పవర్:** సింగరేణి ఆస్తులను కొంతమందికి కట్టబెట్టే ప్లాన్ తో, కార్మికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా విషపు రాతలు రాస్తున్నారంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషపు రాతల వల్ల రాష్ట్రానికి, సింగరేణికి నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఉదయం ప్రజాభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. సింగరేణిపై అసత్య ప్రచారాల వెనక కుట్ర దాగి ఉందని, సింగరేణి ఆస్తులు కాజేసే ప్లాన్ ఉందని ఆరోపించారు.టెండర్లపై అపోహలు సృష్టించేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎవరి ప్రయోజనాల కోసం తప్పుడు రాతలు రాస్తున్నారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ఆయన చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ రాయడాన్ని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణ జరిపిస్తానని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిపై కిషన్ రెడ్డి పరిశీలిస్తేనే నిజాలు బయటపడతాయని చెప్పారు.

**2018లోనే సైట్ విజిట్ నిబంధన..**

కోల్ ఇండియా టెండర్ డాక్యుమెంట్ ను కేంద్ర ప్రభుత్వం 2018లో తయారు చేసిందని, అప్పుడే సైట్ విజిట్ తప్పనిసరి అనే నిబంధన పెట్టిందని భట్టి విక్రమార్క చెప్పారు. 2021లో కేంద్ర గనుల శాఖ కూడా సైట్ విజిట్ తప్పనిసరి అని చెప్పిందన్నారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని ఆయన గుర్తుచేశారు. గత డాక్యుమెంట్లలోని నిబంధనల ఆధారంగానే ఇటీవల సింగరేణి టెండర్లు పిలిచిందని చెప్పారు. అయితే, మేమే ఈ నిబంధన పెట్టినట్లు పత్రికలు, నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో కూడా ఇష్టానుసారం ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.




## విదేశాల్లో భారత్ 'వాంటెడ్'.. రెండేళ్లలో 70 మంది గుర్తింపు

- 'వాంటెడ్' జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నారు: కేంద్ర ప్రభుత్వం
- పరారీలో ఉన్న వారి గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందన్న కేంద్రం
- ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నట్లు వెల్లడి
- వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత ఏడాది తిరిగి వచ్చినట్లు వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**గత రెండేళ్లలో 'వాంటెడ్' జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నట్లు గుర్తించామని కేంద్ర ప్రభుత్వం ఒక నివేదికలో తెలిపింది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి, పరారీలో ఉన్న వారిని గుర్తించే ప్రక్రియ

- మిగతా 2లో...



## నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

- గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి నాలుగో అంతస్తుకు వ్యాపించిన మంటలు
- రోబో ఫైర్ మిషన్ ద్వారా మంటలు ఆర్పుతున్న సిబ్బంది
- ఎనిమిది ఫైరింజన్లతో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

**హైదరాబాద్ పెన్ పవర్:** నాంపల్లిలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బచాస్ ఫర్నిచర్ క్యసిల్‌లో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. నాలుగు అంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. 10 ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఘటనాస్థలానికి భారీ క్రేన్లు చేరుకున్నాయి. అగ్ని ప్రమాదంలో మొత్తం ఆరుగురు చిక్కుకున్నట్టు భావిస్తున్నారు. ఈ భవనంలో మూడు కుటుంబాలు పనిచేస్తాయి. సెల్లార్‌లో వాచ్‌మెన్ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు, మరో కుటుంబంలోని నలుగురు చిక్కుకున్నట్టు సమాచారం. పిల్లల తల్లిదండ్రులు యాదమ, లక్ష్మి బయటకు వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగింది. అఖిల్ (11), ప్రణీత్(7) ఆచూకీ తెలియాల్సి ఉంది. భవనంలో చిక్కుకున్న వారి కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. భవనం పరిసర ప్రాంతవాసులను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్ని ప్రమాదం జరిగిన భవనంలోకి రోబోను

- మిగతా 2లో...

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సింగరేణిని దోచుకున్నాయి



- సింగరేణి రికార్డులను వెంటనే సీజ్ చేయాలి: బండి సంజయ్
- గతంలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం దోచుకుందన్న బండి సంజయ్
- ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు అదే పనిలో ఉన్నారని ఆరోపణ
- రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. రెండు పార్టీలూ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో కేసీఆర్

- మిగతా 2లో...

## బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌లకు కేటీఆర్ లీగల్ నోటీసులు

- వెంటనే తనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- నిరాధార, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారన్న కేటీఆర్
- బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఆగ్రహం



## భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!



- భారత్ పై 50 శాతం సుంకాలు వసూలు చేస్తున్న అమెరికా
- ఇటీవల రష్యా నుంచి కొనుగోళ్లు తగ్గించిన భారత్
- 25 శాతం టారిఫ్ లు తగ్గించనున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి హింట్

**పెన్ పవర్ డెస్క్:**భారత్ పై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్ లు తగ్గించే యోచనలో ఉన్నట్లు అగ్రరాజ్యం సంకేతాలు వెలువరించింది.

- మిగతా 2లో...



## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి
- యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ
- వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# ప్రతీ చోటా జగనన్న సైన్యం... పక్కా వ్యూహం !

వైసీపీ అధినేత గత ఇరవై నెలలుగా తాను తెర వెనకన ఉంటున్నారు. పార్టీని ముందు పెడుతున్నారు. ప్రతీ ఆందోళనను పార్టీ నాయకులు చేసేలా చూస్తున్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం కాకుండా ఈ మధ్యన చేసిన ఆందోళన చాలా వరకూ సక్సెస్ అయింది. కోటి సంతకాల పేరుతో పార్టీలో కొంత చైతన్యం వచ్చింది. అయితే 2024లో ఓటమి తరువాత నుంచి జగన్ చేస్తున్నది చెబుతున్నదీ ఒక్కటే. పార్టీని పటిష్టంగా ఉంచాలని. పార్టీ బాగుంటేనే అంతా బాగుంటారు అని. అందుకే ఆయన కమిటీల మీదనే ఫుల్ ఫోకస్ పెట్టేశారు.

**బూత్ లెవెల్ నుంచి :**

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ లెవెల్ నుంచి కమిటీలు వేయమని జగన్ ఆయా నియోజకవర్గం ఇంచార్జిలను కోరుతూ వస్తున్నారు. ఈ కమిటీలు కూడా కేవలం మొత్తం అనుబంధ సంఘాలతో కలిపి వేయమంటున్నారు. అంటే మహిళ, యువత, విద్యార్థి, కార్మిక, రైతు విభాగాలు అన్న మాట. ఇలా అధ్యక్షుడు ఒకరు, ఉపాధ్యక్షులు ఇద్దరు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రటరీలు ఇద్దరు, కోశాధికారి ఈ విధానంలో కమిటీలు వేసుకుంటూ వెళ్తే బూత్ లెవెల్ లోనే కనీసంగా ఒక యాభై మంది దాకా క్యాడర్ కి పదవులు దక్కుతాయి, వారంతా అక్కడ పార్టీ సైన్యంగా ఉంటారు అని లెక్క వేస్తున్నారు. అక్కడ నుంచి వార్డు, అలాగే పంచాయతీ స్థాయి, మండలాలు, నియోజకవర్గాల దాకా ఈ కమిటీలు ఉంటాయి. దీంతో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసంగా 15 వేలకు తక్కువ కాకుండా జగనన్న సైన్యం తయారు అవుతుందని అంటున్నారు.

**పదవ వంతుగా :**

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు కనీసంగా లక్షన్నర నుంచి రెండు లక్షల మంది దాకా ఉంటారు. ఆ లెక్కన తీసుకుంటే అందులో పదవ వంతుగా వైసీపీ సైన్యం ఉంటారు అన్న మాట. ప్రతీ పది మంది ఓటర్లకు ఒక వైసీపీ కమిటీ మెంబర్ అన్నట్లుగా వైసీపీ అధినాయకత్వ ఈ రాజకీయ నిష్పత్తిని ఎంచుకుంది. వీరు కనీసంగా అయిదుగురిని పార్టీ వైపు మళ్ళించినా లేక పార్టీ పక్షాన ఉంచుకున్నా ప్రతీ నియోజకవర్గంలో ఎనభై వేల ఓట్లుగా మారుతాయని ఆ మీదట ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో మరి కొంత యాడ్ అవుతుందని అధినాయకత్వం చేపట్టే పాదయాత్ర వంటి వాటితో ఇంకా ఆ నంబర్ పెరుగుతుందని మొత్తానికి నికరంగా ఒక లక్ష దాకా ఓట్లను ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంచుకోగలిగితే ఎన్నికల్లో ఎదురు ఉండదని వైసీపీ పక్కా ప్లాన్ తోనే కమిటీల మీద ఫుల్ ఫోకస్ పెడుతోంది అని అంటున్నారు.

**జగన్ విజన్ ఇదే :**

తాజాగా విజయనగరంలో జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సీనియర్ నేత కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ జగన్ విజన్ ని ప్రతీ వారూ తెలుసుకోవాలని అన్నారు. పార్టీకి లాభం కలగాలని పార్టీ గెలవాలని ఆయన కమిటీలను ఏర్పాటు చేయమని గట్టిగా కోరుతున్నారని అన్నారు. జగన్ మాట వింటే పార్టీకి తిరుగు ఉండదని స్వామి చెప్పడం విశేషం. ప్రతీ నియోజకవర్గంలో జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తయారు చేయమని అధినేత కోరుతున్నారని ఆయన అన్నారు. అంతా కష్టపడి కమిటీలను వేయాలని ఇక బూత్ లెవెల్ దాకా పార్టీని తీసుకుని వెళ్తే కనుక కచ్చితంగా మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు.

**క్యాడరే లీడర్ :**

మరో వైపు భీమిలీలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వైసీపీ ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కమిటీలు అన్నీ పూర్తి అయిన తరువాత క్యాడర్ ని తప్పకుండా గుర్తుంచుకుంటామని చెప్పారు. అంతే కాకుండా వారికే అన్ని విధాలుగా పెద్ద పీట వేస్తామని అంటున్నారు. ఇక కార్యకర్తలు అందరికీ ఐడెంటిటీ కార్డుతో పాటు ఇన్సూరెన్స్ కూడా చేయిస్తామని ఆయన చెప్పారు. అధినాయకత్వం క్యాడర్ కే అగ్ర తాంబూలం అని చెబుతోందని అందువల్ల పార్టీ అధికారంలోకి వస్తే క్యాడరే లీడర్ అని వైసీపీ నేతలు చెబుతున్నారు.

# అమెరికాలో మంచు తుపాను విలయతాండవం...

- మొదటి పేజీ తరువాయి

దాదాపు 20 కోట్ల మందికి పైగా ప్రజలు శీతల వాతావరణం, మంచు హెచ్చరికల నీడలో జీవిస్తున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాషింగ్టన్ డీసీతో పాటు అలబామా, జార్జియా, కెంటకీ, న్యూయార్క్, టెక్సాస్ సహా 16కు పైగా రాష్ట్రాలు ఇప్పటికే 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ'ని ప్రకటించాయి.

ఆర్కిటిక్ ప్రాంతం నుంచి పోలార్ వోర్టెక్స్ కారణంగా దూసుకొస్తున్న అతి శీతల గాలులు, శక్తివంతమైన తుపాను వ్యవస్థతో కలవడంతో ఈ విపత్కర పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా దేశంలోని తూర్పు భాగమంతా భారీ హిమపాతం, గడ్డకట్టే వర్షం (ఫ్రీజింగ్ రెయిన్), స్లీట్ (మంచుతో కూడిన వర్షం)తో అల్లకల్లోలంగా మారింది. ముఖ్యంగా సదరన్ ప్లెయిన్స్, లోయర్ మిసిసిపీ వ్యాలీ, టెన్నెస్సీ వ్యాలీ, ఆగ్నేయ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల "విపత్తు స్థాయి"లో మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం (ఎన్‌డబ్ల్యూఎస్) హెచ్చరించింది. "ఇది చాలా తీవ్రమైన తుపాను" అని యూఎస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వాతావరణ శాస్త్రవేత్త జాకబ్ ఆషర్‌మాన్ అభివర్ణించారు. ఈ మంచు తుపాను కారణంగా దేశవ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ అవేర్ డేటా ప్రకారం, ఈ వారాంతంలో (శని, ఆదివారాలు) ఇప్పటివరకు 8,000కు పైగా విమానాలను రద్దు చేశారు. డెల్టా, అమెరికన్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన సంస్థలు ప్రయాణ హెచ్చరికలు జారీ చేసి, టికెట్ మార్పు రుసుములను రద్దు చేశాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కూడా టెక్సాస్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోవచ్చని హెచ్చరించింది. మంచు ప్రభావం కేవలం ప్రయాణాలకే పరిమితం కాలేదు. గడ్డకట్టే వర్షం కారణంగా విద్యుత్ తీగలపై అంగుళం మందం వరకు మంచు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల విద్యుత్ లైన్లు తెగిపోయి, చెట్లు కూలిపోయి సుదీర్ఘకాలం పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్సాస్‌లో ఇప్పటికే దాదాపు 20,000 మంది, ఓక్లహోమా, ఆర్కాన్సాస్‌లలో వేలాది మంది విద్యుత్ లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. 2021 నాటి విద్యుత్ సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకున్నామని, ఈసారి విద్యుత్ గ్రిడ్‌ను సిద్ధంగా ఉంచామని టెక్సాస్ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఫీమా) దాదాపు 30 సహాయక బృందాలను సిద్ధంగా ఉంచింది. ఆహారం, దుప్పట్లు, జనరేటర్లను కీలక ప్రాంతాలకు తరలించింది. పలు రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. వాషింగ్టన్ డీసీ మేయర్ మురియల్ బౌజర్ మాట్లాడుతూ, "మేము అధికారికంగా స్నో ఎమర్జెన్సీ, స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించాం" అని తెలిపారు. చికాగోలో పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, లూసియానాలో కార్నివాల్ పరేడ్‌లు, నాష్‌విల్లేలో పలు కార్యక్రమాలు రద్దయ్యాయి.

ఈ తుపాను సోమవారం వరకు కొనసాగి, న్యూయార్క్, బోస్టన్ వంటి ప్రధాన నగరాలపై ప్రభావం చూపనుంది. తుపాను తగ్గుముఖం పట్టినా, ఆ తర్వాత కూడా అత్యంత శీతల గాలులు, ప్రమాదకరమైన వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- మొదటి పేజీ తరువాయి

మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని

ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

# బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌లకు కేటీఆర్ లీగల్ నోటీసులు

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అరవింద్ వెంటనే తనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. బీజేపీ నేతలకు వేర్వేరుగా లీగల్ నోటీసులు జారీ చేశారు. తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా ఆరోపణలు చేశారని పేర్కొన్నారు.

ఇరువురు నేతలు కూడా బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని కేటీఆర్ అన్నారు. తనకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరాధార ఆరోపణలు చేశారని, ఉద్దేశపూర్వకంగానే వారు తనను లక్ష్యంగా చేసుకుని మాట్లాడారని కేటీఆర్ తెలిపారు. రాజకీయాల కోసం వారు దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్, అరవింద్‌లకు తన న్యాయవాదులతో నోటీసులను పంపించారు.

ఫోన్ ట్యాపింగ్ ద్వారా కేటీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు ఆర్జించిందని, సెలబ్రిటీల ఫోన్లను ట్యాప్ చేశారని బండి సంజయ్ నిన్న ఆరోపించారు. అయితే ఈ వ్యాఖ్యలను కేటీఆర్ కొట్టిపారేశారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తోందని, అయినప్పటికీ ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడమేమిటని ప్రశ్నించారు. ధర్మపురి అరవింద్ తనపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని ఆయనకు పంపిన నోటీసుల్లో పేర్కొన్నారు. డ్రగ్స్ సేవిస్తున్నారని, సరఫరా చేస్తున్నారని చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సింగరేణిని దోచుకున్నాయి

- మొదటి పేజీ తరువాయి

కుటుంబమే సింగరేణిని దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు అదే పనిలో ఉన్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై విచారణ జరుపుదామా అని మంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానిస్తున్నారని... ఇదంతా చూస్తే రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని అర్థమవుతోందని బండి సంజయ్ అన్నారు. సింగరేణిలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన గనుల కేటాయింపులు, దోపిడీపై పూర్తిస్థాయి విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో దోపిడీపై ప్రశ్నిస్తే గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సాధన కోసం సింగరేణి కార్మికులు పోరాటాలు చేస్తే... ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే ఇప్పుడు మరింత ఎక్కువగా గనుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలయాపన చేయకుండా సింగరేణికి సంబంధించిన అన్ని రికార్డులను వెంటనే సీజ్ చేయాలని కోరారు. ఆలస్యం జరిగితే అవి తారుమారు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో సింగరేణిని అప్పులపాలు చేసి, దోచుకున్న డబ్బుతోనే బీఆర్ఎస్ పార్టీని నడిపించారని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తీసుకొస్తామంటూ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆ నిధులను మళ్లించడం పరిపాటిగా మారిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలేనని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మేయర్, ఛైర్మన్ స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతుంటే, అసలు దోషులను సాక్షులుగా ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. ఇలా చేస్తే ఫోన్ ట్యాపింగ్ చేసిన అసలు నిందితులను కాపాడుతున్నట్టేనని ఆరోపించారు. సిట్‌పై ప్రభుత్వ ఒత్తిడి ఉంటే దాని విశ్వసనీయత కోల్పోతుందని హెచ్చరించారు. కేటీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడుతున్నారని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ దేవాలయంలో కుటుంబంతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా? అని సవాల్ విసిరారు. హీరోయిన్లు, వ్యాపారులు, బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల నంబర్లను కూడా మావోయిస్టుల జాబితాలో పెట్టి ట్యాపింగ్ చేయలేదా? అని నిలదీశారు.

# 40 ఏళ్లుగా గర్భం మోసిన మహిళ.. 82 ఏళ్ల వయసులో నొప్పులు.. కట్ చేస్తే!

మాతృత్వం అనేది పెళ్లి అయిన ప్రతి ఒక్క మహిళ కల. ఏడు నెలలు లేదా తొమ్మిది నెలలు మోసి పండంటి బిడ్డకు జన్మనిస్తుంది తల్లి. ఇక ఆ బిడ్డను అల్లారు ముద్దుగా అపురూపంగా చూసుకుంటూ జీవితం ధన్యం చేసుకుంటూ ఉంటుంది. అయితే ఇక్కడ ఒక మహిళ ఏడు కాదు తొమ్మిది కాదు ఏకంగా 40 ఏళ్ల పాటు గర్భవతిగా ఉండి.. చివరికి 82 సంవత్సరాల వయసులో నొప్పులు రావడంతో హాస్పిటల్ కి వెళ్ళింది. పరీక్షించిన వైద్యులు అసలు విషయం తెలుసుకొని ఆశ్చర్యపోయారు. మరి 40 ఏళ్ల పాటు ఆ తల్లి తన గర్భంలో బిడ్డను మోసి.. 82 సంవత్సరాల వృద్ధాప్యంలో నొప్పులు రావడం ఏంటి? ఇది నిజంగా నిజమేనా? కనీసం ఈ విషయం ఆమెకు కూడా తెలియలేదా? అని కొంతమంది ఆశ్చర్యపోతున్నారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. సాధారణంగా కొన్ని కొన్ని సంఘటనలు నమ్మశక్యం కానీ నిజాలుగా మారుతున్న వేళ. ప్రతి ఒక్కరు ఆశ్చర్యంతో నోరెళ్ళబడుతున్నారు. అదెలా సాధ్యమనే ఆలోచనలో పడిపోతున్నారు. అలాంటి ఒక సంఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రస్తుతం ఒక మహిళ వయసు 82 సంవత్సరాలు. ఒక్కసారిగా భరించలేని కడుపునొప్పి రావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆమెను హాస్పిటల్ కి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు లోపల కణితి ఉంటుందని భావించారు. కానీ స్కానింగ్ తర్వాత అసలు విషయం తెలిసి ఆశ్చర్యపోయారు. కారణం ఆమె శరీరంలో 40 సంవత్సరాలకు పైగా ఒక కాల్సిఫైడ్ గర్భస్థ శిశువు ఉంది. అంటే 40 సంవత్సరాలుగా ఆమె గర్భవతి అన్నమాట. ఈ అరుదైన పరిస్థితిని వైద్య పరిభాషలో లిథోపెడియన్ లేదా స్టోన్ బేబీ అని పిలుస్తారు. అంటే గత 40 ఏళ్ల క్రితం ఆ మహిళకు ఎక్టోపిక్ గర్భం ఏర్పడిందట . అంటే గర్భస్థ శిశువు గర్భం లోపల కాకుండా గర్భం బయట అభివృద్ధి చెందడం.. దీని కారణంగానే ఆ మహిళకు పురిటి నొప్పులు అందరి లాగే రావడం , బిడ్డను కనడం వంటి పరిస్థితి ఎదురు కాలేదు. పైగా ఈ సంక్రమణను నిరోధించడానికి అనుగుణంగా ద

ఆమె శరీరం గర్భస్త శిశువును క్యాల్షియంతో ఆవరించి ఒక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసిందట. ఫలితంగా శిశువు గర్భాశయం వెలుపలి భాగంలో ఒక మమ్మీ సైడ్ రూపంగా మారి నిశ్శబ్దంగా ఉండిపోయింది. అందుకే ఎటువంటి గర్భస్థ లక్షణాలను కూడా కనబరచలేకపోయింది. నిజానికి ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా మాత్రమే జరుగుతాయట. వైద్య చరిత్రలో ఇప్పటివరకు కేవలం 300 కేసులు మాత్రమే గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఇకపోతే ఈ విషయం ఎక్కడ? ఎప్పుడు? ఎవరిలో జరిగింది అనే పూర్తి వివరాలు మాత్రం లేవు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఈ వార్త వైరల్ అవ్వడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఏది ఏమైనా ఇలాంటి సంఘటనలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

## భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!

- మొదటి పేజీ తరువాయి

రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నందుకు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రతీకార సుంకాలు 25 శాతం కలిపి మొత్తంగా మన దేశంపై 50 శాతం సుంకాలు విధించారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తుసేవలపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. అయితే, ఇటీవల రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించింది. దీంతో అమెరికా సుంకాలు సగానికి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయాన్ని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

## విదేశాల్లో భారత్ 'వాంటెడ్'.. రెండేళ్లలో 70 మంది గుర్తింపు

- మొదటి పేజీ తరువాయి

ముమ్మరంగా కొనసాగుతుందని వెల్లడించింది. అదే సమయంలో ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. పరారీలో ఉన్న వారిని విదేశాల్లో ఇంత పెద్ద మొత్తంలో గుర్తించడం గత దశాబ్ద కాలంలో ఇదే మొదటిసారి అని తెలిపింది.

వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత సంవత్సరం విదేశాల నుంచి తిరిగి వచ్చారని భారత ప్రభుత్వం వెల్లడించింది. సీబీఐ కేసులకు సంబంధించి ఏడాది వ్యవధిలో 74 రొగేటరీ లెటర్స్ పంపించినట్లు తెలిపింది. దర్యాప్తునకు సహకరించాలని విదేశీ న్యాయస్థానాలకు రాసే లేఖను రొగేటరీ లెటర్స్ అంటారు. ఈ లేఖల్లో 54 సీబీఐ, మరో 20 రాష్ట్ర దర్యాప్తు బృందాలు రాసినట్లు పేర్కొంది.

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ... ఇద్దరు మావోలు అరెస్ట్

- మొదటి పేజీ తరువాయి

ఇన్ స్ట్రక్టర్ మీసాల సాల్మన్ అలియాస్ సంతోశ్ నాగరాజు, డీవీసీఎం అయిన ఆయన భార్యను నాగర్ కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేటకు వచ్చిన వీరు... మావోయిస్టు ఫ్రంట్ సంస్థల నేతల సాయంతో మావోయిస్టు కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మహబూబ్ నగర్, నల్లమల ప్రాంతాల్లో మావోయిస్టులకు సహకరిస్తూ, వారికి ఆశ్రయం కల్పిస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సివిల్ లిబర్టీస్ కమిటీ జాయింట్ సెక్రటరీ జక్క బాలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ కో-కన్వీనర్ ఎడ్ల అంబయ్య, మంశెట్టి యాదయ్య ఉన్నారు. ఎర్టిగా కారులో మన్ననూరు నుంచి అచ్చంపేటకు వెళుతున్న సమయంలో వీరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

## కూటమి పక్కన పెట్టింది...వైసీపీ షాక్ ఇచ్చేసింది

వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామ వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. అంతే కాదు ఏకంగా రెండు లక్షల డెబ్బై వేల మంది దాకా వాలంటీర్లను తీసుకుంది. వీరికి గౌరవ వేతనంగా అయిదు వేల రూపాయలను ఇచ్చింది. వీరిని ప్రతీ యాభై కుటుంబాలకు బాధ్యులుగా చేసింది. ఆ విధంగా వీరు తమకు రాజకీయంగా ఉపయోగపడతారు అని భావించింది. కానీ విషయం చూస్తే మొత్తానికి మొత్తం బూమరాంగ్ అయింది.

**రెండింటికీ చెడి :**

వాలంటీర్లను తీసుకుని వచ్చి వైసీపీ పార్టీ నాయకులను క్యాడర్ ని పూర్తిగా పక్కన పెట్టేసింది. అన్నీ వారే చూస్తారు అని ధీమా పడింది. తీరా ఎన్నికల సమయంలో ఈసీ తీసుకున్న నిర్ణయంతో వాలంటీర్లు అంతా సైడ్ అయిపోయారు. మరో వైపు కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారు వైసీపీని వదిలేసి ఆ వైపుగా పనిచేసారు. కూటమి అధికారంలోకి వస్తే పది వేల రూపాయల గౌరవ వేతనం ఇస్తామని ఇచ్చిన హామీతో వైసీపీని వారే ఓడించేశారు. ఇలా వైసీపీ వ్యూహాలు రెండిందాలుగా చెడిపోయి ఎన్నడూ లేని విధంగా భారీ పరాజయాన్ని మూటకట్టుకుంది.

**కొన్నాళ్ళు ఆందోళన :**

వాలంటీర్లు అయితే కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కొన్నాళ్ళ పాటు ఆందోళనలు నిర్వహించారు. తమకు పది వేల రూపాయల వేతనం ఇస్తామని చెప్పారని తమను విధులలోకి తిరిగి తీసుకోవాలని వారు కోరారు. అయితే వారి సేవలను 2023 ఆగస్టు నుంచే వైసీపీ ప్రభుత్వం రెన్యూవల్ చేయలేదని టెక్నికల్ సాకులు చూపించి కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. అదే సమయంలో నెలవారీగా అందించే సామాజిక పెన్షన్లను కూడా సచివాలయ ఉద్యోగుల చేత అందిస్తోంది. ఈ క్రమంలో వాలంటీర్ల సేవలు అందడం లేదని ఎవరూ అనుకోవడం లేదు, క్రమంగా వారి గురించి కూడా అంతా మరచిపోయారు.

## నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

- మొదటి పేజీ తరువాయి

పంపి ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్, అగ్నిమాపక శాఖ డీజీ ఘటనా స్థలిని పరిశీలించి సహాయక చర్యలు పర్యవేక్షించారు.

**అంబులెన్స్‌లు సిద్ధంగా..**

నాంపల్లి అగ్ని ప్రమాద ప్రాంతం వద్ద పోలీసులు, హైడ్రా, విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు చేపట్టింది. ఘటనాస్థలిలో అంబులెన్స్‌లను అధికారులు సిద్ధంగా ఉంచారు. భవనం చుట్టుపక్కల దట్టంగా పొగ అలుముకుంది. ప్రమాద తీవ్రతను పెంచే వస్తువులను స్థానికులతో కలిసి అధికారులు తొలగిస్తున్నారు.

# సొంత చెల్లెనే మోసం చేసిన వ్యక్తి కేటీఆర్..
# సిట్ విచారణకు పోయి సిగ్గు లేకుండా మాట్లాడొద్దు





**హైదరాబాద్ పెన్ పవర్:** సొంత చెల్లెనే మోసం చేసిన వ్యక్తి కేటీఆర్ అని మంత్రి సీతక్క విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు పోయి సిగ్గు లేకుండా మాట్లాడొద్దని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇంటి అల్లుడు ఫోన్నే ట్యాపింగ్ చేశారని కేసీఆర్ బిడ్డా కవిత ఆరోపిస్తుంది.. బీఆర్ఎస్ నేతలు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం (జనవరి 24) సీతక్క మహబూబాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజల గోసను అర్థం చేసుకొని సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 24 గంటలోనే

- మిగతా 4లో...

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

- వికసిత భారత్ ఏ 2047 లక్ష్యంలో.. యువతే కీలకం..!
- హకీంపేట్‌లో నిర్వహించిన 18వ రోజ్‌గార్ మేళాలో పాల్గొన్న కేంద్ర బండి సంజయ్..
- ఈ కార్యక్రమంలో 238 మందికి నియామక పత్రాలు అందజేసిన బండి..
- దేశవ్యాప్తంగా 45 కేంద్రాల్లో 61 వేల మందికి ఉద్యోగ నియామకాలు..
- ఉద్యోగాల్లో అవినీతికి తావు లేదని, జాబ్ క్యాలెండర్ ప్రకారమే నియామకాలు..
- జీతం కోసం కాదు..! దేశ సేవే లక్ష్యంగా పనిచేయాలని కొత్త ఉద్యోగులకు సూచన..
- ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగం, "వికసిత భారత్ ఏ 2047" పై పిలుపు..





కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్..

కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన గావిస్తున్న కేంద్ర మంత్రి..





బండి సంజయ్‌కి పుష్పగుచ్చం అందజేస్తున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి..

# దేశ సేవే ధ్యేయంగా పనిచేయాలి

## కొత్త ఉద్యోగులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన..



పోలీస్ అధికారుల నుండి జ్ఞాపికను అందుకుంటున్న కేంద్ర మంత్రి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 24:** మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా హకీంపేట్‌లోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఎ)లో శనివారం నిర్వహించిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో భారత ప్రభుత్వ హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలను అందజేశారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని "విశ్వగురు" స్థానంలో నిలపాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని అన్నారు.. "వికసిత భారత్ ఏ 2047" సాధనలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని, ఉద్యోగం సంపాదించడమే కాకుండా ఉపాధి సృష్టి దిశగా కూడా ఆలోచించాలన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగుతుందని, ఎక్కడా అవినీతికి తావులేదని ఆయన స్పష్టం చేశారు.. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఒకేసారి నిర్వహించిన ఈ రోజ్‌గార్ మేళాలో మొత్తం 61 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయగా, హైదరాబాద్‌లోని "ఎన్ఐఎస్ఎ" కేంద్రంలో 238 మంది అభ్యర్థులు ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఉద్దేశించి ప్రసంగించారు.. కార్యక్రమానికి ముందు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎన్ఐఎస్ఎ డైరెక్టర్ డి.పి. పరిహార్, డిప్యూటీ డైరెక్టర్ అనీల్ దాము తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్..

## ఫోన్ ట్యాపింగ్ అంశం... కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై రామచందర్ రావు ఆగ్రహం

- కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని ఆరోపణ
- అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి ఫోన్ ట్యాపింగ్ డ్రామాకు తెరలేపాయని విమర్శ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి



నర్సాపూర్ హైవేపై ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్..



మూల మలుపులో ప్రమాద ఘటిక..

# ప్రజల ప్రాణాలకంటే..! ట్రాన్స్‌ఫార్మర్‌లకే ప్రాధాన్యత

## సూరారం రోడ్డుపై ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ..

- నర్సాపూర్ హైవే నుంచి సూరారం కాలనీకి వెళ్ళే మూల మలుపు మీదనే ట్రాన్స్‌ఫార్మర్..
- మెయిన్ రోడ్డుపై ఈ ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ ఐదేళ్లుగా వినతులు, నేటికీ చర్యల్లేవు..!
- అక్రమ కట్టడాలకు అడ్డొస్తున్నాయని చిటికెలో విద్యుత్ లైన్‌లు మార్చే అధికారులు..
- ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి ఐదేళ్ళుగా వినతిపత్రాలు ఇవ్వాలా..?
- అదే సూరారం కాలనీలో కాసులు కురిపించే ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌లు రోడ్లపైనే ఉన్నాయి..
- చట్టంలో లొసుగులను అనుసరించే విద్యుత్ అధికారులు నిబంధనలు పాటించకపోతే..!

-4లో

జీడిమెట్ల డివిజనల్ ఇంజనీర్ పరిధిలోని దొమ్మర పోచంపల్లి సబ్ స్టేషన్ నుండి సుమారు ఏడాది, వ్యవధిలో ఇద్దరు అవినీతి అధికారులపై (ఏఈపై ఏసిబి సోదాలు- లైన్‌మెన్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు) వేటు పడినా అధికారుల తీరు మారకపోవడం గమనార్హం.. గాగిల్లాపూర్ నుండి సూరారం వరకు అక్రమ ప్రైవేటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లను నిబంధనలు ఉల్లంఘించి రహదారిపైనే పెట్టడం పరిపాటిగా మారింది.. విద్యుత్ నిబంధనల్లో మార్పులు జరిగినా, అధికారుల్లో మార్పు రావడం లేదు.. ఒక్కో ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌కి ఏమేరకు ముడుపులు స్వీకరిస్తున్నారో కానీ..! అక్రమార్కులను వెనుకేసుకుని మాట్లాడటం సర్వసాధారణంగా తయారైంది.. రోడ్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టే వారికి..! నిబంధనలు ఉల్లంఘించి, "ఎల్ ఆకారంలో" రోడ్లపైకి చిటికెలో లైన్‌లు మార్చేస్తున్న విద్యుత్ అధికారులు, ప్రమాదకర ప్రభుత్వ ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చేందుకు రూల్స్ అడ్డొస్తున్నాయట.. అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ (ఏడిఈ)ను, ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌ల గురించి ప్రశ్నిస్తే, రోడ్లపైనే పెడతామని బరితెగించి సమాధానం పలు అనుమానాలకు తావిస్తోంది.. ఓవైపు 40 ఫీట్ల రోడ్డుని ఆక్రమించి నిర్మాణాలపై జీహెచ్ఎంసి చోద్యం చూస్తుండగా..! మరోవైపు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం, మూల మలుపు మీద ఈ ప్రమాదకర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రజల ప్రాణాలను హరించే విధంగా ఉంది.. **కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 24:**



విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రవిందర్ ముదిరాజ్..

# కేటీఆర్‌ను నేరస్తుడిగా పరిగణించలేదు

- ఫోన్ ట్యాపింగ్ దోషులను వదిలే ప్రసక్తే లేదన్న జూపల్లి
- చట్టబద్ధంగానే విచారణ జరుగుతోందని వ్యాఖ్య
- చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి విచారణ చేయడం కొత్తేమీ కాదన్న జూపల్లి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షగా చిత్రీకరించడం పూర్తిగా తప్పని, ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి... ఈ కేసులో ప్రజాస్వామ్య పద్ధతిలో, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌లో పాత్రధారులు ఎవరు? దీని వెనుక సూత్రధారులు ఎవరు?

-4 లో

# ప్రజల ప్రాణాలకంటే..! ట్రాన్స్‌ఫార్మర్‌లకే ప్రాధాన్యత..

- 3 పేజి తరువాయి
సూరారం మెయిన్ రోడ్డుపై కాలనీల మధ్యలో ఏర్పాటు చేసిన ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానికులకు ప్రాణాపాయంగా మారింది. వందలాది భారీ వాహనాలు రోజూ తిరిగే ప్రధాన రహదారిపై ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఏ క్షణంలో అయినా ఘోర ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు.. ఈ ప్రమాదకర పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు కొలా రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి ఏడిఈ వీరేశలింగం, డీఈ శ్రీనివాస్, స్థానిక బీఆర్ఎస్ నాయకునికి శనివారం వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే తొలగించి, పైకి లేదా పక్కకు మార్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఓసారి లారీ ఢీకొని ప్రమాదం జరిగిన ఆనవాళ్లు

ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్నట్లు రవిందర్ ముదిరాజ్ పేర్కొన్నారు.. గతంలోనే ఒక లారీ ఢీకొనగా, దానికి సంబంధించిన ఆనవాళ్లను కూడా అధికారులు పరిశీలించారని స్థానికులు తెలిపారు.. అయినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపక పోవడం బాధాకరమని అన్నారు.. ఎప్పుడు ఏం జరుగుతుందో అంటూ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..



## ఐదేళ్లుగా ప్రజావాణిలో ఫిర్యాదులు..

గత ఐదేళ్లుగా ప్రజావాణి కార్యక్రమాల్లోనూ ఈ సమస్యపై వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ, అధికార యంత్రాంగం స్పందించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు.. శనివారం ఏడిఈకి వినతిపత్రం అందజేసిన సందర్భంలో, ఆయన స్పందించి, త్వరలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పైకి లేపడమో లేదా పక్కకు మార్చే విధంగా ఆలోచిస్తామని హామీ ఇచ్చారని స్థానికులు తెలిపారు. అయితే హామీలు కాదు, తక్షణ చర్యలే కావాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రాజు హుస్సేన్, రామ్‌మోహన్ తదితరులు పాల్గొని, ప్రజల భద్రతపై అధికారుల బాధ్యతను గుర్తు చేశారు.. ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు..

# సొంత చెల్లెనే మోసం చేసిన వ్యక్తి కేటీఆర్.. సిట్ విచారణకు పోయి సిగ్గు లేకుండా మాట్లాడొద్దు

-3 పేజి తరువాయి
మహిళలకు ఫ్రీబస్ ఏర్పాటు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం తప్పా బీఆర్ఎస్ నాయకులకు ఇంకో పని లేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని చురకలంటించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు దోచుకుందని ఆరోపించారు. పదేండ్లలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు పదువులు శాశ్వతం కాదు.. పనులు శ్వాశతమన్నారు. మేడారంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమ్మక్క సారక్క తల్లులు చూసుకుంటారని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

# కేటీఆర్‌ను నేరస్తుడిగా పరిగణించలేదు

-3 పేజి తరువాయి
అన్నది ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల పన్నుల డబ్బుతో నడిచే విజిలెన్స్, భద్రతా వ్యవస్థలను దుర్వినియోగం చేయడం దిగజారుడుతనమేనని వ్యాఖ్యానించారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన చర్యలను చూస్తూ ఊరుకోవాలా? దర్యాప్తే చేయకూడదా? అని ఆయన ప్రశ్నించారు. ఈ కేసులో ఎవరినీ లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకోవడంలేదని, పూర్తిగా చట్టబద్ధంగానే విచారణ సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని అప్పట్లోనే వి.ప్రకాశ్ అనే వ్యక్తి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా తన ఫోన్ ట్యాప్ అయినట్టు గతంలో వెల్లడించిన విషయాన్ని ప్రస్తావించారు. ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి కూడా ఇదే విషయం చెప్పారని అన్నారు. మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయని చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్ సహా మరికొందరు కూడా తమ ఫోన్లు ట్యాప్ అయి ఉండొచ్చని అంగీకరించారని జూపల్లి తెలిపారు. కేటీఆర్‌కు కేవలం 160 సీఆర్పీసీ కింద మాత్రమే నోటీసులు ఇచ్చారని, ఆయనను నేరస్తుడిగా పరిగణించలేదని మంత్రి స్పష్టం చేశారు. సాక్షిగా సమాచారం కోసం మాత్రమే విచారణకు పిలిచామని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన కోదండరామ్‌ను కూడా గతంలో అక్రమంగా అరెస్ట్ చేసిన ఉదంతాన్ని గుర్తు చేస్తూ... చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి విచారణ చేయడం కొత్త విషయం కాదన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావుపై కూడా మంత్రి ప్రశ్నలు సంధించారు. కీలక సమయంలో ఆయన అమెరికాకు ఎందుకు వెళ్లారని నిలదీశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు తిరిగి భారత్‌కు వచ్చారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో మార్పులకు అనేక కారణాలున్నాయని, వాటిపై కూడా సమగ్రంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ అంశం... కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై రామచందర్ రావు ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ అంశంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ రాజ్యాంగ ఉల్లంఘన అని అన్నారు. ఈ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి ఫోన్ ట్యాపింగ్ డ్రామాకు తెరలేపాయని విమర్శించారు.

ఈ కేసులో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌తో నష్టపోయిన వారికి న్యాయం జరగాలంటే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ వేగవంతం కావాలని, బాధ్యులపై త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో భారతరత్న కర్పూరీ ఠాకూర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడారు. కర్పూరీ ఠాకూర్ బీహార్ రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరి అభివృద్ధి కోసం ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. ఉచిత విద్య, రిజర్వేషన్లు, రైతు సంక్షేమం వంటి అనేక సంస్కరణలను దశాబ్దాల క్రితమే




అమలు చేసిన గొప్ప నాయకుడు అన్నారు. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న పురస్కారం అందించిందని గుర్తుచేశారు.

# స్టార్టప్ ల కేంద్రంగానే టీ హబ్ రేవంత్ సర్కార్ క్లారిటీ

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన టీ హబ్‌ను ప్రభుత్వ కార్యాలయాలకు ఇవ్వడం లేదని ప్రభుత్వం ప్రకటించింది. అమెరికాలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎస్‌తో మాట్లాడారు. టీ హబ్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగానే ఉంచాలని చూసించారు. అక్కడికి ప్రభుత్వ కార్యకలాపాలను తరలించొద్దని సూచించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీస్‌లను వేరే ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని చెప్పారు. హైదరాబాద్‌లో చాలా ప్రభుత్వ ఆఫీస్‌లు ఇంకా అద్దె భవనాల్లో ఉంటున్నాయి. అయితే వాటికి నెల నెల కోట్ల రూపాయల అద్దెలు చెల్లించడం ప్రభుత్వానికి భారంగా మారుతోంది. అందుకే వాటిని ప్రభుత్వ భవనాలకు తరలించాలని ఆలోచించారు. అయితే ఇంక్యుబేటర్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన టీ హబ్‌లోకి తరలిస్తున్నారనే వార్త ఈ టైంలో ప్రచారంలోకి వచ్చింది. వెంటనే ప్రతిపక్షాలు స్వరం పెంచాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ ఈ నిర్ణయం సరికాదని మండిపడింది. నాడు స్టార్టప్‌లకు ప్రాణం పోసేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తే ఇప్పుడు వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం చంపేస్తోందని విమర్శించింది. ఇది ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమని ఆరోపణలు చేసింది. గంటల వ్యవధిలోనే సోషల్ మీడియాలో దీనిపై చర్చ మొదలైపోయింది. జరుగుతున్న ప్రచారాన్ని జరగబోయే ప్రమాదాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారు. జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. సీఎస్ రామకృష్ణారావుకు ఫోన్ చేసి అలాంటి ఆలోచనలు చేయొద్దని సూచించారు. దానికి బదులు వేరే ప్రభుత్వ బిల్డింగ్స్‌లో ఉన్న స్పేస్‌ను వాడుకోవాలని అన్నారు. టీ హబ్ కేవలం స్టార్టప్‌లకు కేంద్రంగా ఉంటుందని స్పష్టం చేశారు.

# మణుగూరులో సీఎం పీఎఫ్ చుట్టూ ముసురుకున్న మబ్బులు..

- అధికార హోదా ఉన్న చర్యలేని సెక్యూరిటీ ఆఫీసర్...?
- విచారణ మొదలైతే కదిలే అక్రమాల గుట్టలు...!
- ఎవరి అండతో ఇంత ధైర్యం...? ఎవరి ఆశీస్సులతో ఈ దందా...?
- మణుగూరు లో భద్రత కాదు భయభ్రాంతుల పాలన...!

**భద్రాద్రి కొత్తగూడెం:** మణుగూరు ఏరియాలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు అనుబంధంగా పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల జీవితాల్లో సీఎం పీఎఫ్ ఓ భరోసాగా ఉండాలి. కానీ అదే పీఎఫ్ ఇప్పుడు వారికి ఆందోళనగా మారింది.

మురళి ఏజెన్సీకి చెందిన పలువురు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు నెలల తరబడి పనిచేస్తున్నా, తమ సీఎం పీఎఫ్ ఖాతాల గురించి సరైన సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "డబ్బులు కట్ అవుతున్నాయిడ కానీ పీఎఫ్ ఎక్కడ ఉంది?" అన్న ప్రశ్నలు వారిని వెంటాడుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన చోటే మరో కథ మొదలవుతోంది. సీఎం పీఎఫ్ దరఖాస్తులపై అసలు సంతకాలు లేకుండానే, ఒక ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్ దొంగ సంతకాలు సృష్టించి గార్డుల నుంచి రుసుములు వసూలు చేశాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం బయటకు రాకుండా ఉండేందుకు పత్రాల మీదే ఆటలాడినట్టు కార్మికులు చెబుతున్నారు.

ఇదంతా తెలిసినా తెలియనట్టుగా వ్యవహరిస్తున్న ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తులపై సిఫారసులు, సంతకాలు ఎలా వచ్చాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఈ కుంభకోణం జరుగుతున్నా ఉన్నతాధికారులు నిమ్మకు




నేరెత్తినట్టు ఉండటంతో కార్మికుల్లో అసంతృప్తి పెరుగుతోంది.

"ఇది ఒక్కరి తప్పు కాదుడ వ్యవస్థలోనే లోపం ఉంది" అంటున్నారు కార్మిక సంఘ నేతలు. సరైన విచారణ జరిపితే ప్రైవేట్ సెక్యూరిటీ విభాగంలో మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

ఇప్పుడు మణుగూరులో వినిపిస్తున్న ఒక్కటే డిమాండ్

సీఎం పీఎఫ్ గందరగోళంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

లేకపోతే భద్రత కాపాడే చేతులే తమ భవిష్యత్తు కోసం పోరాడాల్సిన పరిస్థితి తప్పదని కార్మికులు చెబుతున్నారు.

# 'ఎంజీఎన్‌రేగా బచావో సంగ్రామ్ యాత్ర'ను ప్రారంభించిన కాంగ్రెస్

**హైదరాబాద్ పెన్ పవర్:**
కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వము మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌రేగా)ను నిర్వీర్యం చేస్తోందన్న ఆరోపణలపై నిరసనగా, హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) శనివారం మూడు రోజుల పాటు సాగే 'ఎంజీఎన్‌రేగా బచావో సంగ్రామ్ యాత్ర'ను ప్రారంభించింది. ఈ యాత్ర చార్మినార్ నుంచి పురానాపుల్ వరకు సాగగా, అదే రోజున యాకుత్‌పురాలోని సింగరేణి కాలనీ నుంచి సంతోష్‌నగర్ ఎక్స్‌రోడ్స్ వరకు మరో దశలో పాదయాత్ర నిర్వహించారు. ఈ ప్రచారం, ఉపాధి హక్కును కాపాడేందుకు మరియు ఎంజీఎన్‌రేగా యొక్క మూల ఆత్మను దెబ్బతీసే మార్పులను ప్రతిఘటించేందుకు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన దేశవ్యాప్త ఉద్యమంలో భాగం. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మాజీ పీసీసీ అధ్యక్షుడు మరియు మాజీ ఎంపీ శ్రీ వి. హనుమంతరావు పాల్గొని, స్థానిక ఉద్యమానికి బలమైన మద్దతు తెలిపారు. హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైఫుల్లా నేతృత్వంలో సాగుతున్న ఈ యాత్రను వివిధ నియోజకవర్గాల కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జీలు రాజేష్ కుమార్ పులిపాటి (బహదూర్‌పురా), బి. నాగేశ్ (చంద్రాయణగుట్ట), మొహమ్మద్ ముజీబుల్లా షరీఫ్ (చార్మినార్), షేక్ అక్బర్ (మలక్‌పేట్), మరియు కె. రవి రాజ్ (యాకుత్‌పురా)సక్రియంగా సమన్వయం చేస్తున్నారు. మూడు రోజుల పాటు ఈ ర్యాలీ నగరంలోని చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చంద్రాయణగుట్ట, మలక్‌పేట్ అనే ఐదు ప్రధాన అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా సాగి, జనవరి 26న ముగుస్తుంది. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు హనుమంతరావు మాట్లాడుతూ, "మోదీ ప్రభుత్వం ఎంజీఎన్‌రేగా ఆత్మను నాశనం చేయాలని చూస్తోంది. ప్రతి గ్రామీణ కుటుంబానికి ఉపాధిని డిమాండ్ చేసే చట్టబద్ధ హక్కును కేంద్రం నియంత్రించే ఉపకారంగా మార్చుతోంది. ఇది ప్రజాస్వామ్యంలో అంగీకరించలేం" అని అన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ కొత్త విధానంలో వేతన భద్రత లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. "మునుపు కుటుంబాలు కనీస వేతనాలపై ఆధారపడుతూ ఏడాది పొడవునా పని కోరగలిగేవి. ఇప్పుడు యాదృచ్ఛిక వేతన నిర్ణయాలు, పంటకాలంలో పనిలేకపోవడంతో గ్రామీణ కార్మికులు తక్కువ జీతాలున్న, అస్థిరమైన ఉద్యోగాల్లోకి నెట్టబడుతున్నారు" అని అన్నారు. హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైఫుల్లా గడ్డిపాత స్థాయి పాలనపై ప్రభావాన్ని హెచ్చరించారు. "గ్రామ పంచాయతీల ద్వారా వికేంద్రీకృతంగా అమలైనదే ఎంజీఎన్‌రేగా బలం. నేడు ఆ అధికారాలు తీసేసి కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. స్థానిక కార్మికులను హక్కులు, ప్రతినిధిత్వం లేని చౌక కూలీలుగా మార్చుతున్నారు" అని తెలిపారు. అతను ఇంకా మాట్లాడుతూ, "వేతన వ్యయాల్లో 40 శాతం భారం రాష్ట్ర ప్రభుత్వాలపై మోపడం అమలును నిరుత్సాహపరుస్తుంది. ఇది పేదలపై, ముఖ్యంగా ఎంజీఎన్‌రేగా మీద ఆధారపడే మహిళలు మరియు ఎస్సీ/ఎస్టీ కుటుంబాలపై నేరుగా చేసిన దాడి" అని అన్నారు. గ్రామీణ భారతానికి 'జీవనాధారం'గా ఎంజీఎన్‌రేగా ను పేర్కొన్న కాంగ్రెస్ నాయకులు, పథకం మద్దతుగా తీర్మానం కూడా చేశారు. గత రెండు దశాబ్దాల్లో ఈ పథకం ద్వారా 180 కోట్లకు పైగా మానవ-రోజుల ఉపాధి, దాదాపు 10 కోట్ల ప్రజా ఆస్తులు సృష్టించబడ్డాయని, స్థానిక ప్రణాళికల ద్వారా గ్రామ పంచాయతీలను శక్తివంతం చేసిందని వారు తెలిపారు. "కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఎంజీఎన్‌రేగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆధారస్తంభంగా నిలిచింది. ఇప్పుడు అది ముప్పులో ఉంది; మనం చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. ఎంజీఎన్‌రేగా బచావో సంగ్రామ్ యాత్ర హైదరాబాద్ దశలో పార్టీ కేడర్లు, కార్యకర్తలు, పౌరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్లకార్డులు, నినాదాలు, ప్రసంగాల ద్వారా ఎంజీఎన్‌రేగా అసలు నిర్మాణాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని హైలైట్ చేస్తూ, గ్రామీణ ఉపాధి కార్యక్రమాల కేంద్రీకరణ మరియు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా హెచ్చరించారు. ఈ నిరసనలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, మాజీ పీసీసీ కార్యదర్శి భీమ్ అర్జున్ రెడ్డి, కె. రవిరాజ్, మామిడి కృష్ణ కుమార్, అల్లం భాస్కర్, మల్లికార్జున్, అబ్దుల్ ఖదీర్, యూసుఫ్ దానిష్, మహమ్మద్ అబ్దుల్ ఘనీ, మొహమ్మద్ ముస్తఫా, సయ్యద్ దిలావర్ హుస్సేన్, అరుణ్ ఠాకూర్, శంకర్ నాయక్, శ్రీనివాస్ వాల్మీకి, రంగ శ్రీకాంత్ గౌడ్, అలేవాలు, ఇందివేలు మరియు శేషు యాదవ్ తదితరులు కూడా పాల్గొన్నారు.

# నిసా కేంద్రంలో ఉద్యోగ నియామక పత్రాలు పంపిణీ చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**సికింద్రాబాద్ పెన్ పవర్:** అవినీతికి, పైరవీలకు ఆస్కారం లేకుండా నేరుగా ఉత్తీర్ణతను బట్టి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను ఇస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. రోజ్ గార్ మేళా కార్యక్రమంలో భాగంగా హకీంపేట నిసా కేంద్రంలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పన జరుగుతుందని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు 2047 వికసిత భారత్ లక్ష్యంతో మోడీ ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. భారతదేశాన్ని గొప్ప శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్క పౌరుడు కృషి చేయాలని ఉద్యోగాలు సాధించిన వారు ఉద్యోగంతో పాటు దేశం కోసం ప్రజా సేవ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. అత్యంత పారదర్శకతతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను అందిస్తూ సుపరిపాలన దిశగా అడుగులు వేస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా రాబోయే రోజులలో యువతకు అనేక అవకాశాలు రానున్నాయని అందరూ చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బీఆర్ ఎస్ లో అసమ్మతి సెగలు..
## జనసేన పార్టీలో చేరిన చొప్పదండి నియోజకవర్గం బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు



**చొప్పదండి: పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జనసేన పార్టీ అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి పనులు, తెలంగాణా రాష్ట్రంలోని ప్రముఖ ప్రసిద్ధ పుణ్య క్షేత్రం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నుండి 35 కోట్ల పైగా రూపాయల నిధులు తీసుకు రావడాన్ని చూసి తెలంగాణలో పవన్ కళ్యాణ్ నాయకత్వంలో నడవాలని ,జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం సీనియర్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ మొగిలిపాలెం రమేష్ (కొడిమ్యాల), రాష్ట యువ జన నాయకులు రవీందర్ రెడ్డి ,మాధవరెడ్డి నిర్వహించన సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు శివారెడ్డి చల్లా ఆధ్వర్యంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ తాళ్ళూరి మరియు రాష్ట ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ గార్ల సమక్షంలో జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు, వారితో పాటు సినియర్ బీ ఆర్ ఎస్ నాయకులు తడగొండ నర్సింగ్ బాబు(జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ మెంబర్)కట్కూరి మల్లేశం (ఉదయ్ కట్కూరి ఫౌండేషన్ చైర్మన్ ), మాజీ ఉపసర్పంచ్ దర్మేందర్ వీరితో పాటు 50మంది నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరటం జరిగిందని తెఇపారు.ఈ కార్యక్రమలో జనసేన పార్టీ రాష్ట నాయకులు నల్ల సురేష్ రెడ్డి , బండి నరేష్ , విద్యార్థి నాయకులు పెంటాల మహేష్, రాష్ట , జిల్లా నాయకులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ సందర్బంగా జనసేన పార్టీలో చేరిన మొగిలి పాలెం రమేష్ మాట్లాడుతూ టీ ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి సామాన్య కార్యకర్తగా ఉండి చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కు నిరంతరం వెన్నంటి ఉండి తన గెలుపు కొరకు కుటుంబ సభ్యుడిగా ఉన్నప్పటికీ తగిన గుర్తింపు ఇవ్వలేదని మనస్థాపం చెంది జనసేన అధినేత ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు పార్టీ సిద్దాంతాలు చూసి జనసేన పార్టీలో తనతో పాటు 20 మంది వరకు చేరినట్లు తెలిపారు. తన లాగా ఇంకా ఎవరు బీ ఆర్ ఎస్ పార్టీలో ఎందరో గుర్తింపు లేక ఉన్నారని వారందరు జనసేన పార్టీ లో చేరి అభివృద్ధిలో బాగస్వాములు కావాలని తెలిపారు.

## సీపీఆర్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ చీఫ్

**హైదరాబాద్ పెన్ పవర్:** గుండెపోటుతో ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో సీపీఆర్ చేయడం వల్ల వారికి పునర్జన్మం అందించినట్లు అవుతుందని టీపీసీసీ చీఫ్ , ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రతిఒక్కరు సీపీఆర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెక్రెటేరియట్ ముందు సీపీఆర్ శిక్షణ ప్రారంభోత్సవ కార్యాలయంలో మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తో కలిసి మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ...రాష్ట్రంలో 2 లక్షల మందికి ఈ సీపీఆర్ పై శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని తలపెట్టిన ఫౌండేషన్ చైర్పర్సన్ కంజర్ల విజయలక్ష్మిని అభినందించారు. ప్రతి గ్రామానికి ఒక సీపీఆర్ అంబాసిడర్ ను తయారు చేసి , గుండె పోటు మరణాలను తగ్గించాలని ఆకాంక్షించారు. అజారుద్దీన్ మాట్లాడుతూ... ఇటీవల గుండె పోటుతో మరణించే వారి సంఖ్య పెరగడం బాధాకరం అని అన్నారు. ప్రతిఒక్కరు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. సీపీఆర్ నేర్చుకోవడం వల్ల ఒకరి ప్రాణాలను కాపాడే అవకాశం దక్కుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతం కావాలని అజారుద్దీన్ ఆకాంక్షించారు.

## గోల్ట్ షాపులపై బీఐఎస్ అధికారులు దాడులు



**హైదరాబాద్ పెన్ పవర్:** గోల్ట్ షాపులపై బీఐఎస్ అధికారులు దాడులు చేశారు. హాల్ మార్కింగ్ లేకుండా అమ్మకాలు చేస్తున్న షాపులపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. నకిలీ హాల్ మార్కింగ్తో బంగారు ఆభరణాలు అమ్ముతున్నట్లు గుర్తించారు. జైహింద్ కాంప్లెక్స్ లో జ్యువెలరీ షాపుల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ మేరకు భారీగా బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. పలు షాపులపై కేసులు నమోదు చేశారు.

# స్టార్ట్ ఎర్లీ గో స్లోలీ రీచ్ సేఫ్లీ : సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్,

**ఇంటికి క్షేమంగా చేరడమే 'అరైవ్ అలైవ్' లక్ష్యం**



**హైదరాబాద్ పెన్ పవర్:** మానవ ప్రాణం అమూల్యమైనదని, ప్రతీఒక్కరూ తమ ప్రాణాలతో పాటు తమపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, అన్నారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా బసంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈరోజు కూకట్ పల్లి రంగధాముని/ ఐడీఎల్ చెరువు వద్ద సైబరాబాద్ సీపీ సిబ్బందితో కలిసి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులను సీపీ గారు అభినందించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. "స్టార్ట్ ఎర్లీ గో స్లోలీ రీచ్ సేఫ్లీ" అనే నినాదాన్ని అందరూ ఆచరించాలన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని ఈ ప్రమాదాలు తగ్గించడమే "అరైవ్ అలైవ్" కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో.. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు.సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో జనవరి 13 నుంచి 23 వరకూ "అరైవ్ అలైవ్" కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ అవగాహన కార్యక్రమాలను వివిధ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, గేటెడ్ కమ్యూనిటీలు, ఇతర ప్రాంతాల్లో ప్రజలందరినీ భాగస్వాములుగా చేసుకుంటూ నిర్వహించారు. సాధారణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.కొండపూర్ ఆర్టీఓ ఆఫీసులో నిర్వహించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ డాక్టర్ గజరావు భూపాల్, ఐపీఎస్., మాట్లాడుతూ.. మానవ తప్పిదాల వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయన్నారు. హెల్మెట్, సీట్బెల్ట్ ధరించడం, వేగ పరిమితులు పాటించడం వంటి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు.బాలానగర్లో హెచ్ఏఎల్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన "అరైవ్ అలైవ్"లో భాగంగా కూకట్ పల్లి డీసీపీ రితీరాజ్, మాట్లాడుతూ..

మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్య చర్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరాలన్నదే" మా లక్ష్యమన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ లోకి భారీ చేరికలు



**కరీంనగర్: పెన్ పవర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రెండవ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నూతి చందు, మాజీ జెడ్పిటిసి నూతి వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం రోజున తీగలగుట్ట పల్లి గ్రామ మాజీ సర్పంచ్ జంగపల్లి మల్లయ్య వారి అనుచరులు 200 మందితో కలసి నేడు మాజీమంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని మరి మోసపూరిత హామీలు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను పెంచాయన్నారు. వారి విధానాలు నచ్చక తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది కేవలం బి ఆర్ఎస్ పార్టీయేనని అందులో కరీంనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన గంగుల కమలాకర్ వెంటే పనిచేయడానికి సిద్ధపడి పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో రెండవ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నూతి చెందు ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట బిఆర్ఎస్ పార్టీ రెండవ డివిజన్ అభ్యర్థి నూతి చందు, మాజీ జెడ్పిటిసి నూతి వెంకటేష్, తీగలగుంటపల్లి మాజీ సర్పంచ్ జంగపల్లి మల్లయ్య, మాజీ ఎంపీటీసీ భూమయ్య, నాయకులు గుండేటి రవీందర్, సాగర్, చిరంజీవి, భాస్కర్ రెడ్డి, ఐలయ్య, రామ్ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ లో మాక్ డ్రిల్



**సికింద్రాబాద్:పెన్ పవర్:** – గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఈరోజు ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో బాంబు స్క్వాడ్ బృందంతో మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే స్టేషన్ లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా డాగ్ స్క్వాడ్, బాంబు విస్పటన నివారణ బృందం ఆర్పీఎఫ్, జీఆర్పి పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ అనువు అనువు కుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు చేరుకున్న రైళ్లతో పాటు సికింద్రాబాద్ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లే రైళ్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్పీఎఫ్ బాంబు స్క్వాడ్ విభాగం సర్కిల్ ఇన్స్పెక్టర్ కరుణమాయి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈరోజు రాత్రి వరకు తనఖీలు కొనసాగుతాయని అనుమానిత వ్యక్తులు కనిపిస్తే విచారిస్తామని రైల్వే స్టేషన్ లోపలికి వస్తున్న ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేస్తున్నామని ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు. రైల్వే స్టేషన్ లో ఉన్న వెయింటింగ్ హాళ్లు ఇతర విభాగాల్లో సైతం తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు.

# అసెంబ్లీ పునర్విభజన సాధ్యమేనా

**హైదరాబాద్, జనవరి 24, పెన్ పవర్:**
అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన అంశం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని, మేడ్చల్ మూడు అసెంబ్లీ నియోజకవర్గాలుగావిడిపోతుందని మంత్రి వెంకటరెడ్డి ప్రకటించడంతో జిల్లాలో కొత్త వాటిపై తీవ్ర చర్చ జరుగుతోంది. 2028 వరకు నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందో లేదోనని అనుమానాలు వెలువడుతున్న వేళ మంత్రి వెంకట్‌రెడ్డి దీనిపై క్లారిటీ ఇచ్చారు.మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మేడ్చల్ జిల్లా అలియాబాద్ లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశానికి పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రికోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వచ్చే ఎన్నికల నాటికి మేడ్చల్ మూడు నియోజకవర్గాలుగా ఏర్పడుతుందని అనడమే గాక, రాష్ట్రంలో 153 అసెంబ్లీ నియోజకవర్గాలలో 125గెలుపొందుతామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పునర్విభజన జరిగితే 153 కు పెరుగుతాయి. మంత్రికి పక్కా సమాచారం ఉండడం వల్లే క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది.


మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటనతో ఆశావహులు ఉత్సాహపడుతున్నారు. తమకు పోటీ చేసే అవకాశం దక్కుతుందని జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులు భావిస్తున్నారు. మేడ్చల్‌నియోజకవర్గంలో సుమారు 7 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. మేడ్చల్ నియోజకవర్గం మూడుగా విడిపోతే తమ నియోజకవర్గంలోనూ మూడు ఏర్పడుతాయని కుతుబు ల్లాపూర్



నాయకులు భావిస్తున్నారు.మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్పల్లి నియోజక వర్గాలలోనూ కొత్తవి ఏర్పడనున్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ప్రకటించగా, మరికొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.వాస్తవానికి మహిళా బిల్లు ఆమోదించిన సందర్భంలో నియోజకవర్గాల పునర్విభజన చేసి మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించారు. జనాభా గణన ఉన్నందున 2028 అసెంబ్లీ, 2029 పార్లమెంట్ ఎన్నికలవరకు పునర్విభజన పూర్తి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. 2001లో చేసిన 84 రాజ్యాంగ సవరణలో 2026 తర్వాత చేపట్టే జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలని అందులో

పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం 2014 లోని సెక్షన్ 28 (1) ప్రకారం తెలంగాణలో 153 కు, ఆంధ్రప్రదేశ్లో 225 కు పెంచుకునే వెసులబాటు కల్పించారు.దీని ప్రకారం వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు సీట్లుపెరుగుతాయని భావించారు. సుప్రీంకోర్టులో నియోజకవర్గాల పునర్విభజన విషయమై పిటిషన్ దాఖలు అయింది. జన గణన తర్వాతే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో పునర్విభజన ఉంటుందని కేంద్రం కోర్టుకు తెలిపింది.జనగణన పూర్తయ్యే వరకు నియోజకవర్గాల పునర్విభజన ఉండబోదని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం 2027 జూన్ 4న జనగణనకు షెడ్యూల్ ప్రకటించింది. జనగణనకు చాలా సమయం పడుతుందని 2029 ఎన్నికలవరకు పూర్తి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. 2029 వరకు జనగణన పూర్తి చేసి పునర్విభజన ప్రక్రియ పూర్తి అవుతుందో, ప్రస్తుత నియోజకవర్గాల ఆధారంగానే ఎన్నికలు జరుగుతాయో వేచి చూడాల్సిందే!

# మహానగర్ విస్తరణకు ఆర్థిక కష్టాలు



**హైదరాబాద్, జనవరి 24 పెన్ పవర్:**
హైదరాబాద్ మహానగర విస్తరణ జలమండలికి కొత్తగా ఆర్థిక కష్టాలు తెచ్చిపెడుతోంది. ఇప్పటికే ప్రతి నెలా రూ.130కోట్ల లోటుతో నడుస్తున్న జలమండలికి కొత్త ప్రాంతాలను తీసుకురావడంతో ఆందోళన కలిగిస్తోంది.ఇప్పటి వరకు జలమండలి పరిధి అధికారికంగా 1450.2 చదరపు కిలోమీటర్లు. తాజా విస్తరణతో 2,053.2 చదరపు కిలోమీటర్లు కానుంది. విలీనమైన ప్రాంతాల్లో భారీ సంఖ్యలో కొత్త నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. సిబ్బందిని అదనంగా నియమించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జలమండలికి భారీగా నిధులు అవసరం కానున్నాయి. కొత్తగా విలీనమవుతున్న ప్రాంతాల్లో పటిష్టమైన తాగునీరు, మురుగునీటి వ్యవస్థలఏర్పాటుకు ప్రభుత్వమే ప్రత్యేకంగా నిధులు అందించాలిహైదరాబాద్ నగరంలో పెరుగుతున్న మౌలిక సదుపాయాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్టు ప్రకటించిన ప్రభుత్వం.. అదేతరహాలో ప్రజాసమస్యలపై ఫోకస్ పెట్టేందుకు, హైదరాబాద్‌ను మరింత గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు సిద్ధమైంది. జీహెచ్ఎంసీ 300 వార్డులుగా విస్తరించినట్టు ప్రభుత్వం తెలిపింది. ఇప్పుడు అదే తరహాలో జలమండలినివిస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు అధికారులు తెలిపారు. ప్రతి ప్రాంతంలోనూ సమస్యలను సూక్ష్మ స్థాయిలో గుర్తించి పరిష్కరించాలన్నది ప్రభుత్వ ఆలోచన అని అధికారులు అంటున్నారు. జలమండలినివిస్తరణ ద్వారా తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నదే తమ లక్ష్యమంటున్నారు.నగరంలో 9వేల కిలో మీటర్ల రోడ్లలో 5వేల కిలో మీటర్ల ప్రధాన రోడ్లుండగా, దాదాపు 10వేల కిలో మీటర్ల మేర వర్షం నీటి డ్రైన్లుఅవసరం ఉంది. కానీ గ్రేటర్‌లో వెయ్యి కిలో మీటర్లే వర్షం నీటి డ్రైన్‌లు ఉన్నాయి. అయితే రోజురోజుకూ కబ్జాలు పెరగడం.. మరో వైపు రోడ్లను విస్తరిస్తున్న క్రమంలో డ్రెయిన్ వాటర్ లైన్లు కనిపించకుండా పోతున్నాయి. ఇకఅభివృద్ధి పేరుతో అపార్ట్‌మెంట్లు, కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌లు షాపింగ్ మాల్స్ ఇలా తదితర వాణిజ్య వ్యాపార భవంతులు వెలుస్తుండటంతో చినుకు పడితే సిటీ రోడ్లన్నీ చెరువులుగా తలపిస్తున్నాయి. కాలనీలు, బస్తీలు నీటమునుగుతున్నాయి. వీటన్నిటినీ కట్టడి చేసేందుకు ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దించింది. హైడ్రాకు వస్తున్న సత్ఫలితాలతో జలమండలి, జీహెచ్ఎంసీ విస్తరణను వేగవంతం చేసింది.కబ్జాదారుల నుంచి నగరాన్నికాపాడి రాబోయే తరాల వారికి మంచి వాతావరణం, అభివృద్ధితోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం హైడ్రాను 2024, జూన్ 18న ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తక్కువ సమయంలోనే దేశంలో ఏ సంస్థకు ఇంతలా ప్రచారం కాలేదని మేధావులు, రాజకీయ నాయకులు, పండితులు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హైడ్రా పనితీరుతో ప్రతి ఒక్కరిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై

అవగాహన వచ్చింది.ఇప్పుడు పార్కులు, నాలాలు, చెరువులకు కబ్జా చేయాలన్నా, అక్రమ నిర్మాణాలు చేపట్టాలన్నా వణుకు పుట్టించారు. అయితే హైడ్రా ఏర్పాటు చేయకముందే కాంగ్రెస్ ప్రభుత్వంలో జీహెచ్‌ఎంసీనిమూడు మహానగర పాలక సంస్థలుగా చేయాలనే ఆలోచన ఉన్నదని విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగానే మహానగర పాలక సంస్థలుగా విభజించే దిశగా ప్రక్రియ వేగం పుంజుకుంది. అధికారికంగా మూడుకార్పొరేషన్లుగా ప్రకటించకపోయినా, ఆ దిశగా అడుగులు వేస్తోంది. వచ్చే నెల 10వరకు ప్రస్తుత పాలక మండలి పదవీకాలం ఉండటంతో అప్పటిలోపు సిబ్బంది, ఇతరాత్ర విభజన ప్రక్రియను పూర్తి చేయాలనే స్పష్టమైనఆదేశాలు ప్రభుత్వం అందడంతో దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం చర్యలను వేగవంతం చేసింది.జీహెచ్ఎంసీ పరిధిలోకి 20 పురపాలికలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు కలిపి మొత్తం 27 పట్టణ స్థానికసంస్థలను (యూఎల్‌బీలు) విలీనం చేయడంతో హైదరాబాద్ పురపాలనలో ప్రభుత్వం నగర పాలనలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ విలీనంతో జీహెచ్ఎంసీ 300 కార్పొరేషన్లు, 650 చదరపు కిలోమీటర్లవిస్తీర్ణం నుంచి 2,053 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించిందని ప్రచారం జోరందుకుంది.ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన హైడ్రా తరహాలోనే జీహెచ్ఎంసీని

విస్తరించారు. ఇందులో భాగంగానే హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మూడు కార్పొరేషన్లుగా విభజించేందుకు అంతా సిద్ధమవుతోంది. అందులో భాగంగానే ఉన్నతా ధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బందిని మూడుకార్పొరే షన్‌లకు విభజన ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటికే జోన్లకు జోనల్ కమిషనర్లను నియమించిన ప్రభుత్వం, 60 సర్కిళ్లకు డిప్యూటీ కమిషనర్లు బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయా

జోన్‌లకు పరిపాలన, ఆర్థిక, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు అధికారులు, సిబ్బంది బదిలీలు చేస్తున్నారు.హైడ్రా, జీహెచ్ఎంసీ తరహాలోనే జలమండలిని విస్తరిస్తున్నారు. జోన్లు, సర్కిళ్లు, సబ్ డివిజన్లు, వార్డులుగాసెక్షన్లగా విస్తరిస్తున్నారు. 12 జోన్లు, 60 సర్కిళ్లుగా విస్తరించే అవకాశముంది. 1450.2చ.కి.మీ. నుంచి 2,053.2చ.కి.మీ వరకు సేవలను అందిం చనున్నారు. తాగునీటి నల్లా కనెక్షన్లు14,43,136, 9055.29 కి.మీ మురుగు నీటి పైపులైన్స్, 4,80,269 మాన్‌హోళ్లుండగా ప్రస్తుతం 583 ఏంజీడీల తాగునీరు సరఫరా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించినఅనంతరం నివేదిక తయారు చేయనున్నారు. విస్తరణలో భాగంగా ఐదు జోన్ల(సర్కిల్)కు అదనంగా కొత్తగా ఏడు జోన్లను ఏర్పాటు చేశారు.59 సర్కిల్స్ (సబ్‌డివిజన్) ఉండగా కొత్తగా మరొకటి ఏర్పాటు చేశారు. 192

వార్డులు (సెక్షన్) ఉండగా అదనంగా మరో 108 ఏర్పాటు చేశారు. ఓఆర్‌ఆర్ లోపలి ప్రాంతాల వరకు ఉన్న పరిధిని ప్రస్తుతం ఓఆర్‌ఆర్ వెలుపల కూడా విస్తరించారు. జోనల్ అధికారులుగా చీఫ్ జనరల్‌మేనేజర్లు(సీజీఏం) బాధ్యతలు చేపట్టనున్నారు. జోన్ పరిధిలో నాలుగు నుంచి ఆరు సర్కిళ్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిసింది. జోనల్ కార్యాలయంలో ఇద్దరు చొప్పున జనరల్ మేనేజర్లు (జీఏంలు)ఉంటారు. ఒక్కో జీఎం రెండు నుంచి మూడు సర్కిళ్లను పర్యవేక్షిస్తారు. సర్కిళ్లలో సర్కిల్ అధికారిగా డిప్యూటీ జనరల్ మేనేజర్లు (డీజీఏంలు) బాధ్యతలు చేపట్టనున్నారు. వారు నాలుగు నుంచి ఐదు వార్డులను


పర్యవేక్షించనున్నారు. వార్డు ఆఫీసర్లుగా మేనేజర్లు బాధ్యతలు తీసుకోనున్నారు.లేకపోతే ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదని ఉన్నతాధికారులు అభిప్రాయ పడుతున్నారు.

# టీ హబ్ లో 39 సర్కారీ కార్యాలయాలు

**హైదరాబాద్, జనవరి 24 పెన్ పవర్:** ప్రభుత్వ కార్యాలయాలను అద్దె భవనాల నుంచి సొంత బిల్డింగుల్లోకి మార్చాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ప్రజాధనాన్ని ఆదా చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 39 కార్యాలయాలు,విద్యుత్, కాలుష్య నియంత్రణ మండలి, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, ఇతర శాఖల కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లోకి తరలనున్నాయి. టీ-హబ్, గృహకల్ప వంటి చోట్ల వీటికి ప్రత్యేక భవనాలను కేటాయించారు. అద్దెలభారం నుంచి తప్పించుకునేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.తెలంగాణ ప్రభుత్వం అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను సొంత బిల్డింగుల్లోకి మార్చాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని.. పొదుపు చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు బిల్డింగుల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఉండటం వల్ల వాటికి భారీ మొత్తంలో అద్దెలు చెల్లించాల్సి వస్తోంది. ఇలాఅద్దెల రూపంలో వృథా అవుతున్న ప్రజాధనాన్ని ఆదా చేయాలంటూ హైదరాబాద్ నగరంలోని చీఫ్ ఇంజినీర్ (ఆర్ అండ్ బీ) సమర్పించిన నివేదిక ఆధారంగా సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.ఈక్రమంలోనే జీహెచ్ఎంసీపరిధిలో ప్రైవేటు భవనాల్లో ఉన్న 39 ఆఫీసులను ప్రభుత్వ బిల్డింగుల్లోకి తరలించాలంటూ సీఎస్ రామకృష్ణారావు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఈ జాబితాలో ఐటీ, పర్యావరణం, రవాణా, రెవెన్యూ, అటవీ, యువజనసర్వీసులు, పౌర సరఫరాల శాఖ, ఆర్థిక శాఖ, మైనారిటీ వెల్ఫేర్ వంటి కార్యాలయాలు ఉన్నాయి. వీటిని అద్దె భవనాల నుంచి ప్రభుత్వ భవనాల్లోకి మారుస్తున్నారు.ఇదిలా ఉంటే.. బైరామల్‌గూడ, బోవరంపేట,హయత్‌నగర్ ప్రాంతాల్లోని విద్యుత్ శాఖ ఆఫీసులతో పాటుగా.. రామచంద్రాపురంలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జోనల్ ఆఫీస్, ల్యాబ్‌లను.. ఎర్రమంజిల్‌లోని పాత ఆర్‌అండ్‌బీ ఆఫీసు బిల్డింగ్, మొజాంజాహిమార్కెట్‌లోని తుల్జా గూడా కాంప్లెక్స్‌లోకి మారుస్తున్నారు. వీటితో పాటు బర్కత్‌పురాలో ఉన్న తెలంగాణ ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ ఆఫీసును కూడా.. కూడా మొజాంజాహి మార్కెట్, హౌసింగ్ బోర్డు కాంప్లెక్స్‌లోకేటాయించిన భవనంలోకి మార్చనున్నారు.ప్రైవేటు భవనాల నుంచి ఖాళీ చేయిస్తున్న ప్రభుత్వ ఆఫీసుల్లో ఎక్కువ శాతం కార్యాలయాలను.. తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన ఖాళీ భవనాల్లో సర్దుబాటు చేస్తున్నారు.వీటితో పాటు.. ఆర్థిక శాఖ పరిధిలోకి వచ్చే.. ఆర్థిక అసిస్టెంట్ పెన్షన్ పేమెంట్ ఆఫీసుల అడ్రెస్‌లు కూడా మారనున్నాయి.ప్రస్తుతం మోతీగల్లీ, నారాయణగూడ, తార్నాక, చాంద్రాయణగుట్ట వంటి వేర్వేరు ప్రాంతాల్లో అద్దెభవనాల్లో ఉన్న పెన్షన్ పేమెంట్ ఆఫీసులన్నింటినీ.. నాంపల్లి ప్రాంతానికి మార్చనున్నారు. ఈ ఏరియాలోని గాంధీ భవన్ పక్కన ఉన్న 'గృహకల్ప' కాంప్లెక్స్‌లోకి ఈ పెన్షన్ పేమెంట్ కార్యాలయాలను తరలించనున్నారు. వీటితో పాటు మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన నాంపల్లిలో ఉన్న కార్యాలయాన్ని బషీర్‌బాగ్, షక్కర్ భవన్ బిల్డింగ్‌లోకి మారుస్తున్నారు.ఇదిలా ఉంటే ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే రిజిస్ట్రేషన్‌శాఖ ఆఫీకసులను కూడా అద్దె భవనాల నుంచి సొంత బిల్డింగుల్లోకి మారుస్తున్నారు. నార్సింగి, వట్టినాగులపల్లిలో ఉన్న గండిపేట, శేరిలింగంపల్లిసబ్ రిజిస్ట్రార్ ఆఫీసులతో పాటుగా రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులను..రాయదుర్గం పన్మక్తలోని టీ-హబ్ భవనంలోకి తరలించనున్నారు.ఇక కుకట్‌పల్లి సబ్ రిజిస్టార్ ఆఫీసును కేపీహెచ్‌బీ ఫేజ్-1లోని కమర్షియల్ కాంప్లెక్స్‌లోకి మార్చబోతున్నారు. దీంతో పాటుగా బాలానగర్, ఎస్‌ఆర్ నగర్‌ఏరియాల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను వెంగళరావు నగర్‌లోని మెడికల్ డిపార్ట్‌మెంట్ క్వార్టర్స్‌కు తరలిస్తున్నారు. వీటితొ పాటు ప్రస్తుతం ఐటీ శాఖకు చెందిన ఫైబర్ నెట్ కార్యాలయాన్ని హైటెక్ సిటీలోని నాక్‌క్యాంపస్‌కు తరలించనున్నారు.

# కంటోన్మెంట్ ఏరియాలో మంచినీటి సరఫరా మెరుగుపరచాలి

## బోర్డ్ సభ్యురాలు భానుక నర్మద



**సికింద్రాబాద్: పెన్ పవర్:** శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బ్రిగేడియర్ రాజీవ్, ప్రెసిడెంట్, కంటోన్మెంట్ సీఈవో అర్వింద్ కుమార్ దీవ్వేది, జాయింట్ సీఈవో ఆశిక్ హుస్సేన్, నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ హజరయినారు. బోర్డు సమావేశంలో ప్రజలకు సంబంధించిన పలు ముఖ్య అంశాలపై నర్మద మల్లఖార్జున్ సుదీర్ఘంగా ప్రసంగించారు.

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా కంటోన్మెంట్ భూముల పరిహారం కింద ఇప్పటికే రూ.303 కోట్ల రూపాయలు జమ కాగా, ఇంకా రూ.13 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. మిగిలిన ఈ రూ.13 కోట్ల నిధులతో కంటోన్మెంట్ పరిధిలోని 8 వార్డుల్లో పూర్తిగా పాడైపోయిన, దెబ్బతిన్న రోడ్లను వెంటనే నిర్మించాలని ఆమె కోరారు.

ఇటీవల ఆస్తి పన్నుల మదింపు సమయంలో పన్నులు 100 నుండి 200 శాతం వరకు పెంచడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల పన్నులను 15 నుండి 20 శాతం వరకు మాత్రమే పెంచి ప్రజలపై భారం పడకుండా చూడాలని బోర్డును కోరారు.

ఇటీవల జూబ్లీ బస్ స్టాండ్ ఆవరణలోని అటల్ బిహారీ వాజపేయి పార్క్ ప్రక్కన ఖాళీ స్థలంలో కొందరు బీద ప్రజలు దుకాణాలు ఏర్పాటు చేసుకోగా, ఆ స్థలం రక్షణ శాఖ అధీనంలోని కంటోన్మెంట్ బోర్డు స్థలం కావడంతో నిర్మాణాలను తొలగించడం జరిగింది. దీని వలన అనేక మంది బీద ప్రజలు రోడ్డున పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఈటెల రాజేందర్ స్పందించి నేషనల్ ఎస్టీ కమిషన్లో ఫిర్యాదు చేసి, కూల్చివేసిన స్థలంలోనే కంటోన్మెంట్ బోర్డు ద్వారా మళ్లీ నిర్మాణాలు చేపట్టి వారికి కేటాయించే విధంగా కృషి చేసినందుకు అక్కడ ఎంపి ఈటెల రాజేందర్కు పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బానుక నర్మద మల్లిఖార్జున్ పాల్గొన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో తాగునీటి సరఫరా 3 నుండి 4 రోజులకు ఒకసారి మాత్రమే అందుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండాకాలం ప్రారంభమయ్యేలోపే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో గడ్డు పరిస్థితులు తప్పవని హెచ్చరించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నీటి సరఫరాను పెంచాలని కోరారు.

అదేవిధంగా హెచ్ఎండీయే ూ ఆధ్వర్యంలో కంటోన్మెంట్లోని రామన్నకుంట (లేక్) సుందరీకరణ పనులు చేపట్టేందుకు ఒక నెలలోపు ఎన్వోసీ ఇవ్వాలని రక్షణ శాఖ అధికారులను కోరినట్లు తెలిపారు.

అంతేకాకుండా, బానుక నర్మద మల్లిఖార్జున్ గారు శుభవార్త తెలియజేస్తూ రానున్న పక్షం రోజుల్లో రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కంటోన్మెంట్కు గ్రాంట్ (నిధులు) మంజూరు కాబోతున్నాయని వెల్లడించారు.

# మోండా మార్కెట్ బంగారం దుకాణంలో చోరీ




**సికింద్రాబాద్ పెన్ పవర్:** సికింద్రాబాద్ మోండ మార్కెట్ లో బంగారు షాపు తాళలు పగలగోట్టి అందులో తయారు చెసి ఉన్న అభరణలు ఎత్తుకేళ్ళారు..మార్కెట్ పోలీస్టేషణ్ పరిధిలని జర్గీష్ షాపులో బంగారు అభరణలను తయారు చెస్తుంటారు.అయితే ఉదయం షాపు షెట్టర్ తాళం పగలగోట్టి ఉండగా..లోపలికి వెళ్లి చుసే సారికి తయారు చెసి ఉన్న పదహరు తులాల బంగారు అభరణలు కనిపించలేదు..బెంగాళ్ తో పాటు ఇతర ప్రాంతల నుంచి వచ్చిన బంగారు కార్మికులు ఈ షాపులో పనిచెస్తుండగా..ఇది తెలిసిన వారి పనే కావచ్చు అంటూ పోలీసులు అవమనిస్తున్నారు.సీసీ విడియోల ను పరిశీలించిన పోలీసులు ఓ యువకుడు బ్యాగుతో వెళ్లిపోతున్న దృష్యలు కనిపించగా..అతని కోసం గాలిస్తున్నారు.

# నేటి నుండి వాహనాల షో రూంల వద్ద వాహన శాశ్వత రిజిస్ట్రేషన్

**పెద్దపల్లి: పెన్ పవర్:**రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ లో శనివారం నుండి మరిన్ని సంస్కరణల అమలుకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. కొత్త గా వాహనం కొన్న వాహన దారుడు రిజిస్టేషన్ కోసం రవాణా శాఖ కార్యాలయానికి వెల్లాలిసిన అవసరం లేదని, ఎక్కడ



వాహనం కొంటే అక్కడ షో రూమ్ ల వద్దనే వాహన శాశ్వత రిజిస్ట్రేషన్ చేయబడుతుంద ని జిల్లా అధికారులకు ఆదేశించిన్నట్లు పేర్కొన్నారు. వాహన శాఖలో అన్ని రకాల సేవలు ఆన్లైన్ లోనే చేసే విధంగా కార్యక్రమా లు కొనసాగుతున్నాయని, రా ష్ట్ర ప్రభుత్వం సారథిలో చేరడంతో దీని ద్వారా రవా ణా సేవలు సౌకర్యాలు ప్రజల కు మరింత చేరువ కానున్న ట్లు మంత్రి తెలిపారు. అలాగే రవాణా శాఖ ఈవి పాలసీ, స్క్రాప్ పాలసీ, తీసుకొచ్చింద ని, ప్రజలంతా సహకరించాల ని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## తెలంగాణలో వీధి కుక్కల హననం..

# పోలీసులకు ఫిర్యాదుల వెల్లువ!

**హైదరాబాద్, జనవరి 24 పెన్ పవర్:** తెలంగాణలో కొన్ని రోజులు వీధికుక్కల అంశం వార్తల్లో నిలుస్తోంది. పంచాయతీ ఎన్నికల సమయంలో బరిలో నిలిచిన అభ్యర్థులు తమను ఎన్నికల్లో గెలిపిస్తే కుక్కలు, కోతులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు కొందరు కోతులను పట్టేవారిని పిలిపించి వాటిని పట్టించి అటవుల్లో విదిలేస్తున్నారు. ఇక కొందరు గ్రామస్తులను ఇబ్బంది పెడుతున్న వీధి కుక్కలకు విషం పెట్టి చంపేస్తున్నారు. దీనిపై ఇటీవలే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాజీ భార్య రేణుదేశాయ్, టీవీ యాంకర్, నటి రష్మీ ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నీరు పెట్టుకున్నారు. ఈ క్రమంలో జంతు సంరక్షణ సంస్థలు గ్రామ పంచాయతీ నాయకులపై ఆరోపణలు చేశాయి. పోలీసులు ఫిర్యాదులు చేస్తున్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.కామారెడ్డి జిల్లా మాచారెడ్డి పోలీసు స్టేషన్ పరిధిలో భవానీపేట, పాల్వంచ, ఫరీద్‌పేట్ గ్రామాల్లో 244 కుక్కలు చంపినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు స్టేట్ యానిమల్ ఫౌండేషన్ నుంచి ఏ.గౌతమ్ జనవరి 12న ఫిర్యాదు చేశారు. దీంతో పశు వైద్యులు పోస్ట్‌మార్టం చేసి శాంపిల్స్ ల్యాబ్‌కు పంపారు. సర్పంచుల ప్రమేయం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు.హనుమకొండ జిల్లా శాయంపేట మండలం శాయంపేట, ఆరేపల్లి గ్రామాల్లో 110 కుక్కల మరణాలకు కారణమని తొమ్మిది మందినిపోలీసులు అరెస్ట్ చేశారు. సర్పంచులు, కార్యదర్శులు ఈ చర్యకు ఒడిగట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారు గౌతమ్ ప్రకారం, స్థానికుల సహకారంతో ఇంజెక్షన్లు ఇచ్చి చంపారు. ఫోరెన్సిక్ రిపోర్టుల అంచనావేస్తున్నారు.ధర్మపురి మున్సిపాలిటీలో 40 కుక్కలు ఇంజెక్షన్లతో చంపబడ్డాయని ఫిర్యాదు అందింది. మున్సిపల్ సిబ్బంది పనే అనే ఆరోపణలు ఉన్నాయి. యాచారం గ్రామంలో వందల మంది కుక్కలను ట్రాక్టర్‌లోతరలి పూడ్చారు. ఆంధ్ర నుంచి వచ్చిన వ్యక్తులు పని చేశారని స్థానికులు చెబుతున్నారు. రెండు కేసుల్లోనూ విచారణ లేగా ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారుఆరేపల్లి సర్పంచ్ కుమారుడు రాజు మాట్లాడుతూతాము పిచ్చి కుక్కలు మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని తెలిపాడు. వాటి వ్యాధులు (చర్మ రోగాలు, ఎలర్జీ) పిల్లలు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని పేర్కొన్నాడు. ఎన్నికల వాగ్దానాల ప్రకారం చర్యతీసుకున్నామని ఒప్పుకున్నాడు. స్థానికుడు విజయ్ గ్రామస్తుల మద్దతుతో ఈ చర్య అవసరమని సమర్థించాడు. రోగ వ్యాప్తి ఆంక్షలు పెరిగాయని చెప్పారు.కేసులు బీఎన్ఎస్ సెక్షన్ 325, జంతు క్రూరత్వ నిరోధక చట్టంసెక్షన్ 11 కింద నమోదయ్యాయి. తెలంగాణలో 20222024 మధ్య కుక్క కాటు కేసులు 92,924 నుంచి 1,21,997కి పెరిగాయి. రేబీస్ మరణాలు లేకపోయినా, సమస్య తీవ్రమైంది. అయితే జంతుప్రేమికులు చట్ట ఉల్లంఘనలకు శిక్ష పడాలని డిమాండ్ చేస్తున్నారు.

## విగ్రహాలు ఉండవు.. గంటలూ మోగవు..

## సమ్మక్క, సారలమ్మ కంటే ఆమెకే తొలి పూజ..

**వరంగల్, జనవరి 24 పెన్ పవర్:** :దట్టమైన అడవి.. పక్కనే చిలకలగుట్ట.. చెంతనే జంపన్న వాగు.. అలాంటి చోట వెలిశారు సమ్మక్క, సారలమ్మ, జంపన్న, పగిడిద్దరాజు.. తాము వెలసిన ప్రాంతానికి మేడారం అని పేరు పెట్టుకున్నారు. ఏ ముహూర్తంలోఅయితే ఆదివాసి దేవతామూర్తులు తమ ప్రాంతానికి మేడారం అని పేరు పెట్టుకున్నారో.. అప్పటినుంచి ఆ ప్రాంతం భక్తజనం గుడారంగా మారిపోయింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే జాతర కన్నులపండువగా సాగుతూ ఉంటుంది. లక్షల మంది భక్తులు ఈ జాతరకు వస్తూ ఉంటారు. తద్వారా ఈ జాతర ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవంగా పేరు తెచ్చుకుంది.మేడారంలో సమ్మక్క, సారలమ్మ కు ప్రత్యేకంగావిగ్రహాలు ఉండవు. అక్కడ గంటలు కూడా మోగవు. వేదమంత్రాలు మచ్చుకు కూడా వినిపించవు. అక్కడ ఉన్నది కేవలం ప్రకృతి మాత్రమే. అ ప్రకృతిలోనే ఆ ఆదివాసి దేవతామూర్తులు కొలువై ఉన్నారు. వాస్తవానికి

## సంసద్ సభ్యుల వేతనాలు..భత్యాలపై సంయుక్త కమిటీ

**- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**పెద్దపల్లి: పెన్ పవర్:**దేశవ్యాప్తంగా సంసద్ సభ్యుల వేతనాలు, భత్యాలు, పని పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన సంయుక్త కమిటీ సమావేశం బెంగళూరులో శనివారం జరిగింది. ఈ సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులపై రోజురోజుకు పెరుగుతున్న బాధ్యతలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాల్సిన అవసరం వంటి కీలక అంశాలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల గొంతుకగా పార్లమెంట్‌లో నిరంతరం పనిచేస్తున్న ఎంపీల దృష్ట్యా, వేతనాలు, భత్యాల వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతం గా రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. అలాగే సందర్భంగా, తెలంగాణలో అతిపెద్ద పండుగ రాబోయే సమ్మక్కసారలమ్మ జాతర నేపథ్యంలో పెద్దపల్లి మీదుగా అదనపు రైళ్లను ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఉందని, అలాగే రైల్వేకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు, ఇతర సమస్యలను అత్యంత సీరియస్‌గా పరిగణించి తక్షణమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ వంశీకృష్ణ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ పెండింగ్ సమస్యల వల్ల స్థానిక ప్రయాణికులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. గ్రామీణ, పారిశ్రామిక ప్రాంతాలైన పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అనుభవిస్తున్న ఎంపీగా వంశీకృష్ణ చేసిన సూచనలు కమిటీ సభ్యులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయన ప్రస్తావించిన అంశాలను పరిగణలోకి తీసుకుంటామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారని ఎంపీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# గాలి జనార్ధన్ రెడ్డి ఇంటికి నిప్పు



**హైదరాబాద్, జనవరి 24 పెన్ పవర్:**శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులుబళ్లారి-బెళగల్లు రోడ్డులోని ఒక ప్రైవేట్ నివాస లేఅవుట్‌లో ఉన్న ఒక మోడల్ ఇంటికి నిప్పంటించారు, ఇది నగరంలో కొత్త ఉద్రిక్తతకు దారితీసింది. బళ్లారిలో బ్యానర్ సంబంధిత ఘర్షణ కొనసాగుతుండగానే తాజాగా ఈ ఘటన చోటు చేసుకున్నది.గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్ రెడ్డి మరియు ఆయన సన్నిహితుడు బి. శ్రీరాములు యాజమాన్యంలోని జి స్క్వేర్ లేఅవుట్ లోపల నిర్మించిన మోడల్ ఇంట్లో ఈ సంఘటన జరిగింది.కొనుగోలుదారులకు లేఅవుట్‌ను ప్రదర్శించడానికి నిర్మించిన ఆ నిర్మాణం ఆ సమయంలో ఖాళీగా ఉందని పోలీసులు తెలిపారు. మానవులకు ఎటువంటి గాయాలు కాలేదని నివేదించబడింది.ప్రాథమిక సమాచారం ప్రకారం, సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. కొంతమంది స్థానికులు నిర్మాణంలో మంటలు చెలరేగడం గమనించి బాధ్యులను పట్టుకోవడానికి ప్రయత్నించారు, కానీ అనుమానితులు పారిపోయారని వర్గాలు తెలిపాయి.ఈ సంఘటనపై మాజీ ఎమ్మెల్యే, జనార్ధన్ రెడ్డి సోదరుడు జి. సోమశేఖర్ రెడ్డి స్పందిస్తూ, ఈ దహనం వెనుక కాంగ్రెస్ కార్యకర్తల హస్తం ఉందని అన్నారు.జనవరి 1న జరిగిన ఘర్షణలో తమ కుటుంబానికి చెందిన ఆస్తులను తగలబెడతామని బెదిరింపులు వచ్చాయని ఆయన విలేకరులతో అన్నారు."అప్పుడు చెప్పినది ఇప్పుడు అమలు చేయబడింది. ఇది ఉద్దేశపూర్వకంగా బెదిరింపు చర్య" అని అతను చెప్పాడు.శ్రీ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ లేఅవుట్ దాదాపు 100 ఎకరాల్లో విస్తరించి ఉందని, ఈ మోడల్ హౌస్‌ను కేవలం ప్రదర్శన ప్రయోజనాల కోసమే నిర్మించారని అన్నారు."ఇది రాజకీయంగా ప్రేరేపించబడింది. వారు ళిఎమ్మెల్యే భరత్ రెడ్డిరి బహిరంగంగా దహనం చేస్తామని చెప్పారు మరియు ఈ సంఘటన దానిని రుజువు చేస్తుంది" అని ఆయన పునరుద్ఘాటించారు.అయితే, దర్యాప్తు కొనసాగుతున్నదని, ఈ దశలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని పోలీసులు హెచ్చరించారు.బళ్లారి పోలీసు సూపరింటెండెంట్ సుమన్ డి. పెన్నేకర్ ఈ సంఘటనను ధృవీకరించారు. "మా బృందం సంఘటనా స్థలాన్ని సందర్శించింది. ప్రస్తుతానికి ఏమీ స్పష్టంగా లేదు. మాకు ఇంకా ఫిర్యాదు అందలేదు" అని ఆమె ది హిందూతో అన్నారు .ఈ నెల ప్రారంభంలో భరత్ రెడ్డి మరియు జనార్దన్ రెడ్డి మద్దతుదారుల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణ తర్వాత బళ్లారి రాజకీయంగా ఉద్రిక్తంగా ఉన్న సమయంలో ఈ దహనం జరిగింది. ఈ ఘర్షణలో ఒక కాంగ్రెస్ కార్యకర్త మరణించగా, అనేక మంది గాయపడ్డారు.

## గంజాయి ముఠా దాడి: కారుతో కానిస్టేబుల్‌ను ఢీకొట్టి పరార్‌కు యత్నం!




**నిజామాబాద్: పెన్ పవర్:** జిల్లాలో గంజాయి తరలిస్తున్న ముఠా పోలీసులపై దాడికి పాల్పడింది. కారులో గంజాయి అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ సౌమ్య వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు.ఈ క్రమంలో గంజాయి ముఠా సభ్యులు ఆగకుండా కానిస్టేబుల్ సౌమ్యాను కారుతో ఢీకొట్టి అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో సౌమ్యకు తీవ్ర గాయాలు కావడంతో సహచర పోలీసులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోంది.ఘటనపై అప్రమత్తమైన పోలీసులు గంజాయి ముఠాను వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి, వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఒక వైపు సొంత జిల్లా.. మరోవైపు పార్లమెంట్ ఇన్‌చార్జ్ బాధ్యతలు

**హైదరాబాద్, జనవరి 24, పెన్ పవర్:**
రానున్న మున్సిపల్, కార్పొరే షన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి పనిచేయడమంటే రెండు పడవల్లో కాళ్లు పెట్టి ప్రయాణించడంలా రాష్ట్ర మంత్రులు భావిస్తున్నా రు. మున్సిపోల్స్‌లో భారీసంఖ్యలో మున్సిపల్,కార్పొరేషన్ స్థానాలు కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ సిద్ధం చేసుకుంది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కాం గ్రెస్ పార్టీ మంత్రులకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించింది. దీంతో సొంత నియోజకవర్గం,జిల్లాలోని మున్సిపాలిటీలను గెలిపించుకోవడంతో పాటు.. మరోవైపు ఇన్‌చార్జ్‌గా ఉన్న పార్లమెంట్ నియోజక వర్గాల్లో పార్టీ విజ యం కోసం మంత్రులు పనిచేయాల్సి ఉంటుంది.అయితే ఈ ఎన్నికల్లో ఒకవేళ ప్రతికూలఫలితాలే వస్తే, ఆ ప్రభా వం తమపై పడుతుందనే భయం మంత్రులను వెంటాడుతోంది. మం త్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు.. పురపోరులో పోటీ చేసే ఆశావహులనుంచి దరఖాస్తులు తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో వార్డుకు కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీచేసేవారు పదుల సంఖ్యలో ముందుకొ చ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో మిగతావారిని ఒప్పించి.. ప్రజల్లో పట్టున్న వారినే ఎంపిక చేయాలని పార్టీ పెద్దలు చూచించారు. ఈ విషయంలో ఎంత ప్రయత్నించినా, టికెట్ రానివారు రెబల్స్‌గా బరిలో ఉండేందుకు సిద్ధమవుతారు.ఇలాంటి సమయంలో ఇన్‌చార్జ్‌లుగా ఉన్న మంత్రు లు కీలకంగావ్యవహరించాల్సి ఉంటుంది. ఒకవేళ రెబల్స్ బుజ్జగింపులకు తలొగ్గకుండా బరిలోనే ఉంటే.. పార్టీ అభ్యర్థుల విజయంపైన ప్రభావం కనిపిస్తుంది. అది ప్రతికూలమైతే, ఫలితాల తర్వాత మిగిలేది తలవంపులేనని మంత్రులుభావిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో జరిగిన చిన్న చిన్న పొరపాట్లు.. పురపోరులో జరగకుండా చూ డాల్సి బాధ్యత కూడా మంత్రులపైనే పెట్టారు. ఇది తమకు ఒక టాస్క్‌గానే ఉంటుందని కొందరు మంత్రులుఅంతర్గతంగా ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఒక్కో డివిజన్‌కు ఒక మంత్రికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.దీనితోపాటు 100 ఓట్లకు ఒక పార్టీ నాయకుడిని నియమించడంవల్లే విజయం సాధ్యమైందనే విషయం వారు గుర్తుచేస్తున్నారు. కానీ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నిక ల్లో ఇటు సొంత జిల్లాలు, అటు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్న పార్లమెంట్ నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు,కేడర్‌ను సమన్వయం చేయడం, రెండుచోట్లా అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేయడం అంత సులువైన పనేమి కాదనే చర్చ జరుగుతోంది. ఒక్కో పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనిమున్సిపాలిటీలతో పాటు సొంత నియోజకవర్గంలో ప్రచారం చేయడం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

# అనర్హులకు ఐఏఎస్ హోదా ?

# పనిచేసిన సామాజిక ఫార్ములా

**హైదరాబాద్, జనవరి 24, పెన్ పవర్: )**
తాజాగా 16 మంది రెవెన్యూ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఇలా ఐఏఎస్ కన్‌ఫర్మ్ అయి న వారిలో చాలా మంది అనర్హులు ఉన్నారని, అయినా.. ఇటు రాష్ట్రదస్థాయిలో పెద్దల ఆశీస్సులు అందుకుంటూ.. ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా అనర్హులకు ఐఏఎస్ హోదా ఇచ్చారంటూ.. అటు రెవెన్యూ శాఖ అధికారుల్లోనూ తీవ్ర అసంతృప్తి




**వ్యక్తంకావడం గమనార్హం.**

గతంలో రిటైర్డ్‌మెంట్ (60 ఏండ్లు)కు 5 ఏండ్ల కన్నా ముందు ఐఏఎస్ కన్‌ఫర్మ్ చేయరాదనే నిబంధన ఉండేది. తరువాత దానిని మూడేండ్లకు తగ్గించారు. అయితే తాజాగా ఐఏఎస్ కన్‌ఫర్మ్ చేసిన జాబితాలో ఇద్దరుఅధికారుల పుట్టిన సంవత్సరం 1966 జూన్‌గా ఉంది. అంటే మరో ఆరు నెలల్లో వారు రిటైర్డ్ అవుతారు. మరి వారికి ఎలా వచ్చిందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

లి ఏసీబీ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణలు ఎదుర్కొంటున్న అధికారులకు ఐఏఎస్ కన్‌ఫర్మ్ చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయితే తాజాగా కన్‌ఫర్మ్ చేసిన జాబితాలో ఒక అధికారి..

గతంలో ఒక మంత్రి వద్ద పనిచేశాడని, ఆయనపై ఈడీ కేసు నమోద య్యి, విచారణ ఎదుర్కొంటున్నారు. మరి ఆయనకు ఎలా ఐఏఎస్ కన్‌ఫర్మ్ చేశారనేది కేంద్ర డీవోపీటీ అధికారులకే తెలియాలి. ఇందులో 'రెడ్డి'

ఫార్ములా ప్రయోగించారని, అందుకే రాష్ట్రం నుంచి ఆయన పేరు ఢిల్లీకి వెళ్లిందని, అక్కడ కూడా మేనేజ్ చేయడంతో కేసుల విషయాలను పట్టించు కోకుండా ఐఏఎస్ కన్‌ఫర్మ్ అయ్యిందనే ఆరోపణలు బలంగావినపడుతున్నాయి. పైగా తాజాగా వరంగల్ జిల్లాకు చెందిన ఒక అధికారి ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. వాస్తవానికి ఆ అధికారి పేరు కూడా ఈ జాబితాలో ఉండేందుకు ప్రయత్నించారని.. అయితే ఏబీసీకేసు ఉండటంతో.. ఆయన పేరును పక్కనపెట్టారని చర్చ జరుగుతోంది. మరి అలాంటప్పుడు ఈడీ కేసు ఉన్న అధికారికి ఐఏఎస్ కన్‌ఫర్మ్ ఎలా చేస్తారంటూ రెవెన్యూ అధికారులే ప్రశ్నిస్తున్నారు.

లి వాస్తవానికి ప్రతియేటా ఐఏఎస్ కన్‌ఫర్మ్ చేయాలంటే.. సీనియారిటీ లిస్ట్‌ను తయారు చేయాల్సి ఉంటుంది. ఇందుకు నోటిఫికేషన్ ఇవ్వాలి. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫైల్ చేయాలి. వాటికి క్లారిఫికేషన్ తీసుకోవాలి.కానీ ఈ సందర్భంలో మాత్రం ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలే దు. జాబితా తయారు చేయలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మా త్రం కేంద్రానికి అధికారుల జాబితా వెళ్లింది. వారికే గుడ్డిగా ఐఏఎస్ కన్‌ఫర్మ్‌చేస్తూ..ఉత్తర్వులు వెలువ డ్డాయి. అంటే తెరవెనుక మతలబు ఏం జరిగి ఉంటుందో ఊహించు కోవచ్చు. వాస్తవానికి 1995లో గ్రూప్ 2ఏ కింద (ఏపీపీఎస్సీ) డిప్యూటీ తాసీల్దారులు (నాన్ గెజిటెడ్)గా కొందరు ఉద్యోగంలో చేరారు. నిబంధనల ప్రకారం గ్రూప్- 2ఏ క్యాడర్ అధికారులకు ఐఏఎస్ కన్‌ఫర్మ్ చేయకూడదు.

కానీ ప్రస్తుతం ఐఏఎస్ కన్‌ఫర్మ్ అయినవారిలో పలువురు అధికారులు గ్రూప్-2ఏ అధికారు లే ఉన్నారు. ఇదెలా సాధ్యం.

తెలంగాణ ఏర్పడిన తరువాత గ్రూప్-1 పరీక్షలు నిర్వహించనందున గతంలో గ్రూప్-2ఏ అధికారులుగా జాయిన్ అయిన వారికి ఐఏఎస్ కన్‌ఫర్మేషన్ కోసం పంపించామని కొందరు సీనియర్ అధికారులు అనడాన్ని

**రెవెన్యూ అధికారులు ఎత్తిచూపుతున్నారు.**

పలువురు అనర్హులకు, నిబంధనలను పక్కనపెట్టి, లోపాయికారీగా ఐఏఎస్ కన్‌ఫర్మ్ చేశారంటూ మనీష్‌తివారీ అనే సుప్రీంకోర్టు న్యాయవాది తాజాగా యూపీఎస్‌ఈకి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ప్రకారం..

డిప్యూటీ కలెక్టర్‌గా ఏ తేదీన జాయిన్ అయ్యారనేది పట్టించుకోకుండా ఐఏఎస్ కన్‌ఫర్మ్ చేశారు. ఉదాహరణగా.. ఒక అధికారి 15.2.2017 నాడు అడ్‌హాక్ పద్ధతిలో డిప్యూటీ కలెక్టర్‌గా జాయిన్ అయ్యారు. అయితేప్రస్తుతం ఐఏఎస్ కన్‌ఫర్మ్ కోసం సదరు అధికారి జాయినింగ్ తేదీని 1.8.2014 గా చూపెట్టారు. అలాగే మరో అధికారి డిప్యూటీ కలెక్టర్‌గా 12.7.2016 నాడు జాయిన్ అయితే.. 2.6.2014గాచూపెట్టారంటూ న్యాయవాది చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.పైగా 2014 నుంచి డిప్యూటీ కలెక్టర్ల సీనియారిటీ జాబితాలను తయారు చేయలేదని, ఈ విషయంలో అనేక వివాదాలపై హైకోర్టులోనూ కేసులున్నాయని న్యాయవాది ఫిర్యాదు చేశారు.

సీసీఎల్ఏ మెమో నెం.సీసీఎల్ఏ-ఎస్ఈఆర్/డీసీఎస్ఎం/04/2024, తేది 6.11.2025 ప్రకారం.. డిప్యూటీ కలెక్టర్ల ప్రమోషన్ ప్యానళ్లను తయారుచేస్తున్నామని, సీనియారిని జాబితా సిద్ధం చేయాల్సి ఉందని తెలిపారు. కానీ ఐఏఎస్ కన్‌ఫర్మ్ చేస్తూ.. జాబితా వచ్చేసింది. మతలబు ఏమిటి?

వీటన్నింటిపైనా విచారణ చేయాలని, కన్‌ఫర్మ్‌చేసిన అధికారుల జన్మతేదీ, అపాయింట్‌మెంట్ తేదీ, డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి చెందిన తేదీ, సీనియారిటీ జాబితాలను పరిశీలించాలని సదరు న్యాయవాది ఫిర్యాదు చేశారు.2022 నుంచి 2024 సంవత్సరాలకు సంబంధించి మొత్తం 16 మంది తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ అధికారులకు (రెవెన్యూ శాఖ) ఐఏఎస్ కన్‌ఫర్మ్ చేస్తూ ఈనెల 21న కేంద్ర ప్రభుత్వం (డీవోపీటీ) ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో 2022 సంవత్సరానికి సంబంధించి మొత్తం 11 మంది అధికారులు, 2023 సంవత్సరానికి సంబంధించి ముగ్గురు, 2024కు సంబంధించి ఇద్దరు.. మొత్తం 16 మంది అధికారులకు ఐఏఎస్ హోదా ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ జాబితా రిలీజ్ అవుతుండగానే ఒక్కసారిగా విమర్శలు మొదలయ్యాయి.పూర్తిగా నిబంధనలు పక్కనపెట్టి.. తమ అనుకున్నవారి జాబితాను కేంద్రానికిపంపించారని, దీనిపై కేంద్రం విచారించకుండానే జాబితాను అమోదించి.. ఐఏఎస్ హోదా ప్రకటించినట్టుగా రెవెన్యూ ఉద్యోగులే గగ్గోలు పెడుతున్నారు. మొత్తానికి ప్రభుత్వంలో ఉన్న పెద్దవాళ్ల ఆశీస్సులతోనే ఇలాజరిగిందని.. అనర్హులకే అందలమెక్కించారని విమర్శలు వస్తున్నాయి

# మళ్లీ రాజకీయాల్లోకి విజయసాయిరెడ్డి

**నెల్లూరు, జనవరి 24, పెన్ పవర్:**
మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి మరోసారి..ఇన్ అండ్ ఔట్..క్లియర్ కట్ కామెంట్స్ చేసి చర్చకు దారితీశారు. ఒకప్పుడు జగన్‌కు ఆయన కుడిభుజం. ఇప్పుడు ఆయన వైసీపీ పార్టీలో లేరు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడే తాను వైసీపీలో నెంబర్.2 అని..ఎప్పుడైతే పవర్‌లోకి వచ్చారో..అప్పటినుంచి తనను పక్కకు పెట్టేశారని చెప్పేస్తున్నారువన్స్ మోర్ అంటూ మళ్లీ పొలిటికల్ రీఎంట్రీ అంటూ ఇంట్రెస్టింగ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. జగన్‌ను తానెప్పుడు విమర్శించలేదని..ఆయనే తాను అమ్ముడుపోయినట్లు మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేస్తున్న విజయసాయిరెడ్డి..జనసేన, బీజేపీ, టీడీపీ కూటమిగా ఉంటే వైసీపీ అధికారంలోకి రావడం కష్టమని తేల్చేశారు. అయితే విజయసాయిరెడ్డి కామెంట్స్ చుట్టూ ఇప్పుడు ఇంట్రెస్టింగ్ డిస్కషన్ జరుగుతోంది. పదేపదే జగన్ కోటరీని టార్గెట్ చేస్తున్న విజయసాయిరెడ్డి..జగన్‌పై మాత్రం సీరియస్ కామెంట్స్ చేయకపోవడం ఆసక్తికరంగా మారింది. పైగా వైసీపీ అధినేతను, ఫ్యాన్ పార్టీ క్యాడర్, లీడర్లను అలర్ట్ చేస్తున్నట్లు మాట్లాడుతున్నారు. కోటరీ అంటూనే ఎవరి పేర్లు తీయకుండా..వైసీపీ క్యాడర్‌కు ఓ ఇండికేషన్ పంపించేలా..తనపై వైసీపీ నేతల్లో, ఫ్యాన్ పార్టీ కార్యకర్తల్లో సానుభూతి పెంచుకునేలా ఆయన వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాదు చంద్రబాబును టార్గెట్ చేస్తూ..తాను ఎవరి పక్షం కాదని చెప్పుకునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు విజయసాయిరెడ్డి మదిలో ఏముంది.? ఆయన పొలిటికల్ రీఎంట్రీ ఏ పార్టీలోకి.? అన్నది చర్చనీయాంశంగా మారింది. విజయసాయిరెడ్డి ఏ పార్టీలో చేరబోతున్నారనేది ఉత్కంఠ రేపుతోంది. దశాబ్దన్నర రాజకీయ జీవితం ఆయనది. వైసీపీలో జగన్ తర్వాత నంబర్ టూగా ఒక వెలుగు వెలిగిన ఆయన, వైసీపీని వీడిపోతారని ఎవరూ అనుకోలేదు. కానీ అది జరిగిపోయింది. ఇక ఆయన లేటెస్ట్‌గా ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ విచారణకు హాజరైన తర్వాత..మీడియాతో మాట్లాడుతూ తాను మళ్లీ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. సేమ్‌టైమ్ జగన్‌ను సేవ్ చేసేలా కామెంట్స్ చేశారన్న టాక్ కూడా వినిపిస్తోంది. అదంతా పక్కన పెడితే విజయసాయిరెడ్డి చేరేది ఏ పార్టీలో అన్నదానిపై అయితే పెద్ద చర్చే నడుస్తోంది. అయితే ఆ ప్రశ్నకు సాయిరెడ్డి చెప్పిన సమాధానమే..రకరకాల చర్చలకు దారితీస్తోంది. తొందర ఎందుకు వేచి చూద్దామంటున్నారంటే



సమ్‌థింగ్ ఈజ్ దేర్ అన్న టాక్ అయితే బయలుదేరింది.జగన్ పిలుపు కోసం వెయిట్ చేస్తున్నారా.? పవన్ పార్టీలోకి వెళ్తారా.? బీజేపీ డోర్స్ ఓపెన్ చేసి లేవా అన్నది అంతుచిక్కడం లేదు. వెయిట్ అండ్ సి అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు ఆస్కారం ఇస్తున్నాయి. విజయసాయిరెడ్డి అయితే కచ్చితంగా తాను రాజకీయాల్లో కంటిన్యూ అవుతాను అని చెప్పేశారు.జగన్ కంటే ఆయన కోటరీపైనే గురి పెట్టారు విజయసాయిరెడ్డి. జగన్ చుట్టూ ఉన్న కొందరు నేతల తీరే గత ఎన్నికల్లో పార్టీ ఓటమికి కీలక కారణమని వైసీపీ నేతలే గుసగుసలు పెట్టుకుంటుంటారు. సాయిరెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుంటారు. ఇప్పుడదే అస్త్రాన్ని వాడుకుని తిరిగి జగన్‌కు దగ్గరయ్యేందుకు..తిరిగి వైసీపీలోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సాయిరెడ్డి ఆరాట పడుతున్నారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.చంద్రబాబును సాయిరెడ్డి టార్గెట్ చేయడం చర్చగా మారింది. తనను చంద్రబాబు టార్గెట్ చేస్తున్నారన్నట్లుగా మాట్లాడారు. దాంతో ఆయన చేరే పార్టీ టీడీపీ కూడా కాదన్నది స్పష్టం అవుతోంది. జనసేనలో చేరాలనుకున్నా టీడీపీని వ్యతిరేకించే వారిని తీసుకునే చాన్స్ ఉండదని అంటున్నారు. దాంతో బీజేపీలోనే విజయసాయిరెడ్డి చేరుతారన్న టాక్ అయితే నడుస్తోంది. బీజేపీ కూడా కూటమి ప్రభుత్వంలో భాగంగా ఉన్నా అది జాతీయ పార్టీ. పైగా విజయసాయిరెడ్డి కూడా ఢిల్లీ వేదికగా నేషనల్ పాలిటిక్స్‌లోనే కొనసాగాలని భావిస్తున్నారట.దాంతో ఏపీకి సంబంధం లేకుండా ఆయన సేవలను వాడుకోవాలనుకుంటే బీజేపీ ఆయనను చేర్చుకోవచ్చు. విజయసాయిరెడ్డి కూడా బీజేపీపై సానుకూలంగా ఉన్నారని అంటున్నారు. బీజేపీ అగ్రనేతలతో సాయిరెడ్డికి మంచి రిలేషన్స్ ఉన్నాయని చెబుతుంటారు. ఇక విజయసాయిరెడ్డి వదిలేసిన రాజ్యసభ సీటు బీజేపీ నేతకే వెళ్లడం బట్టి చూస్తే ఆయన కాషాయం కండువాను కప్పుకునే చక్రం తిప్పే రోజులు రాబోతున్నాయన్న చర్చ అయితే మొదలైంది. సాయిరెడ్డి దారెటో.? ఆయన ఏ పార్టీలో చేరుతారో.? రాజకీయ పరిస్థితులే డిసైడ్ చేయాలి.

# విజయనగరంలో కొత్త పోలీస్ స్టేషన్లు

**విజయనగరం, జనవరి 24, పెన్ పవర్:**
విజయనగరం జిల్లాలో రెండు పోలీసు స్టేషన్లను ప్రారంభించబోతున్నారు. జిల్లాలో జనాభా పెరుగుదల, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నేపథ్యంలో ఈ 2 కొత్త పోలీస్ స్టేషన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. నెలఖరులోగా కార్యకలాపాలు మొదలయ్యేలా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. విజయనగరంలో ఏళ్ల నాటి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రతిపాదనకు ఆమోదం లభించగా, భోగాపురంలో విమానాశ్రయం కోసం ప్రత్యేకంగా మరో స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇవి శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించనున్నాయి.విజయనగరం జిల్లాలో త్వరలోనే కొత్తగా రెండు పోలీస్ స్టేషన్లు ప్రారంభం కానున్నాయి. జనవరి నెలఖరులోగా ఈ రెండు పోలీస్ స్టేషన్ల కార్యకలాపాలు మొదలవుతాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. విజయనగరంలో పెరుగుతున్న జనాభాకు మెరుగైన సేవలు అందించేందుకు గాను అధికారులు ఈ రెండు పోలీస్ స్టేషన్లను ప్రారంభించబోతున్నారు. వీటిలో ఎన్నో ఏళ్ల నాటి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కూడా ఉంది. అలాగే, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటం వల్ల.. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని.. ప్రత్యేకంగా మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు స్టేషన్లు ప్రజలకు మరింత చేరువగా ఉండి, శాంతిభద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. విజయనగరంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గత పది సంవత్సరాలుగా ఎన్నోసార్లు ప్రతిపాదించారు. వీటికి తాజాగా ఆమోదం లభించింది.విజయనగరంలో జనాభా విపరీతంగా పెరిగిపోవడంతో, ప్రస్తుతం ఉన్న రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు సేవలు అందించడం కష్టమవుతోందని గుర్తించారు. ఈ నేపథ్యంలో, కేఎల్ పురం, కణపాక ప్రాంతాల్లో కొత్త స్టేషన్ ఏర్పాటుకు స్థల సేకరణ జరుగుతోంది.




నెలఖరులోగా తాత్కాలిక భవనంలో ఈ స్టేషన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, అక్కడ ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భోగాపురం పోలీస్ స్టేషన్‌తో పాటు, విమానాశ్రయం పరిధిలో ప్రోటోకాల్, ట్రాఫిక్ నియంత్రణ వంటి ప్రత్యేక అవసరాల కోసం ఈ కొత్త పోలీస్ స్టేషన్ మంజూరైంది. భోగాపురం విమానాశ్రయం పనులు చివరి దశకు చేరుకున్నాయి. తాజాగా నిర్వహించిన ట్రయల్ రన్ కూడా విజయవంతమైంది.
జూలై నుంచి భోగాపురం విమానాశ్రయం సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని.. భోగాపురం విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ప్రారంభం కాకముందే, స్టేషన్ ఏర్పాటు, అధికారుల నియామకంపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఈ రెండు పోలీస్ స్టేషన్ల ఏర్పాటు జరుగుతోందని అధికారులు అంటున్నారు.

# ఏప్రిల్ 19న ఛార్ ధామ్ యాత్ర

**న్యూఢిల్లీ, జనవరి 24, పెన్ పవర్:**
ప్రపంచ ప్రఖ్యాత చార్‌ధామ్ దర్శనం కోసం లక్షలాది మంది భక్తులు ఎదురుచూస్తున్నారు. దేశం నలుమూలల నుంచేగాక ఈ ఆలయాల సందర్శన కోసం విదేశాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ఇప్పటికే చాలా మంది యాత్రికులు ట్రావెల్స్, రైళ్లు, విమానాల కూడా టికెట్ బుక్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఛార్‌ధామ్‌కు సంబంధించి యాత్రికులకు అక్కడి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2026లో చార్‌ధామ్ యాత్ర గత సంవత్సరం కంటే 11 రోజులు ముందుగానే ప్రారంభమవుతుంది. ఈ యాత్ర ఏప్రిల్ 19న, అక్షయ తృతీయ పవిత్ర పండుగ రోజున, గంగోత్రి, యమునోత్రి పుణ్యక్షేత్రాల తలుపులు తెరవడంతో ప్రారంభమవుతుంది. గత సంవత్సరం (2025), చార్‌ధామ్ యాత్ర ఏప్రిల్ 30న ప్రారంభమైంది. కానీ ఈ సంవత్సరం తేదీల శుభ యాదృచ్ఛికం కారణంగా.. ఏప్రిల్ 19నే యాత్ర సందర్శన ప్రారంభిస్తున్నారు.
ప్రయాణ సమయం పెరగడం వల్ల దేశం, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే యాత్రికులకు దర్శనం కోసం ఎక్కువ సమయం లభించనుంది. అంతేగాక, స్థానిక హోటళ్ల యజమానులు, టాక్సీ ఆపరేటర్లు, వ్యాపారవేత్తలకు మంచి లాభాలను తీసుకురానుంది. ఈ అదనపు సమయం పర్యాటక వ్యాపారాన్ని గణనీయంగా పెంచుతుందని స్థానికులు చెబుతున్నారు. చార్ ధామ్ యాత్ర ప్రారంభానికి అక్షయ తృతీయ ఒక ప్రత్యేక రోజుగా పరిగణించబడుతుంది. హిందూ పంచాంగం ప్రకారం,
అక్షయ తృతీయ వైశాఖ మాసంలోని ప్రకాశవంతమైన పక్షంలో మూడవ రోజున వస్తుంది. 'అక్షయం' అంటే ఎప్పటికీ క్షీణించనది అని ర్థం. గ్రంథాల ప్రకారం.. ఈ రోజున చేసే దానధర్మాలు, జపాలు, పుణ్యకార్యాలు శాశ్వత ఫలాలను ఇస్తాయి. ఈ రోజు సత్య యుగం, త్రేతా యుగాల ప్రారంభంగా పరిగణించబడుతుంది. ఈ రోజు బద్రీనాథ్ ధామ్, గంగోత్రి-యమునోత్రి ద్వారాలు తెరవడానికి అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇది కొత్త ప్రారంభాలు, శ్రేయస్సును సూచిస్తుంది.గత ఎదురైన ప్రతికూల పరిస్థితులు.. 2025 తీర్థయాత్ర అనేక ప్రతికూల పరిస్థితులు చోటు చేసుకున్నాయి. సరిహద్దు ఉద్రిక్తతలు, తదనంతరం ధరాలిలో ప్రకృతి వైపరీత్యాలు యాత్రికులకు ఆటంకం కలిగించాయి. భద్రతా కారణాల దృష్ట్యా పరిపాలన అనేకసార్లు తీర్థయాత్రను నిలిపివేయవలసి వచ్చింది. ఈ అనుభవాల దృష్ట్యా, ఈసారి పరిపాలనా యంత్రాంగం ఇప్పటికే అన్ని విధాలా అప్రమత్తంగా ఉంది.సన్నాహాలు ముమ్మరంగా.. వాటిపై నిషేధం.. చార్‌ధామ్ యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. తీర్థయాత్రకు సంబంధించిన ప్రాథమిక సన్నాహాల సమీక్షను పూర్తి చేశారు. రోడ్డు మరమ్మతులు, తాగునీటి ఏర్పాట్లు, యాత్రికుల నమోదు కోసం ఒక బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నారు. భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చార్‌ధామ్ ఆలయాల్లో మొబైల్ ఫోన్లను నిషేధిస్తున్న ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.

## అన్నమయ్య జిల్లాలో కొండచిలువల కలకలం

**అన్నమయ్య: పెన్ పవర్:** పుంగనూరు మండలం మర్రిమాకులపల్లి గ్రామ సమీపంలోని ఓ మామిడి తోటలో రెండు భారీ కొండచిలువలు కలకలం రేపాయి. సుమారు 13 అడుగుల పొడవు ఉన్న ఈ కొండచిలువలను పశువులను మేపేందుకు వెళ్లిన గ్రామస్థులు గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న బీట్ ఆఫీసర్ శోభనాద్రి నేతృత్వంలోని రెస్క్యూ బృందం అక్కడికి చేరుకుని మూడు గంటల పాటు శ్రమించి చాకచక్యంగా రెండు కొండచిలువలను పట్టుకుంది. అనంతరం వాటిని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టినట్లు అధికారులు తెలిపారు.

## ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును ఢీకొన్న ఆర్టీసీ బస్సు!

**మార్కాపురం: పెన్ పవర్:** జిల్లాలోని కొనకనమిట్ల మండలం చిన్నారికట్ల వద్ద నిలిచి ఉన్న ప్రైవేట్ బస్సును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, 12 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఫ్రీగా గూగుల్ ఏఐ కోర్సు..




**హైదరాబాద్, జనవరి 24, పెన్ పవర్:** ఎక్కడ చూసినా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ హవా నడుస్తుంది. ఏఐ స్కిల్స్ ఉన్న వారికే జాబ్ మార్కెట్లో ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, సాఫ్ట్‌వేర్, మీడియా సహా ఏ రంగం చూసినా ఏఐ వాడేస్తున్నారు. ఈ క్రమంలో భారతీయ విద్యార్థుల కోసం గూగుల్ ఏకంగా 3 వేలకుపైగా ఏఐ, టెక్ కోర్సులను ఉచితంగా అందిస్తుంది. ఈ ఏడాది గూగుల్ అందించిన అతిపెద్ద ఏఈ అవకాశాలలో ఇది ఒకటి. చాలా మంది ఇప్పటికే ఏఐ కోర్సుల్లో చేరి నైపుణ్యాలను ఒరిసి పట్టుకుంటున్నారు. గూగుల్ ఆఫర్ చేస్తున్న ఈ కోర్సులు ఎందుకూ పనికిరాని సర్టిఫికెట్ కోర్సులుగా భావిస్తే తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ఇది కేవలం యాదృచ్ఛిక అభ్యాస పోర్టల్ కాదు. నిజానికి ఏఈ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి పలు సాంకేతికతలను రూపొందించిన గూగుల్ బృందాలచే రూపొందించబడిన కోర్సులు ఇవి.ప్రముఖ దిగ్గజ టెక్ కంపెనీలైన డెలాయిట్, యాక్సెంచర్‌తో సహా 150కి పైగా కంపెనీలు గుర్తించే నిజమైన సర్టిఫికేషన్‌లు ఇవి. ఈ ప్రోగ్రామ్‌లను పూర్తి చేసిన అభ్యర్థులను మాత్రమే ఈ కంపెనీలు నియమించుకుంటున్నాయి. బిగినర్స్ సర్టిఫికేట్‌ల్ను నైపుణ్యం బ్యాడ్జ్‌ల్ను గూగుల్ క్లౌడ్ సర్ట్‌లు వంటి మూడు స్థాయిల్లో ఈ కోర్సులను గూగుల్ అందిస్తుంది. ముఖ్యంగా ఏఈ, డేటా, క్లౌడ్, ఆటోమేషన్‌లోని కీలక జాబ్ రోల్స్‌కు ఈ నైపుణ్యాలు చాలా అవసరం. స్కిల్ బ్యాడ్జ్‌లను ప్రారంభ స్థాయి నుంచే సంపాదించవచ్చు. పరిశ్రమ గుర్తింపు పొందినగూగుల్ క్లౌడ్ ధృవీకరణలకు అన్ని విధాలుగా మార్పు చేసుకోవచ్చు. దీనితో పాటు ప్రతి నెలా 35 ఉచిత క్లౌడ్ క్రెడిట్‌లను కూడా పొందొచ్చు.కాబట్టి మీరు కేవలం వీడియోల కోసం మాత్రమే కాదు.. దిగ్గజ టెక్ కంపెనీలు ఫోకస్ చేసే నిజమైన ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే అనేక మంది లింక్డ్‌ఇన్‌లో పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుంటూ, తమ ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటున్నారు. కెరీర్‌లో దూసుకుపోవాలనుకునే వారు వీటిని నేర్చుకోవడం మరింత తెలివైన పని అని నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు. కంపెనీల్లో ఎక్కువగా డిమాండ్ ఉన్న స్కిల్స్ ఏమిటో తెలుసుకుని.. వాటిని పెంపొందించుకుంటే భవిష్యత్తు మీదే అని అంటున్నారు. కంపెనీలకు డిగ్రీల అవసరం కంటే నైపుణ్యం ఉన్న వ్యక్తులు అవసరం. కేవలం ఏఐ నేర్చుకోవడం మాత్రమే కాదు. గూగుల్ నిశ్శబ్దంగా తన భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌ను నిర్మిస్తోందన్న సంగతి మర్చిపోకూడదు. వారు ఇప్పుడు ఉచితంగా ఈ కోర్సుల్లో చేరమని ఆహ్వానిస్తున్నారు. ఏఐలో గెలిచిన వారంతా ఫ్యాన్సీ డిగ్రీలు ఉన్నవారు కాదు. వారు వాస్తవాన్ని గ్రహించి స్కిల్స్ పెంపొందించుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే ఏఐ యుగం ప్రారంభం అవుతోంది. ఈ క్రమంలో ఏఐ రైలు ఎక్కేందుకు గూగుల్ మీకు ఫస్ట్-క్లాస్ టిక్కెట్‌ను అందజేస్తుంది.

## జనాభా లెక్కల నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ, జనవరి 24, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జనాభా లెక్కల ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జనాభా లెక్కల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తూ, మొదటి దశలో ఇండ్ల గణన కోసం అడిగే 33 ప్రశ్నల జాబితాను వెల్లడించింది. డిజిటల్ పద్ధతిలో జరగనున్న ఈ భారీ ప్రక్రియ కోసం యంత్రాంగం ఇప్పటికే సిద్ధమైంది. తొలి దశలో మీ ఇంటి పరిస్థితి, కుటుంబ సభ్యుల వివరాలు, వసతులపై దృష్టి సారించనున్నారు.
సర్వేయర్లు అడిగే ప్రశ్నల జాబితా ఇలా ఉంది
ఇంటి నిర్మాణం: ఇంటి గోడలు, పైకప్పు, ఫ్లోరింగ్‌కు వాడిన పదార్థాలు ఏంటి?
నివాస వివరాలు: ఇంటి సంఖ్య, ఇంటి యాజమాన్య స్థితి, కుటుంబంలో నివసిస్తున్న వివాహిత జంటల సంఖ్య, గదుల సంఖ్య.
కుటుంబ పెద్ద వివరాలు: యజమాని పేరు, వారు షెడ్యూల్డ్ లేదా ఇతర వర్గాలకు చెందినవారా అనే సమాచారం.
కనీస వసతులు: తాగునీటి వనరు, నీటి లభ్యత, కరెంటు సౌకర్యం, మరుగుదొడ్డి రకం, డ్రైనేజీ వ్యవస్థ వివరాలు.
వంటగది: వంటకు వాడుతున్న ఇంధనం , వంటగది సౌకర్యం ఉందా లేదా?
డిజిటల్ ఆస్తులు ఇతర వస్తువుల వివరాలు
రేడియో- ట్రాన్సిస్టర్, టెలివిజన్.
ఇంటర్నెట్ సౌకర్యం, ల్యాప్‌టాప్, కంప్యూటర్.
మొబైల్ ఫోన్, స్మార్ట్‌ఫోన్ వివరాలు
సైకిల్, స్కూటర్, కారు లేదా వ్యాన్ వివరాలు.
ప్రధానంగా వినియోగించే తృణధాన్యాల వివరాలు
ఎంతమందికి ఒక సర్వేయర్?
ఈ బృహత్తర కార్యాన్ని నిర్వహించడానికి భారత రిజిస్ట్రార్ జనరల్ కఠిన నిబంధనలను రూపొందించారు:
సర్వేయర్లు: 1990 జనాభా లెక్కల చట్టం ప్రకారం ఉపాధ్యాయులు, ప్రభుత్వ గుమస్తాలు, స్థానిక అధికారులను ఎన్యూమరేటర్లుగా నియమిస్తారు.
పని భారం: ప్రతి సర్వేయర్‌కు 700 నుండి 800 మంది జనాభాను లెక్కించే బాధ్యత అప్పగిస్తారు.
పర్యవేక్షణ: ప్రతి ఆరుగురు సర్వేయర్లకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు. అత్యవసర పరిస్థితుల కోసం 10శాతం అదనపు సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతారు.
అధికారులు: జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్లు, మేజిస్ట్రేట్లు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారు.
రెండవ దశ ఎప్పుడు?
మొదటి దశ గృహ గణన పూర్తయిన తర్వాత, రెండవ దశలో అసలైన జనాభా గణన ఉంటుంది. దీనికి సంబంధించిన ప్రత్యేక షెడ్యూల్, నోటిఫికేషన్ తర్వాత విడుదల చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.


Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన డిమాండ్ ఇదేనా?



**విజయవాడ, జనవరి 24, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉంది. అయితే ఇప్పటి నుంచే ఆసక్తికరమైన రాజకీయచర్చలు మొదలవుతున్నాయి. కూటమి వచ్చే ఎన్నికల్లో కొనసాగుతుందా? అటే 90 శాతం కొనసాగుతుందని అందరూ చెబుతున్న మాట. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఈసారి మాత్రం బీజేపీ, జనసేనఒక్కటిగా మారి టీడీపీకి సీట్ల పొత్తుల విషయంలో కొంత ఒత్తిడి తెచ్చే అవకాశముందని అంటున్నారు. పవన్ కల్యాణ్, బీజేపీ ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న రాజకీయ పరిణామాల పై సైలెంట్ వ్యవహరిస్తుండటాన్ని ఇందుకు ఉదహరిస్తున్నారు. ఈసారి నియోజకవర్గాల సంఖ్య పెరగడం ఖాయంగా కనిపిస్తుంది. అదే సమయంలో తమ వాటా సంఖ్య కూడా పెంచాలని బీజేపీ, జనసేన కోరే అవకాశాలు మెండుగా ఉన్నాయి.జగన్ చేసే విమర్శలకు బీజేపీ నేతల నుంచి పెద్దగా స్పందన రావడం లేదు.అలాగే జనసేన నేతలు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. జగన్ ప్రభుత్వంపై చేసే విమర్శలకు టీడీపీ నేతలే సమాధానమివ్వాల్సి వస్తుంది. మిత్ర పక్షాలు జగన్ చేసే విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం లేదు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులుగా ఉన్న ఆ రెండు పార్టీలు తమ శాఖకు సంబంధించిన వాటిపై వచ్చిన విమర్శలకు మాత్రమే సమాధానమిస్తున్నారు తప్పించి అంతకు మించి టచ్ మి నాట్ గా వ్యవహరించడం కూడా ఈ చర్చకు దారి తీస్తుంది. 2024 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చెప్పినట్లుగానే, ఆయన అంకెలకు రెండు పార్టీల నేతలు ఓకే చెప్పారు.అందుకే 2024 ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య సీట్ల పంపకంలో పెద్దగా విభేదాలు తలెత్తలేదు. కానీ 2029 ఎన్నికలకు మాత్రం పరిస్థితుల్లో మార్పులు వచ్చే అవకాశాలున్నాయి. సహజంగా బీజేపీ,జనసేనల్లోనూ ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. అలాగే అధికారంలో ఉన్నటీడీపీ నేతలకు, నియోజకవర్గాల్లో జనసేన, బీజేపీ నేతలకు మధ్య సరైన అవగాహన లేకపోగా అనేక అంశాల్లో విభేదాలు బయటపడుతున్నాయి. దాదాపు 175 నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. తాము కూటమిలో ఉన్నామని మర్చిపోయి తమకు టీడీపీ నేతలు ప్రాధాన్యత ఇవ్వడం లేదని జనసేన, బీజేపీ నియోజకవర్గ స్థాయి నేతలు బాహాటంగానే చెబుతున్నారు. అందుకే ఆరెండు పార్టీలు నేతలకు న్యాయం చేయాలంటే కొన్ని సీట్లు ఎక్కువగానే తీసుకోవాల్సి ఉంటుంది. మరి చంద్రబాబు ఆ రెండు పార్టీలను ఎలా ఒప్పిస్తారన్నది చూడాలి.

# ఒంగోలు టూ హైదరాబాద్ పరుగులే



**ఒంగోలు, జనవరి 24, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తోంది. ప్రకాశం జిల్లా అద్దంకిలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు, ప్రమాదాలను నివారించేందుకు మినీ బైపాస్ రోడ్డు పనులు వేగవంతమయ్యాయి. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ప్రాజెక్టులో భాగంగా, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మినీ బైపాస్ పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు, ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, ఫ్లై ఓవర్లు, బ్రిడ్జిల నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. పలు నగరాలు, పట్టణాలకు బైపాస్‌లు, మినీ బైపాస్‌లు, ఔటర్ రింగ్ రోడ్లు కూడా మంజూరు చేస్తోంది. ప్రకాశం జిల్లా అద్దంకిలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు, ప్రమాదాలను నివారించేందుకు మినీ బైపాస్ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. అద్దంకి నియోజకవర్గం నుంచి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మేరకు అద్దంకి మీదుగా వెళ్లే నామ్ రోడ్డులో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ఈ ప్రతిపాదన వచ్చింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు.మొదటి దశలో భాగంగా.. రేణింగవరం రోడ్డులో కాకానిపాలెం నుంచి సూర్య రెస్టారెంట్ వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డుగా మార్చనున్నారు. ఈ పనులకు సుమారు రూ.15 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ రోడ్డు మధ్యలో ఎస్ఎస్పీ కాలువ, రెండు వైపులా సీసీ రోడ్లు, విద్యుత్ లైన్లు, సైడ్ డ్రైయిన్లు ఏర్పాటు చేస్తారు. ఈ మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే, పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరడమే కాకుండా, ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాలు చేయొచ్చు.అద్దంకి మినీ బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా.. అద్దంకిలో కాలువ కట్టపై నెల రోజుల క్రితం ఆక్రమణలను తొలగించారు. బాధితులకు కొండ దగ్గర ఇళ్ల స్థలాలు కేటాయించి, మౌలిక సదుపాయాలు కల్పించారు. అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించడంతో వారు కొత్త ఇళ్లలోకి మారారు. ఇప్పుడు ఆ కాలువ కట్టపై గ్రావెల్ రోడ్డు వేస్తున్నారు. రోడ్డును చదును చేసి, రోలర్‌తో గట్టిపరుస్తున్నారు. కాలువకు రెండు వైపులా రాళ్లు కూడా పెడుతున్నారు. ఇంకో పదిహేను రోజుల్లో ఈ గ్రావెల్ రోడ్డు సిద్ధమవుతుందిఆ తర్వాత 70 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్లు కట్టాలని ప్లాన్ చేస్తున్నారు. మిగిలిన స్థలాన్ని మున్సిపాలిటీ తీసుకుని, ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేయాలని అనుకుంటున్నారు. ప్రస్తుతానికి గ్రావెల్ రోడ్డుపైనే వాహనాలు వెళ్తాయి. కొన్నాళ్ల తర్వాత సీసీ రోడ్లు వేస్తారు. రెండవ దశలో కాకానిపాలెం నుంచి టిడ్కో ఇళ్ల మీదుగా శింగరకొండ దగ్గర నామ్ రోడ్డులో కలిసేలా తారు రోడ్డు వేస్తారు. ఈ రెండు పనులు పూర్తయితే మినీ బైపాస్ రోడ్డు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తారు. అద్దంకి మీదుగానే హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా వెళతాయి.. ఈ క్రమంలో ఈ బైపాస్ రోడ్డు నిర్మాణంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. ఈ మేరకు అద్దంకి మినీ బైపాస్ నిర్మాణ పనుల్ని మరింత వేగవంతం చేశారు.

# సంక్లిష్ట పరిస్థితి లో వైకాపా

**విజయవాడ, జనవరి 24, పెన్ పవర్:**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో సంక్లిష్ట పరిస్థితి ఎదుర్కోక తప్పదు. మరో వారం రోజుల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. అనేక బిల్లులు ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడుతోంది. అయితే బిల్లుల విషయంలో బిజెపి పట్ల ఎప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుకూలంగానే ఉంటుంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించే అమరావతి అంశంపై పార్లమెంట్లో చర్చ జరగనుంది. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎలా ముందుకెళ్తుంది అనేది ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. లోక్సభ తో పాటు రాజ్యసభలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 మంది సభ్యుల బలం ఉంది. ఆ పార్టీ స్టాండ్ చెప్పాల్సి ఉంటుంది.అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నిధుల సమీకరణ జరిగింది. కేంద్ర ప్రభుత్వం సైతం 15 వేల కోట్ల రూపాయల సాయం ప్రకటించింది. ప్రపంచ బ్యాంకుతోపాటు ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు నుంచి నిధులు సర్దుబాటు చేసింది. అయితే గత అనుభవాల దృష్ట్యా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని రైతులు కోరుతూ వచ్చారు. ఏపీ ప్రభుత్వం సైతం ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి చేస్తోంది. అయితే రాజధానిల విషయంలో నోటిపై చేయాల్సిన అవసరం లేదని కేంద్రం చెబుతున్నా.. ఏపీలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా.. పరిగణలోకి



తీసుకోవాలని కూటమి ప్రభుత్వం కోరింది. అందుకే ఇప్పుడు అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లును పార్లమెంటులో పెడతారని తెలుస్తోంది. అయితే దీనిపై వైసీపీ స్టాండ్ ఏంటనేది తేటతెల్లం కానుంది.అమరావతి పై ఆది నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్మోహన్ రెడ్డి వ్యతిరేక భావనతోనే ఉన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడ ఉంటే అదే రాజధాని అని వ్యాఖ్యానించేవారు. అసలు రాజ్యాంగం లో రాజధాని అనే పదమే లేదని తేల్చేశారు. ఐదేళ్లపాటు అమరావతిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. మూడు రాజధానులు అంటూ హడావిడి చేశారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి పునర్నిర్మాణం ప్రారంభమైంది. ఇప్పుడు కూడా అదే వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. నది చెంతనే కట్టారని.. ముంపు ప్రాంతంలో అమరావతి అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసేవారు. అయితే ఇప్పుడు పార్లమెంటులోనే నేరుగా వైసీపీ అభిప్రాయం చెప్పాల్సి ఉంటుంది అమరావతిపై. ఇప్పటికే వైసీపీకి వ్యతిరేకంగా అస్త్ర శస్త్రాలను సిద్ధం చేస్తోంది టిడిపి కూటమి. తప్పకుండా ఈ విషయంలో ఏదో ఒకటి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉంది. మరి ఎలా స్పందిస్తుందో చూడాలి.

# వరికపూడిశెలకు పర్యావరణ అనుమతులు

**ఒంగోలు, జనవరి 24, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి కేంద్రం పర్యావరణ అనుమతులు మంజూరు చేసింది. పల్నాడు జిల్లాలో 84,500 ఎకరాలకు సాగునీరు, 20 వేల మందికి తాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు రూ.3,227.15 కోట్లు ఖర్చవుతుంది. మరోవైపు, కడప, ప్రకాశం జిల్లాల్లో 800 మెగావాట్ల రాజుపాలెం పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కూడా అనుమతులు లభించాయి. అన్నమయ్య జిల్లా వీరబల్లి ప్రాజెక్టు అనుమతులు మాత్రం ప్రస్తుతం నిలిపివేశారు.ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన ప్రాజెక్టుకు కేంద్రం నుంచి లైన్ క్లియర్ అయ్యింది. పల్నాడు జిల్లాలో ప్లాన్ చేసిన వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు మంజూరు అయ్యాయి. ఈనెల 9న జరిగిన సమావేశంలో కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలోని నిపుణుల మదింపు కమిటీ చర్చించింది. ఈ మేరకు ఈ ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించిన కమిటీ.. అల్ప వర్షపాతం, వెనుకబాటుతనం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రతిపాదనలపై చర్చించిన తర్వాత అనుమతులకు సిఫార్సు చేసింది. గత పదేళ్లుగా ఈ ప్రాజెక్టుకు అనుమతుల కోసం ఎదురు చూస్తున్నారు.. చివరికి అనుకున్నది సాధించారు.ఈ ప్రాజెక్టు ద్వారా 84,500 ఎకరాలకు సాగునీరు, 20 వేల మందికి తాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.3,227.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు వల్ల 25 గ్రామాలకు సాగునీరు, 20 వేల మందికి తాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్ట్ కోసం 270 హెక్టార్ల భూమి అవసరమని గుర్తించారు.. అడిగొప్పుల, ఆత్మకూరు, దరివేముల ప్రాంతాల్లో సేకరించనున్నారు. ఈ భూములి 19.13 హెక్టార్లు అటవీ భూమి ఉంది. 4.86 టీఎంసీల నీటిని వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, కారంపూడి మండలాల్లోని పొలాలకు సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకువరికపూడిశెల వాగు నుంచి ఎత్తిపోయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు గ్రామస్థులు చేసిన విజ్ఞప్తి మేరకు.. మొదట 24,900 ఎకరాలకు పరిమితమైన ఈ ప్రాజెక్టు పరిధిని 84,500 ఎకరాలకు పెంచారు. దీని కోసం గతేడాది అక్టోబర్ 31న జీవో కూడా విడుదలైంది. ఈ ప్రాజెక్టు వల్ల పల్నాడు జిల్లాలోని అనేక ప్రాంతాల ప్రజలకు మేలు జరుగుతుంది.మరోవైపు మరో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకుకు కూడా అనుమతులకు లైన్ క్లియర్ చేశారు. కడప, ప్రకాశం జిల్లాల్లో ఏపీ జెన్‌కో, ఎన్‌హెచ్‌పీసీ, గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కలిసి 334.8 హెక్టార్లలో తలపెట్టిన 800 మెగావాట్ల రాజుపాలెం క్లోజ్‌లూప్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును ప్లాన్ చేశాయి. ఈ ప్రాజెక్టుకు కూడా పర్యావరణ అనుమతులకు లైన్ క్లియర్ అయ్యింది. మరోవైపు అన్నమయ్య జిల్లాలో 489.1 హెక్టార్లలో నిర్మించాలని ప్లాన్ చేసిన వీరబల్లి ప్రాజెక్టుకు (పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్) సంబంధించిన అనుమతులను ప్రస్తుతం నిలిపివేశారు.

# ప్రశ్న మీది గొంతు నాది

**ఏలూరు, జనవరి 24, పెన్ పవర్:**
టీడీపీకి చెందిన ఓ యువ ఎంపీ ప్రజల సమస్యలను నేరుగా పార్లమెంట్ వేదిక వరకు తీసుకెళ్లాలనే కొత్త ఆలోచనతో ముందుకు వచ్చారు. సాధారణంగా ప్రజా ప్రతినిధులు సమావేశాలు, వినతులు, దరఖాస్తుల ద్వారానే సమస్యలు తెలుసుకుంటారు. కానీ ఈ ఎంపీ మాత్రం ప్రజలే స్వయంగా తమ సమస్యలను చెప్పేలా ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల మాటే ప్రశ్నగా, తన గొంతే వేదికగా మారాలన్న ఉద్దేశంతో 'ప్రశ్న మీది గొంతు నాది' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వారు ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్ యాదవ్ . తొలిసారి ఎంపీగా ఎన్నికైనప్పటికీ, తక్కువ సమయంలోనే నియోజకవర్గ ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. వివాదాలకు దూరంగా ఉంటూ, అందరినీ కలుపుకుని వెళ్లే నాయకుడిగా, ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రతినిధిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, పార్లమెంట్ సమావేశాల్లో కూడా ఏలూరు నియోజకవర్గానికి సంబంధించిన అంశాలను తరచూ ప్రస్తావిస్తూ వస్తున్నారు.ఇప్పటి వరకు ఉన్న విధానాలకు భిన్నంగా, మరింత ప్రభావవంతంగా సమస్యల పరిష్కారం జరగాలన్న ఆలోచనతో ఈ కొత్త ప్రయత్నానికి ఆయన నాంది పలికారు. 'ప్రశ్న మీది గొంతు నాది' కార్యక్రమం ద్వారా ప్రజలు తమ ప్రాంతానికి సంబంధించిన సమస్యలను నేరుగా వాట్సాప్ ద్వారా పంపే అవకాశం కల్పించారు. ఇక్కడ ముఖ్యంగా వ్యక్తిగత సమస్యలు కాకుండా, గ్రామం, కాలనీ, పట్టణం లేదా నియోజకవర్గ స్థాయిలో ఉన్న ప్రజా సమస్యలను మాత్రమే పంపాలని సూచించారు. సమస్యతో పాటు దానికి తాము భావించే పరిష్కార సూచనలను కూడా ప్రజలు తెలియజేయవచ్చు.ఏలూరు పార్లమెంట్ పరిధిలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు కూడా ఈ కార్యక్రమం ద్వారా ఎంపీ దృష్టికి తీసుకురావచ్చు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం, ఉపాధి వంటి అనేక అంశాలపై ప్రజల నుంచి వచ్చే సమాచారం ఆధారంగా, వాటిని పార్లమెంట్‌లో ప్రశ్నల రూపంలో లేవనెత్తి, కేంద్ర ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇలా ప్రజలే ముందుకు వచ్చి సమస్యలను తెలియజేస్తే, వాటికి పరిష్కార మార్గాలు వెతకడం మరింత సులభమవుతుందని ఆయన భావిస్తున్నారు.రాష్ట్రంలోనే తొలిసారి ఈ తరహా ప్రజా భాగస్వామ్య కార్యక్రమం ప్రారంభం కావడం విశేషంగా మారింది. ఈ ప్రయత్నం విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పుట్టా మహేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను భయపడకుండా, స్పష్టంగా పంపాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రజలు 96181 94377, 98855 19299 అనే వాట్సాప్ నంబర్లకు తమ సమస్యలను పంపవచ్చని ఆయన తెలిపారు. ప్రజల ప్రశ్నలకు తన గొంతు జోడించి, పార్లమెంట్ వేదికగా పరిష్కారం సాధించడమే తన లక్ష్యమని ఎంపీ స్పష్టం చేశారు.

# దావోస్ కు దూరంగా జనసేనాని

**కాకినాడ, జనవరి 24, పెన్ పవర్:**
దావోస్ కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకోకపోవడాన్ని జనసేన క్యాడర్ తప్పుపడుతుంది. పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దావోస్ పర్యటనలో రాజకీయాల్లో లేని మెగాస్టార్ చిరంజీవిని వెంట తీసుకెళ్లి ఆ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ ను పెంచాలని ప్రయత్నిస్తుంటే, ఇక్కడ మాత్రం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ ను దావోస్ కు వెంట తీసుకోకపోవడాన్ని ఖచ్చితంగా ఆయనను నిర్లక్ష్యం చేయడమేనని అంటున్నారు. పవన్ కల్యాణ్ కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులున్నారు. ఆయనను వెంట తీసుకెళితే ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందే తప్ప నష్టం ఏముంటుందని నెట్టింట కొందరు నేరుగా టీడీపీ నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ ను దావోస్ పర్యటనకు దూరం పెట్టడం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయడమేనన్న అభిప్రాయం జనసేన క్యాడర్ లో వ్యక్తమవుతుంది. పవన్ కల్యాణ్ వల్ల కాస్తో కూస్తో లాభం చేకూరుతుందే తప్ప నష్టమయితే జరగదు. లోకేశ్, టీజీ భరత్ వంటి వారిని వెంట తీసుకెళ్లడంలో తప్పులేదు. కానీ అదే సమయంలో పవన్ కల్యాణ్ ను తీసుకెళ్లకపోవడం మాత్రం ఖచ్చితంగా నాయకత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయమేనన్న అభిప్రాయం జనసేనలో వ్యక్తమవుతుంది. తెలంగాణలో మెగాస్టార్ చిరంజీవిని తన వెంట తీసుకెళ్లి ఆయనకు దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగస్వామ్యం కల్పించడంతో కొంత తెలంగాణ ఇమేజ్ పెరిగిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.కానీ తెలుగుదేశ పార్టీ నేతల వాదన




మరొకలా ఉంది. పవన్ కల్యాణ్ వస్తానంటే ఎందుకు తీసుకెళ్లరని, ఆయన అనాసక్తి చూపడం వల్లనే చంద్రబాబు నాయుడు ఒత్తిడి చేయలేదని అన్నారు. పవన్ కల్యాణ్ కేవలం దావోస్ పర్యటన మాత్రమే కాదు .. గత ఏడాది నవంబరు నెలలో విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సుకు కూడా పవన్ కల్యాణ్ దూరంగా ఉన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. వారిద్దరి మధ్య సఖ్యత బాగానే ఉందని, కానీ పార్టీ నేతలు, కార్యకర్తలు లేనిపోని అపోహలకు తావివ్వవద్దని, ఏదైనా అనుమానలుంటే నేరుగా పవన్ కల్యాణ్ తో మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలుగుదేశం పార్టీ నేతలు ఆఫ్ ది రికార్డులుగా చెబుతున్నారు. మొత్తం మీద దావోస్ పర్యటనకు పవన్ దూరంగా ఉండటంపై మాత్రం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. మరో వైపు గత ఏడాది దావోస్ లోజరిగిన పెట్టుబడుల సదస్సుకు సీఎం చంద్రబాబుతో పాటు నారా లోకేష్ వెళ్లారు. ఆ సమయంలో కూడా పవన్ కల్యాణ్ వెళ్లకపోవడం పై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా జనసేన కేడర్ నుంచి అసంతృప్తి బయటపడింది. ఇప్పుడు కూడా సోషల్ మీడియా వేదికగా అటువంటి అసంతృప్తి కనిపిస్తోంది. తెలంగాణలో మెగాస్టార్ చిరంజీవిని తమ వెంట తీసుకెళ్లి దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగస్వామ్యం కల్పించింది తెలంగాణ ప్రభుత్వం. తెలంగాణ ఇమేజ్ పెరిగింది అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. కానీ ఏపీలో డిప్యూటీ సీఎం గా ఉన్న పవన్ కళ్యాణ్ ను ప్రపంచ ఆర్థిక సదస్సుకు తీసుకెళ్లకపోవడం పై విమర్శలు వస్తున్నాయి.అయితే పవన్ విషయంలో చంద్రబాబు ఎప్పుడు జాగ్రత్తగానే ఉంటారు. డిప్యూటీ సీఎం గా ఉన్న పవన్ ను సంప్రదించి అన్నీ చేస్తుంటారని తెలుస్తోంది. ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు సంబంధించిన ఏ శాఖ కూడా పవన్ కళ్యాణ్ పరిధిలో లేదు. ఆయన అంత గ్రామీణ నేపథ్యం, అటవీ శాఖ వంటి వాటిని చూస్తున్నారు. ఆది నుంచి విదేశీ పర్యటనల విషయంలో పవన్ జోక్యం చేసుకోవడం లేదు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో కూడా పవన్ పాత్ర అంతంత మాత్రమే. గత ఏడాది తెలంగాణ సీఎం వెంట ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెళ్లారు. అప్పట్లో కూడా ఏపీ డిప్యూటీ సీఎం గా ఉన్న పవన్ కళ్యాణ్ ను ఎందుకు తీసుకువెళ్లలేదు అనేది ప్రశ్న వచ్చింది. కానీ అప్పట్లోనే పవన్ కళ్యాణ్ పరోక్ష సంకేతాలు ఇచ్చారు. ఎటువంటి అసంతృప్తి వ్యక్తం చేయలేదు. ఇప్పుడు కూడా పవన్ కళ్యాణ్ ను సంప్రదించి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## యువత మధ్యతరగతికి AI సునామీతో భారీ రిస్క్..

# జాబ్స్ దొరుకుడు కష్టమే: IMF డైరెక్టర్




అంతరిక్షంలోకి రాకెట్లు పంపడం నుంచి జేబులోని స్మార్ట్‌ఫోన్ వరకు ఏఐ దూసుకుపోతోంది. అయితే ఈ టెక్నాలజీ కేవలం సౌకర్యాలను మాత్రమే కాదు.. ప్రపంచ జాబ్ మార్కెట్‌ను అతలాకుతలం చేసే సునామీని కూడా వెంటబెట్టుకొస్తోందని IMF మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జివా సంచలన విషయం బయటపెట్టారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వేదికగా ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. రాబోయే కొన్నేళ్లలో ఏఐ ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా 40 శాతం ఉద్యోగాలు ప్రభావితం కానున్నారని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ ప్రభావం మరింత ఎక్కువగా.. అంటే దాదాపు 60 శాతంగా ఉండబోతోందట. కొన్ని ఉద్యోగాలు ఏఐ వల్ల మెరుగుపడితే, మరికొన్ని పూర్తిగా కనుమరుగయ్యే లేదా రూపాంతరం చెందే ప్రమాదం ఉందని ఐఎంఎఫ్ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

**యువతకు, మధ్యతరగతికి బ్యాడ్ టైమ్..?**

ఈ ఏఐ తుపానులో యువత, మధ్యతరగతి ప్రజలే ప్రధాన బాధితులుగా మారనున్నారని జార్జివా ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణంగా యువత తమ కెరీర్ ప్రారంభంలో చేసే ఎంట్రీ లెవల్ పనులను ఏఐ సులభంగా చేసేస్తోంది. దీనివల్ల కొత్తగా ఉద్యోగాల కోసం వెతికే యువతకు సరైన అవకాశాలు దొరకడం కష్టతరంగా మారుతుందని చెప్పారు. ఇక మధ్యతరగతి విషయానికి వస్తే.. ఏఐ టెక్నాలజీని అందిపుచ్చుకున్న వారికి మాత్రమే ఉత్పాదకత పెరుగుతుంది. మిగిలిన వారికి శాలరీలు తగ్గిపోవడం వల్ల ఆర్థిక ఒత్తిడికి లోనవుతారని ఆమె తేల్చి చెప్పేశారు.

టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న వేగంతో పోలిస్తే.. దానిని నియంత్రించే చట్టాలు చాలా నెమ్మదిగా ఉన్నాయని జార్జివా పేర్కొన్నారు. ఏఐని సురక్షితంగా అందరికీ అందుబాటులో ఉండేలా ఎలా మార్చాలో మనకు ఇంకా పూర్తిస్థాయిలో తెలియదని, దీనివల్ల సమాజంలో అసమానతలు మరింత పెరిగే అవకాశం ఉందని కుండబద్దలు కొట్టినట్లు నిజాలు బయటపెట్టారు జార్జివా. ఈ చర్చలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల కూడా పాల్గొని.. ఏఐ వల్ల కలిగే లాభాలు కేవలం కొన్ని కంపెనీలకే పరిమితమైతే, ఈ టెక్నాలజీపై ప్రజల్లో ఉన్న సానుకూల అభిప్రాయం దెబ్బతింటుందని హెచ్చరించారు. అలాగే కార్మిక సంఘాలు కూడా ఏఐ వల్ల వచ్చే లాభాలను కార్మికులతో పంచుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. మొత్తంమీద ఏఐ అనేది ఒకవైపు ప్రొడక్టివిటీ పెంచుతున్నప్పటికీ, సరైన నిర్వహణ లేకపోతే అది ప్రపంచవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక సంక్షోభాలకు దారితీసే ప్రమాదం ఉందని దావోస్ సదస్సులోని నిపుణులు ముందుగానే కళ్లు తెరవాలంటూ హెచ్చరిస్తున్నారు.

# 15 కోట్ల G mail, FB, NF పాస్ వర్డ్స్ లీక్ : ఏంటీ అన్నీ 12345.. ఇలానే ఉన్నాయా..?




ప్రపంచ వ్యాప్తంగా 15 కోట్ల పాస్ వర్డ్స్ లీక్ అయ్యాయంట.. ఈ పాస్ వర్డ్స్ అన్నీ జీ మెయిల్, ఫేస్ బుక్, నెట్ ఫ్లిక్స్ అకౌంట్లతో లింక్ అయ్యి ఉన్నాయంట.. ఇన్ని కోట్ల పాస్ వర్డ్స్ లీక్ కావటం తరచుగానే జరుగుతుంది. కోట్ల సంఖ్యలో పాస్ వర్డ్స్ లీక్ కావటం వెనక.. ఆయా అకౌంట్ హోల్డర్స్ నిర్లక్ష్యమా లేక స్ట్రాంగ్ పాస్ వర్డ్ లేకపోవటమా అనే ఇంట్రస్టింగ్ డిస్కషన్ ఆన్ లైన్‌లో నడుస్తుంది. ఈ 15 కోట్ల పాస్ వర్డ్స్ అన్నీ 12345..ఆదీజణజు.. 1098765.. ఇలాగే ఉన్నాయా ఏంటీ అనే కామెడీ పోస్టులు సోషల్ మీడియాలో పడుతున్నాయి. 15 కోట్ల పాస్ వర్డ్స్ లీక్ వ్యవహారంపై పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్‌లో దాదాపు 15 కోట్ల పాస్ వర్డ్స్ లీక్ అయ్యాయని ప్రముఖ డేటా భద్రతా విశ్లేషకుడు జెరెమియా ఫౌలర్ సంచలన విషయం బయటపెట్టారు. జీమెయిల్, ఫేస్ బుక్, క్రిప్టోకరెన్సీ ప్లాట్‌ఫామ్ బినాన్స్, యాహూ, మైక్రోసాఫ్ట్ ఔట్ లుక్, ఆపిల్ ఐక్లౌడ్, నెట్ ఫ్లిక్స్, టిక్ టాక్ వంటి యాప్ యూజర్ల లాగిన్ వివరాలు ఇంటర్నెట్‌లో బహిర్గతమైనట్లు చెప్పడంతో సోషల్ మీడియాలో ప్రకంపనలు రేపుతున్నాయి. 48 మిలియన్ల జీమెయిల్, 17 మిలియన్ల ఫేస్ బుక్, 420,000 బినాన్స్ యాప్ యూజర్లతో పాటు పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థలతో చెందిన మిలియన్ల కొద్దీ పాస్‌వర్డ్‌లు అలాగే బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్ లాగిన్ వివరాలు లీకైన డేటాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇన్ఫోస్టీలర్ మాల్వేర్ ఉపయోగించి యూజర్ల పాస్ వర్డ్స్ దొంగలించినట్లు ఫౌలర్ అనుమానం వ్యక్తం చేశాడు. ఈ హానికరమైన సాఫ్ట్‌వేర్ కంప్యూటర్లలోకి పంపి కీస్ట్రోక్ ట్రాకింగ్ వంటి పద్ధతులను ఉపయోగించి వినియోగదారు పేర్లు, పాస్‌వర్డ్‌లతో సహా వ్యక్తులు టైప్ చేసే వాటిని రికార్డ్ చేస్తారని.. ఆ తర్వాత దొంగిలించబడిన సమాచారం మాల్వేర్‌ను నియంత్రించే వారికి తిరిగి పంపుతోందని తెలిపారు. పాస్ వర్డ్స్ వీక్‌గా ఉండటం లీక్ కావడానికి ప్రధాన కారణమని వెల్లడించారు. 12345.. ఆదీజణజు, డేట్ ఆఫ్ బర్త్, ఫోన్ నెంబర్స్ పాస్ వర్డ్స్‌గా పెట్టుకోవడం వల్ల లీక్ అయ్యే ఆస్కారం ఎక్కువగా ఉందన్నారు. లీక్ అయిన డేటా సైబర్ నేరస్థుల చేతికి చిక్కే అవకాశం ఉందని.. ఇదే జరిగితే యూజర్ల వ్యక్తిగత భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఈ భారీ డేటా బ్రీచ్‌పై సోషల్ మీడియాలో ఆందోళనతో పాటు సెటైర్లు పేలుతున్నాయి. మనోళ్లు పాస్ వర్డ్‌లు పెట్టుకోవడానికి పెద్దగా కష్టపడరని.. బ్రెయిన్‌కు పని చెప్పరని.. సింపుల్‌గా 12345, ఆదీజణ లేదా ఫోన్ నెంబర్లు, డేట్ ఆఫ్ బర్త్‌లు పెడతారని.. తద్వారా స్కామర్ల పని ఈజీ చేస్తున్నారని నెటిజన్లు ఫన్నీగా కామెంట్స్ చేస్తున్నారు. లీకైన 15 కోట్ల పాస్ వర్డ్స్ లో దాదాపు 90 శాతం ఈ కోవకు చెందినవే ఉంటాయంటున్నారు. సో.. ఇప్పటికైనా మేల్కొని పాస్ వర్డ్‌ను స్ట్రాంగ్‌గా పెట్టుకోండి. ఫోన్ నెంబర్లు, డేట్ ఆఫ్ బర్త్‌లు కాకుండా పాస్ వర్డ్‌ను పటిష్టంగా సెట్ చేసుకోండి. లేదంటే స్కామర్ల చేతికి చిక్కి చివరకు లబోదిబోమని గుండెలు బాదుకోవాల్సి వస్తది.

# భారత్‌కు ట్రంప్ సర్కార్ గుడ్‌న్యూస్: 50% నుంచి 25 శాతానికి తగ్గనున్న టారిఫ్స్..!

ప్రపంచంలో మరే దేశంపైనా లేనంత భారీ టారిఫ్స్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇండియాపై కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. దాయాది దేశం పాక్ కంటే కూడా అధికంగా పన్నులు ఉండటంతో ఎగుమతులు భారీగా దెబ్బతింటున్నాయి. రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ కొంటున్నామంటూ అదనపు సుంకాల తర్వాత మొత్తంగా 50 శాతం దిగుమతి పన్నులు అమెరికాలో భారతీయ వస్తువులకు డిమాండ్ తగ్గిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య కొనసాగుతున్న ట్రేడ్ టాక్స్ సానుకూల దిశకు చేరుకుంటున్నట్లు తాజా అప్ డేట్ ప్రకారం తెలుస్తోంది. అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ భారత్‌పై విధిస్తున్న వాణిజ్య సుంకాలను సగానికి సగం తగ్గించే దిశగా కీలక సంకేతాలు వచ్చాయి. గతంలో విధించిన 50 శాతం టారిఫ్‌లను 25 శాతానికి తగ్గించే అవకాశాన్ని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ స్పష్టం చేశారు. రష్యా నుంచి భారత్ ముడి చమురు దిగుమతులను తగ్గించుకుందనే కారణాన్ని చూపుతూ.. ఈ ఉపశమనం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. గత ఏడాది ఆగస్టులో ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై రెండు విడతలుగా సుంకాలను విధించింది. వాణిజ్య అసమతుల్యత కారణంగా 25 శాతం, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు శిక్షాత్మక చర్యగా మరో 25 శాతం టారిఫ్‌లను విధించడంతో భారత్ ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. అయితే ఇటీవల భారత్ రష్యా చమురు దిగుమతులను భారీగా తగ్గించుకుందని.. అందుకే ఈ 25 శాతం సెకండరీ సుంకాన్ని వెనక్కి తీసుకోవడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని బెస్సెంట్ పేర్కొన్నారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు ప్రారంభించిందని, కానీ ట్రంప్ సుంకాలు విధించిన తర్వాత భారత్ ఆ కొనుగోళ్లను క్రమంగా తగ్గించిందని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో యూరోపియన్ యూనియన్ తీరును విమర్శించారు. భారత్ నుంచి రిఫైన్ చేసిన ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేస్తూనే.. పెద్ద వాణిజ్య ఒప్పందం కోసం సుంకాలు విధించకుండా ఉండటం తెలివితక్కువతనం అని అన్నారు. మరోవైపు.. అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ భారత్ తన ఇంధన విధానం జాతీయ ప్రయోజనాల ప్రకారమే ఉంటుందని గతంలోనే స్పష్టం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోలును తగ్గించలేదని అధికారికంగా చెప్తున్నప్పటికీ.. ప్రైవేట్ సంస్థలు మాత్రం దిగుమతులు తగ్గించినట్లు వార్తలు వస్తున్నాయి. అమెరికా తాజా నిర్ణయం అమలైతే, భారత ఎగుమతిదారులకు భారీ ఉపశమనం లభించడంతో పాటు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మళ్లీ మెరుగుపడే అవకాశం ఉంది.

# ఓలటైల్ మార్కెట్లలో సేఫ్ ట్రేడింగ్ ఎలా..? పెయిర్ ట్రేడింగ్ వల్ల లాభాలొస్తాయా..?




ప్రస్తుతం భారతీయ మార్కెట్లు ఊహించని హైపర్ ఓలటాలిటీలో ట్రేడవుతున్నాయి. ఇలాంటి మార్కెట్లలో డబ్బు పెట్టాలంటే ఇన్వెస్టర్లు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారు. భారీగా మార్కెట్లు పతనం కావటంతో అసలు ట్రేడింగ్ ఎందుకు కొద్దిగా దూరంగా ఉందాం అనే ధోరణి చాలా మంది ఇన్వెస్టర్లలో కనిపిస్తోంది. దీంతో కొందరు గోల్డ్, సిల్వర్ వైపు వెళుతుంటే మరికొందరు మ్యూచువల్ ఫండ్స్ బాట పడుతున్నారు. చాలా తక్కువ మంది మాత్రమే బాండ్స్ లాంటి డెట్ మార్కెట్లోకి తమ డబ్బును ఇన్వెస్ట్ చేస్తున్నారు. అసలు ఇలాంటి పరిస్థితుల్లో సేఫ్ ట్రేడింగ్ కుదురుతుందా.. ఉంటే ఎలా చేయెచ్చనే విషయాల గురించి నిపుణులు ఏమంటున్నారో చూద్దాం...

జనవరి 2026 స్టాక్ మార్కెట్ చరిత్రలో ఒక అనూహ్యమైన మలుపుగా నిలిచిపోనుంది. నెల ప్రారంభంలో నిఫ్టీ జీవితకాల గరిష్టాలను తాకుతూ 29వేల స్థాయికి చేరుకుంటుందని ఇన్వెస్టర్లు ఎంతో ఆశగా ఎదురుచూశారు. కానీ అకస్మాత్తుగా మారిన భౌగోళిక రాజకీయ పరిస్థితులు, యుద్ధ వాతావరణం, కరెన్సీ పతనం, విదేశీ ఇన్వెస్టర్లు డబ్బు వెనక్కి తీసుకోవటంతో మార్కెట్ కుప్పకూలింది. నిఫ్టీ 25,200 స్థాయికి పడిపోవడంతో ట్రేడర్లలో నిరాశ పెరిగింది. ఇలాంటి అత్యంత ఓలటైల్ మార్కెట్లలో దిశను అంచనా వేసి ట్రేడింగ్ చేయడం కత్తి మీద సాములాంటిదే. బడ్జెట్ అంచనాలతో కొన్ని షేర్లు పెరిగినా, అంతర్జాతీయ ప్రతికూల పవనాలతో అవి నిలబడలేకపోతున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో నష్టాలను తగ్గించుకుంటూ లాభాలను ఆర్జించేందుకు నిపుణులు 'పెయిర్ ట్రేడింగ్' అనే వ్యూహాన్ని సూచిస్తున్నారు.

**ఏంటి ఈ పెయిర్ ట్రేడింగ్ అంటే..?**

పెయిర్ ట్రేడింగ్ అనేది ఒక రక్షణ కవచం లాంటిది. ఇందులో ట్రేడర్లు ఒకే రంగంలోని ఒక స్టాక్ ఫ్యూచర్‌ను కొనుగోలు(దీబం) చేస్తూనే.. అదే రంగంలోని మరొక స్టాక్ ఫ్యూచర్‌ను అమ్ముతారు(రావశ్రీశ్రీ). మార్కెట్లో ఉండే రెండు రకాల రిస్కులను ఎదుర్కోవడానికి ఇది సరైన మార్గం. సాధారణంగా మార్కెట్ మొత్తం పడిపోయే సిస్టమాటిక్ రిస్క్ ను ఇది అడ్డుకుంటుంది. ఉదాహరణకు.. ఒక రంగంపై ప్రతికూల వార్తలు వచ్చినప్పుడు ఆ రంగంలోని షేర్లన్నీ పడిపోతాయి. అప్పుడు మీరు కొన్న షేరులో వచ్చే నష్టాన్ని.. మీరు షార్ట్ చేసిన అదే అమ్మిన స్టాక్ ఫ్యూచర్స్ లో వచ్చే లాభం భర్తీ చేస్తుంది. దీనివల్ల మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం లేకుండా.. ఆ రెండు షేర్ల మధ్య ఉండే రిలేటివ్ పెర్ఫామెన్స్ ఆధారంగా ఇన్వెస్టర్లకు లాభాలు వస్తాయి.

ఈ వ్యూహాన్ని అమలు చేయాలంటే.. ఒకే రంగంలో ఉండి చారిత్రకంగా ఒకేలా కదిలే రెండు షేర్లను ఎంచుకోవాల్సి ఉంటుందంట. మీరు కొనే షేరు కంటే మెరుగ్గా రాణిస్తున్న మరొక షేరును విక్రయించడం ద్వారా సమతుల్యత సాధించవచ్చు. ఒకవేళ మీరు కొన్న షేరు నష్టపోతే, వెంటనే రెండు పొజిషన్ల నుంచి ఎగ్జిట్ అవ్వాలి. దీనివల్ల మీ నష్టం చాలా తక్కువగా ఉంటుంది.

చాలామంది ట్రేడర్లు పెయిర్ ట్రేడింగ్‌లో లాభాలు తక్కువగా ఉంటాయని భావిస్తారు. కానీ రిస్క్ కంట్రోల్ లో ఉండటం ఇక్కడ అసలు రహస్యం. లిమిట్స్ లేని నష్టాల కంటే.. సురక్షితమైన పరిమిత లాభాలే మేలని నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్ వంటి కీలక ఈవెంట్లు ఉన్నప్పుడు లేదా మార్కెట్ గరిష్టాల వద్ద ఉన్నప్పుడు గుడ్డిగా బెట్లు కట్టడం కంటే, ఇలాంటి స్మార్ట్ వ్యూహాలతో ముందుకెళ్లడమే తెలివైన ట్రేడర్లు చేసే పని.

# నో కాస్ట్ EMI అనగానే ఫోన్లు, టీవీలు కొనేస్తున్నారా..? దీని వెనుక ఉండే ఖర్చులు తెలుసుకోండి




ఈ రోజుల్లో ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్న ప్రతి ఒక్కరూ వినే పదం నో-కాస్ట్ ఈఎంఐ. అంటే తీసుకుంటున్న వస్తువుకు ఎలాంటి వడ్డీ లేకుండా డబ్బును కొన్ని వాయిదాల్లో తిరిగి చెల్లించే వెసులుబాటు. చాలా మంది నో కాస్ట్ అనగానే అసలు ఏం ఖర్చు ఉండదుగా తీసుకుందా అని అనుకుంటుంటారు. అయితే దీని వెనుక ఉన్న లెక్కల గారడీ గురించి చాలా మందికి అస్సలు తెలియదు.

ఆన్‌లైన్ షాపింగ్‌లో స్మార్ట్‌ఫోన్‌లు, లాప్‌టాప్‌లు, ఫర్నిచర్ వంటి ఖరీదైన వస్తువులను కొనేటప్పుడు, వడ్డీ లేకుండా సులభ వాయిదాలలో చెల్లించవచ్చనే వాగ్దానం సామాన్యులను ఊరిస్తుంది. అయితే అసలు 'నో-కాస్ట్' అనే పదం వెనుక ఒక చిన్న మతలబు ఉంది. సాధారణంగా బ్యాంకు ఎప్పుడూ వడ్డీ లేకుండా లోన్ ఇవ్వదు. ఇక్కడ మీరు చెల్లించాల్సిన వడ్డీ మొత్తాన్ని, సెల్లర్ లేదా కంపెనీ ముందుగానే డిస్కౌంట్ రూపంలో తగ్గిస్తారు. ఉదాహరణకు మీరు రూ.50వేలు విలువైన వస్తువును ఈఎంఐలో కొంటే, దానిపై పడే రూ.3వేలు వడ్డీని వస్తువు ధరలో ముందే తగ్గిస్తారు. ఫలితంగా మీరు వడ్డీ లేని అసలు ధరనే కడుతున్నట్లు కనిపిస్తుంది. కానీ టెక్నికల్ గా అది కూడా ఒక రుణమే.

**కంటికి కనిపించని నష్టాలు..**

నో-కాస్ట్ ఈఎంఐ ఎంచుకున్నప్పుడు మీకు వచ్చే అతిపెద్ద నష్టం ఏమిటంటే.. నేరుగా నగదు చెల్లిస్తే వచ్చే భారీ డిస్కౌంట్లను కోల్పోవడం. పండుగ ఆఫర్లలో ఫుల్ పేమెంట్ చేస్తే రూ.5వేలు తగ్గే అవకాశం ఉంటే.. ఈఎంఐ ఎంచుకున్నప్పుడు ఆ డిస్కౌంట్ కేవలం రూ.2వేలకే పరిమితం కావచ్చు. అంటే మీరు వడ్డీ కట్టడం లేదు అనుకుంటున్నారు కానీ రావాల్సిన ఆఫర్‌ను మిస్ అవుతూ పరోక్షంగా ఆ మొత్తాన్ని చెల్లిస్తున్నారన్నమాట.

**అదనపు ఛార్జీలు..**

ఈఎంఐ ప్రక్రియలో ప్రాసెసింగ్ ఫీజు అనేది ప్రధానమైన అదనపు భారం. ఇది చిన్న మొత్తమే అనిపించినా.. వస్తువు ధర పెరిగే కొద్దీ ఈ ఫీజు కూడా పెరుగుతుంది. దీనికి తోడు మీరు చెల్లించే వడ్డీ భాగంపై 18% జీఎస్టీ అదనంగా పడుతుంది. ఈ వివరాలన్నీ కొనేటప్పుడు స్పష్టంగా కనిపించవు, మీ క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ వచ్చినప్పుడే అసలు విషయం బయటపడుతుంది.

**క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం..**

ప్రతి నో-కాస్ట్ ఈఎంఐ ఒక చిన్న రుణంతో సమానం. ఇలాంటివి వరుసగా ఎక్కువగా ఉంటే, మీ క్రెడిట్ హిస్టరీపై ప్రభావం పడుతుంది. భవిష్యత్తులో మీరు హోమ్ లోన్ లేదా కార్ లోన్ తీసుకోవాలనుకున్నప్పుడు ఈ పెండింగ్ ఈఎంఐలు మీ రుణ అర్హతను తగ్గించవచ్చు. అందుకే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఇలాంటి స్వల్పకాలిక అప్పులపై ఎక్కువగా ఆధారపడవద్దని హెచ్చరిస్తూనే ఉంది.

మొత్తానికి నో-కాస్ట్ ఈఎంఐ అనేది ఒక సౌకర్యం మాత్రమే కానీ ఉచితం కాదు. కొనేముందు వస్తువు అసలు ధరను, ఈఎంఐ ద్వారా చెల్లించే మొత్తం ఖర్చును బేరీజు వేసుకోవడం మంచిది. మీరు షాపింగ్ చేయనప్పుడు కూడా ధరలను కంపేర్ చేసి చూసుకుంటే అసలు విషయం మీకే అర్థమౌతుంది ఎవరికీ ఏదీ ఊరకే రాదని.

# మీరు వేగంగా శ్వాస తీసుకుంటున్నారా ? జాగ్రత.. ఈ లక్షణాలు కనిపిస్తే అస్సలు లేట్ చేయకండి..



చాలామంది వేగంగా శ్వాస తీసుకోవడాన్ని అలసటనో, టెన్షనో అనుకుని వదిలేస్తారు. కానీ, ఎటువంటి కారణం లేకుండా శ్వాస వేగం పెరగడం అనేది గుండె పంపింగ్ బలహీనపడటానికి ఒక సంకేతం కావచ్చు.... అవును.. మన గుండె ఆరోగ్యంగా ఉన్నప్పుడు శరీరానికి కావలసిన ఆక్సిజన్‌ను రక్తం ద్వారా సులువుగా పంపిస్తుంది. కానీ గుండె బలహీనపడినప్పుడు శరీరానికి తగినంత ఆక్సిజన్ అందదు.

దీన్ని భర్తీ చేయడానికి ఊపిరితిత్తులు వేగంగా గాలిని పీల్చుకుంటాయి. దీనివల్ల మనం శ్రమ పడకుండానే ఊపిరి వేగంగా తీసుకోవాల్సి వస్తుంది. ముఖ్యంగా పడుకున్నప్పుడు కూడా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా అనిపిస్తే, అది గుండె సమస్యకు ఒక సూచన కావొచ్చు. గుండె జబ్బులకి సంబంధించి ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే అలర్ట్ అవ్వాలి. ఎందుకంటే ఒకోసారి ఏ క్షణాల్లోనైన మీరు ప్రమాదంలో పడొచ్చు...

ఎంత రెస్ట్ తీసుకున్నా నీరసంగా అనిపించడం.

కొంచెం దూరం నడిచినా లేదా చిన్న పని చేసినా త్వరగా అలసిపోవడం.

గుండెలో ఏదో ఇబ్బందిగా లేదా భారంగా అనిపించడం.

గుండె వేగంగా కొట్టుకుంటున్నట్లు అనిపించడం.

అప్పుడప్పుడు కళ్లు తిరగడం లేదా నీరసంతో కళ్లు బైర్లు కమ్మడం.

కాళ్ల పాదాలు లేదా మడమలు దగ్గర వాపులు రావడం.

గుండె సమస్య ఎక్కువై ప్రమాదం కలగకముందే మొదట్లోనే గుర్తిస్తే చికిత్స ఈజీ అవుతుంది. ఆధునిక వైద్యంలో వాల్వ్ రిపేర్, బైపాస్ సర్జరీ లేదా చిన్న చిన్న పరికరాల సహాయంతో గుండెను మళ్లీ ఆరోగ్యంగా మార్చవచ్చు.

గుండె జబ్బుల లక్షణాలలో శ్వాస ఆడకపోవడం ఒకటి. గుండె రక్తాన్ని సరిగ్గా పంప్ చేయలేకపోవడం వల్ల ఊపిరితిత్తుల రక్త నాళాలలో ఒత్తిడి పెరుగుతుంది. దింతో రక్తంలోకి ఆక్సిజన్ వెళ్లడం కష్టమవుతుంది. దీనివల్ల వేగంగా లేదా ఇబ్బందిగా శ్వాస తీసుకోవడం జరుగుతుంది.

# ఆకు కాదిది ఔషధ గని

వాము ఆకులు యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీబయాటిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి దీర్ఘకాలిక ఆరోగ్యానికి అమృతంగా పనిచేస్తాయి. జలుబు, గొంతులో గరగరతో బాధపడుతున్నవారికి వామ కులతో రసం చేసుకుని తాగితే కఫం అంతా క్లియర్ అవుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, మీరు వాము ఆకులను నమలడం వల్ల, ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను దూరంగా ఉంచడంలో మీకు సహాయపడుతుంది. వాము ఆకులను నీటిలో మరిగించి తాగడం వల్ల శ్వాసకోశ సమస్యలు దూరంగా ఉంటాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. ఈ ఆకు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వాము ఆకులు మరిగించిన నీటిలో ఇంగువ, నల్ల ఉప్పు కలిపి తీసుకుంటే, అది కడుపు నొప్పి నుండి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. ఇవి అనాల్జేసిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి పంటి నొప్పి, తలనొప్పి, శరీర నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. ఆకులను మెత్తగా చేసి, ప్రభావిత ప్రాంతానికి లేపంగా అప్లై చేయటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వాము ఆకులతో చట్నీ కూడా తయారు చేసుకోవచ్చు. చట్నీ చేయడానికి, ఆకులను వెల్లుల్లి, పచ్చిమిర్చి, కొద్దిగా నిమ్మరసంతో కలిపి తయారు చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా వామాకుల రసం రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక తీవ్రమైన వ్యాధుల్ని నివారిస్తుంది. రోజూ రెండు ఆకులు నమలడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరుగుతుంది. వాము ఆకుల రసం తీసుకోవడం ఆర్థరైటిస్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇది కీళ్ల నొప్పులు, వాపుల్ని తగ్గించడంలో సాయపడుతుంది. ఇది బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాము ఆకుల రసం తాగడం వల్ల కళ్లకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన కళ్లు, కంటి చూపును నిర్వహించడానికి అవసరం. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. వాము ఆకు కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించడంలో సహాయపడుతుంది. వాము ఆకులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్, ప్రోటీన్స్ తదితర ఖనిజాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు సమస్యలను దూరం చేస్తుంది. వాము ఆకు తింటే జీవక్రియ సక్రమంగా జరుగుతుంది. ఈ ఆకు తింటే అధిక రక్తపోటు సైతం నియంత్రణలోకి వస్తుంది.



# ఇష్టమని ఈ మాంసం తెగ లాగించేస్తున్నారా?



చాలా మందికి ముక్క లేనిదే ఒక్క పూట కూడా ముద్ద దిగదు. చికెన్, మటన్ ఏదైనా సరే తప్పక వారి మెనూలో ఉండాల్సిందే. అయితే చాలా మంది రెడ్ మీట్ ఎక్కువగా తింటారు. చాలా మందికి ముక్క లేనిదే ఒక్క పూట కూడా ముద్ద దిగదు. చికెన్, మటన్ ఏదైనా సరే తప్పక వారి మెనూలో ఉండాల్సిందే. అయితే చాలా మంది రెడ్ మీట్ ఎక్కువగా తింటారు. కానీ దీనిని ఎక్కువగా తీసుకోవడం వల్ల జరిగే అనర్థాల గురించి పట్టించుకోరు. నిజానికి ఇది ఆరోగ్యానికి ప్రమాదకరం. వారానికి 1 లేదా 2 సార్లు రెడ్ మీట్ తినవచ్చు. ఒకేసారి 80 నుంచి 100 గ్రాముల వండిన రెడ్ మీట్ తినడం ఆరోగ్య కరం. ఇలా వారానికి మొత్తం 300 నుంచి 350 గ్రాములకు మించకూడదు. ఎందుకంటే ఎక్కువ రెడ్ మీట్ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్, గుండె జబ్బులు, కొవ్వు కాలేయం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అందువల్ల రెడ్ మీట్ మితంగా తినడం, తక్కువ కొవ్వు ఉన్న ముక్కలను ఎంచుకోవడం, తక్కువ నూనెలో ఉడకబెట్టడం ఆరోగ్యకరం. నిపుణుల ఆహార మార్గదర్శకాల ప్రకారం నెయ్యి, వెన్న, పూర్తి కొవ్వు పాలు వంటి సంతృప్త కొవ్వులతో ఎంత ప్రమాదమో రెడ్ మీట్‌తోనూ అంతే ప్రమాదమని చెబుతున్నారు. కొవ్వు కాలేయ రోగులు రెడ్ మీట్ తినవచ్చు, కానీ పరిమిత పరిమాణంలో మాత్రమే తీసుకోవాలి. రెడ్ మీట్‌లో సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. కాబట్టి, దానిని ఎక్కువగా తినడం వల్ల కాలేయంపై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో కొవ్వు కాలేయ సమస్యలు మరింత తీవ్రమవుతాయి. అందువల్ల మీరు వారానికి ఒకసారి వైద్యుడి సలహా మేరకు దీనిని తీసుకోవచ్చు. ఆహారంలో రెడ్ మీట్ తీసుకోవడం తప్పనిసరి కాదు. శరీరానికి అవసరమైన ప్రోటీన్, ఇనుము, విటమిన్లు, ఇతర పోషకాలను పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, పాలు, పెరుగు, జున్ను, గుడ్లు, చేపలు, సోయాబీన్స్, వేరుశెనగ వంటి ఆహారాల ద్వారా కూడా అందుతుంది.

# అల్లరి చేస్తున్నారనీ పిల్లలకు ఫోన్ ఇస్తున్నారా?



పిల్లలు అన్నం తినడం లేదనో.. అల్లరి చేస్తున్నారనో.. వారి చేతికి స్మార్ట్‌ఫోన్ ఇస్తున్నారా? అయితే మీరు స్క్రీన్ బ్రైబ్ ట్రాప్‌లో పడిపోయినట్టే. దీనివల్ల మీ పిల్లలు ఏం కోల్పోతున్నారో తెలిస్తే షాక్ అవుతారు! దీనినే నిపుణులు స్క్రీన్ బ్రైబ్ లేదా డిజిటల్ లంచం అని పిలుస్తున్నారు.

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో పిల్లలను ఆడించడం తల్లిదండ్రులకు పెద్ద టాస్క్‌గా మారిపోయింది. ఆఫీస్ పని ఒత్తిడిలోనో లేక కాసేపు ప్రశాంతంగా ఉండాలనో చాలామంది పేరెంట్స్ చేస్తున్న పని.. పిల్లల చేతికి స్మార్ట్‌ఫోన్ ఇవ్వడం. దీనినే నిపుణులు స్క్రీన్ బ్రైబ్ లేదా డిజిటల్ లంచం అని పిలుస్తున్నారు. అయితే ఈ చిన్న అలవాటు మీ పిల్లల ఎదుగుదలను నిలువునా దహించి వేస్తోందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. పిల్లలు మారాం చేసినప్పుడు లేదా వారు ఏడుస్తున్నప్పుడు వారిని శాంతింపజేయడానికి ఫోన్ ఇవ్వడాన్ని స్క్రీన్ బ్రైబ్ అంటారు. ఇది తాత్కాలికంగా ఉపశమనం కలిగించినా, దీర్ఘకాలంలో పిల్లలను మానసిక రోగులుగా మార్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ అలవాటు వల్ల తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి అత్యంత విలువైన 4 విషయాలను దొంగిలిస్తున్నట్లే లెక్క. పిల్లలు ఇతరులతో మాట్లాడితేనే భాష వస్తుంది. కానీ ఫోన్‌కు అలవాటు పడిన పిల్లలు కేవలం వినడానికే పరిమితం అవుతున్నారు. దీంతో వారిలో కమ్యూనికేషన్ స్కిల్స్ దెబ్బతింటున్నాయి. నేటి కాలంలో చాలామంది పిల్లల్లో స్పీచ్ డిలే అంటే మాటలు ఆలస్యంగా రావడానికి ప్రధాన కారణం ఇదే. చుట్టుపక్కల మనుషులతో ఎలా ఉండాలి? ఎవరైనా వస్తే ఎలా పలకరించాలి? వంటి ప్రాథమిక విషయాలను పిల్లలు కోల్పోతున్నారు. స్క్రీన్ ప్రపంచంలో మునిగిపోవడం వల్ల వారు ఒంటరితనాన్ని అలవాటు చేసుకుంటున్నారు. ఇది భవిష్యత్తులో వారిని విపరీతమైన మొండితనం ఉన్నవారిగా మార్చే అవకాశం ఉంది. పిల్లలకు బోర్ కొట్టినప్పుడు వారు సొంతంగా ఏదైనా నేర్చుకోవాలి. కానీ ఆ ఖాళీని ఫోన్‌తో నింపడం వల్ల వారికి ఓర్పు నశిస్తోంది. ఫోన్ లాక్కున్న వెంటనే విపరీతమైన కోపం తెచ్చుకోవడం, వస్తువులను విసిరేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తమ భావోద్వేగాలను ఎలా అదుపు చేసుకోవాలో వారు నేర్చుకోలేకపోతున్నారు. ఖాళీ సమయంలో పిల్లలు మట్టిలో ఆడటం, బొమ్మలు గీయడం వంటివి చేయాలి. కానీ నిరంతరం వీడియోలు చూడటం వల్ల వారి మెదడు ఆలోచించడం మానేస్తుంది. కేవలం స్క్రీన్‌పై వచ్చే రంగులు, శబ్దాలకు మాత్రమే వారు స్పందిస్తారు. దీనివల్ల వారిలో క్రియేటివిటీ పూర్తిగా నశించిపోతుంది. పిల్లలను ఆడించడానికి ఫోన్‌ను ఒక సాధనంగా వాడకండి. పిల్లలకు బోర్ కొడితేనే వారు కొత్త ఆటలను కనిపెడతారు. వారి ఆలోచనలకు పదును పెట్టనివ్వండి. రోజులో కనీసం గంట సేపు ఫోన్లు పక్కన పెట్టి పిల్లలతో గడపండి. వారితో కలిసి చిన్న చిన్న ఇంటి పనులు చేయండి. మీ బిడ్డ చేతిలో ఉన్న ఫోన్ కేవలం ఒక గ్యాడ్జెట్ మాత్రమే కాదు.. అది వారి మేధస్సును హరించే ఆయుధం అని గుర్తుంచుకోండి. ఇప్పటికైనా మేల్కొనకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

## పిల్లలు త్వరగా మెచ్యూర్ అవుతున్నారా?


ఇటీవల కాలంలో ఆడపిల్లలు చిన్న వయసులోనే మెచ్యూర్ అవుతున్న సంఘటనలు తల్లిదండ్రుల్లో పెద్ద ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో సాధారణంగా 12?14 ఏళ్ల తర్వాతే అమ్మాయిలు మెచ్యూర్ అవుతారు. కానీ ఇప్పుడు జీవనశైలి మార్పులు, ఆహార అలవాట్లు వలన కొన్నిసార్లు చిన్న వయసులోనే ప్యూబర్టీ (రజస్వలత్వం) కనిపిస్తోంది. ఇటీవల కాలంలో ఆడపిల్లలు చిన్న వయస్సులోనే మెచ్యూర్ అవడం కొందరు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇంతకుముందు 12 నుంచి 14 ఏళ్ల తర్వాతే అమ్మాయిలు మెచ్యూర్ అయ్యేవారు. కానీ, ఇప్పుడు మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చిన్న వయస్సులోనే రజస్వల(ఖబీఎఎవతీబిఎ) అవుతున్నారు. అయితే, ఇందుకు కారణం చికెన్, గుడ్లు, ప్యాకెట్ పాలు లాంటి పదార్థాలేనని కొంతమంది భావిస్తున్నారు. కానీ, ఇతర కారణాలు కూడా అయి ఉండవచ్చు. మరి చిన్న వయస్సులోనే ఆడ పిల్లలు మెచ్యూర్ కావడానికి ఇవే కారణమా? లేక వేరే ఏమైనా కారణాలు ఉన్నాయా? వైద్య నిపుణులు చెబుతున్న కారణాలు ఏమిటి? చికెన్ తినడం వల్ల మెచ్యూర్ త్వరగా వస్తుందన్నది చాలా మంది చెప్పే విషయం. కానీ, పరిశోధనలు మాత్రం చికెన్ వల్ల మెచ్యూర్ త్వరగా వస్తుందని స్పష్టమైన ఆధారం లేదు. అసలు ఈ విషయానికి సంబంధించిన పెద్ద స్థాయిలో పరిశోధనలు కూడా లేదు. చికెన్‌లో హార్మోన్లు ఉంటాయని కొందరు అంటారు, కానీ ఆ హార్మోన్లు మన శరీరానికి ప్రభావం చూపే స్థాయిలో ఉండవు అని వైద్యులు చెప్తున్నారు. పాలు ఆరోగ్యానికి మంచిదనే విషయం అందరికీ తెలుసు. అయితే పాలు తాగితే మెచ్యూర్ ముందుకు వస్తుందా? అంటే.. ఇక్కడ కూడా శాస్త్రంగా నిర్ధారించబడిన స్పష్టమైన సంబంధం లేదు. పాలు తాగడం వల్ల శరీర బరువు పెరిగితే.. అది మెచ్యూర్ కారణమవ్వొచ్చు. కానీ పాలే కారణమని చెప్పడం సరికాదు. గుడ్లు ఆరోగ్యకరమైన ప్రోటీన్ అందిస్తాయి. మెచ్యూర్ త్వరగా వచ్చే కారణంగా గుడ్లు ప్రస్తావించడం సరైనది కాదు. గుడ్లు ఎక్కువగా తినడం వల్లే మెచ్యూర్ అవుతారని చెప్పడం కూడా సరైనది కాదు. మెచ్యూర్ (మొదటి రక్తస్రావం) త్వరగా వస్తే దానికి కారణాలు చాలా ఉంటాయి. బరువు ఎక్కువగా ఉన్న పిల్లల్లో హార్మోన్ స్థాయిలు మారి మెచ్యూర్ ముందుకు రావడం సాధారణం. ఫాస్ట్ ఫుడ్, తీపి పానీయాలు, ప్రాసెస్ చేసిన స్నాక్స్ ఎక్కువగా తింటే శరీర బరువు పెరుగుతారు. అంతేకాక, ఇవి హార్మోన్లపై కూడా ప్రభావం చూపవచ్చు. వీటి ద్వారా కూడా తొందరగా మెచ్యూర్ అయ్యే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బాటిల్స్, కెమికల్స్, పెస్టిసైడ్స్ వంటి వాటిలో ఉండే రసాయనాలు హార్మోన్ వ్యవస్థను ప్రభావితం చేసి మెచ్యూర్ ముందుకు తీసుకురావచ్చు. సమతుల ఆహారం.. పండ్లు, కూరగాయలు, మాంసం, బియ్యం, పప్పు తీసుకోవడం. వైయామం/ఆట.. రోజుకు కనీసం 30 నిమిషాలు. జంక్ ఫుడ్ తగ్గించండి. పర్యావరణం గురించి జాగ్రత్త.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి. సమయానికి ఆరోగ్య పరీక్షలు.. 8 సంవత్సరానికి ముందే మెచ్యూర్ లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ని సంప్రదించండి. చివరగా.. చికెన్, పాలు, గుడ్లు తింటే అమ్మాయిలలో మెచ్యూర్ ముందుకు వస్తుందని శాస్త్రంగా నిర్ధారించలేదు. మెచ్యూర్ త్వరగా వచ్చే కారణం ఆహారం కాదు, పూర్తి జీవనశైలి, బరువు, జన్యు, పర్యావరణం వంటి అంశాలు ఎక్కువగా ప్రభావితం చేస్తాయి.

# రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోతున్నారా?




నేటి జీవనశైలిలో చాలామంది సరైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పని ఒత్తిడి, మొబైల్ వినియోగం, టీవీ, సోషల్ మీడియా వంటి అలవాట్ల కారణంగా రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోవడం సాధారణమైపోయింది. అయితే, ఈ అలవాటు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనిషి చాలా ఆరోగ్యకరమైన విషయాలకు దూరమవుతున్నాడు. అందులో ప్రధానమైనది నిద్ర. మారుతున్న జీవనశైలి, ఉద్యోగ సమయాలు ఇందుకు కారణమవుతున్నాయి. ఉద్యోగాలు చేస్తున్నవారు రాత్రి వేళల్లోనూ పనిచేయడం, ఇంట్లో ఉంటే ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి సమయానికి నిద్రపోవడం లేదు. రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం ఆలస్యంగా మేల్కోవడం అనేవి రెండూ కూడా మనిషి ఆరోగ్యానికి హానికరమైనవేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయంలో 7 గంటల కంటే తక్కువగా నిద్రపోయే వారిలో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెబుతున్నారు. అందుకే రాత్రి సమయంలో తప్పనిసరిగా 7 గంటలపాటు నిద్రకు సమయం కేటాయించాలని సూచిస్తున్నారు. నిద్ర తక్కువైతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి? నిద్ర అనేది శరీరానికి విశ్రాంతి మాత్రమే కాదు. శరీర కణాలు పునరుద్ధరించబడతాయి. మెదడు జ్ఞాపకశక్తిని బలోపేతం చేస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. హార్మోన్లు సమతుల్యం అవుతాయి. అందుకే పెద్దవారికి రోజుకు కనీసం 7?8 గంటల నిద్ర తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. మానసిక ఆరోగ్యంపై ప్రభావం.. తక్కువ నిద్ర వల్ల ఒత్తిడి (హబితీవబబ) పెరుగుతుంది. ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు రావచ్చు. చిరాకు, కోపం ఎక్కువవుతాయి. గుండె సంబంధిత సమస్యలు.. నిద్ర లోపం దీర్ఘకాలంగా ఉంటే.. అధిక రక్తపోటు, గుండెపోటు ప్రమాదం, స్ట్రోక్ వచ్చే అవకాశం పెరుగుతుంది. షుగర్, బరువు పెరగడం.. తక్కువ నిద్ర వల్ల ఇన్సులిన్ పనితీరు తగ్గుతుంది. ఆకలి పెంచే హార్మోన్లు ఎక్కువవుతాయి. ఊబకాయం (హఎవబతిబిఎ), టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. రోగనిరోధక శక్తి తగ్గిపోవడం.. నిద్ర సరిపోకపోతే శరీరం వైరస్‌లు, ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తిని కోల్పోతుంది. దీంతో తరచూ జలుబు, జ్వరం, అలసట లాంటివి వస్తుంటాయి. జ్ఞాపకశక్తి, పనితీరు తగ్గడం.. తక్కువ నిద్ర ఏకాగ్రతను తగ్గిస్తుంది. జ్ఞాపకశక్తి బలహీనమవుతుంది. పని లేదా చదువులో పని తీరు పడిపోతుంది.

# చెరకుగడ లాభాలు..



చెరకుగడను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. చెరకు గడను నేరుగా తీసుకోవడం వల్లే ఎక్కువ లాభాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెరకుగడ.. చక్కెర, బెల్లంకు ముడి సరకు అయిన దీనిని మనం చాలా తక్కువగా తీసుకుంటాం. మార్కెట్లు, బజార్లలో వీటిని ఎక్కువగా అమ్ముతుంటారు. కానీ, మనం ఎక్కువగా వీటిని పట్టించుకోం. కొన్నిసార్లు చెరకు రసం జ్యూస్ రూపంలో తీసుకుంటాం. కానీ, చెరకు గడను నేరుగా తీసుకోవడం వల్లే ఎక్కువ లాభాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెరకు రసం తాగితే లాభం ఉంటుందని చాలా మందికి తెలిసినప్పటికీ.. చెరకుగడ తినడం ఆరోగ్యానికి ఇంకా మంచి ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చెరకు గడలో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీని వల్ల పేగులు సక్రియంగా పనిచేస్తాయి. జీర్ణం మెరుగవుతుంది. అజీర్ణం తగ్గుతుంది. గ్యాస్ సమస్య తగ్గుతుంది. చెరకు గడను తినడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ఎందుకంటే.. ఇది ఆకలిని నియంత్రిస్తుంది. తక్కువ తింటారు. దీంతో బరువు తగ్గడానికి ఇది సహాయపడుతుంది. ఇది “నేచురల్ డైట్ ఫైబర్” లా పని చేస్తుంది. చెరకు గడలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఆహారంలో ఉండే షుగర్ శరీరంలో వేగంగా జీర్ణం అవుతుంది. దీంతో రక్తంలో గ్లూకోస్ స్థాయి స్టేబుల్ అవుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి కూడా మితంగా మంచిది. కానీ, డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మాత్రమే తినాలి. ఇది కాలేయ ఆరోగ్యానికి కూడా మంచిది. చెరకు గడలో ఉండే పోషకాలు శరీరాన్ని డీటాక్స్ చేస్తాయి. అందువల్ల కాలేయం క్లీనింగ్ అవుతుంది. విషకణాలు బయటకు బయటకు పోతాయి. శరీరం శుభ్రంగా ఉంటుంది. శరీరంలో నీటి సమతుల్యతను కాపాడుతుంది. చెరకు గడ తినడం వల్ల శరీరంలో నీటి సమతుల్యత నిల్వ ఉంటుంది. దీని వల్ల డీహైడ్రేషన్ తగ్గుతుంది. చర్మం మృదువుగా ఉంటుంది. వేడిలో శరీరం తేమగా ఉంటుంది. చెరకు గడలో ఉండే ఫైబర్, విటమిన్స్, ఖనిజాలు హృదయానికి కూడా ఉపయోగపడతాయి. కాలేయంలో కొవ్వు తగ్గించడంలో సహాయం చేస్తుంది. కోలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయం చేస్తుంది. దీంతో హృదయ ఆరోగ్యం మెరుగవుతుంది. చెరకు గడలో ఉండే తీపి పదార్థం శరీరానికి శక్తి ఇస్తుంది. ఇది అలసట తగ్గిస్తుంది. పని చేయడానికి ఎనర్జీ ఇస్తుంది. రోజువారీ శక్తి అవసరాన్ని తీర్చుతుంది.

## బెడ్ మీద కూర్చొని తింటున్నారా..?



మీకు మంచం మీద కూర్చుని టీవీ చూస్తూ భోజనం చేసే అలవాటు ఉందా..? అయితే మీరు తెలియకుండానే పెద్ద ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నారు. చూడటానికి ఇది చాలా సౌకర్యంగా అనిపించినా.. మీ జీర్ణవ్యవస్థను, నిద్రను, చివరికి మీ చర్మాన్ని కూడా ఇది దెబ్బతీస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలామందికి రాత్రిపూట లేదా ఖాళీ సమయాల్లో మంచం మీద కూర్చుని, టీవీ చూస్తూనో లేదా మొబైల్ వాడుతూనో భోజనం చేయడం అలవాటు. ఇది ఎంతో హాయిగా, సౌకర్యంగా అనిపించవచ్చు. కానీ ఈ చిన్న అలవాటు మీ ఆరోగ్యానికి ఎంతటి చేటు చేస్తుందో తెలుసా..? మంచం మీద తినడం వల్ల కలిగే అనర్థాలపై ఆరోగ్య నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. మనం ఆహారం తిన్నప్పుడు మన శరీరం నిటారుగా ఉండాలి. అప్పుడే ఆహారం అన్నవాహిక ద్వారా కడుపులోకి సులభంగా వెళుతుంది. మంచం మీద కూర్చున్నప్పుడు మనం నిటారుగా ఉండము, దీనివల్ల జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి కావు. పడుకుని తినడం వల్ల ఆహారం అన్నవాహికలో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. ఇది తీవ్రమైన ఎసిడిటీ, గ్యాస్, గుండెల్లో మంటకు దారితీస్తుంది. మంచం మీద తింటున్నప్పుడు మన దృష్టి ఆహారం మీద కంటే టీవీ లేదా మొబైల్ స్క్రీన్‌పైనే ఎక్కువగా ఉంటుంది. దీనిని మైండ్‌లెస్ ఈటింగ్ అంటారు. అంటే మనం ఎంత తింటున్నామో మన మెదడుకు సరిగ్గా తెలియదు. దీనివల్ల అవసరానికి మించి ఎక్కువగా తినేస్తాం. ఫలితంగా ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. మంచం మీద తిన్నప్పుడు మనకు తెలియకుండానే చిన్న చిన్న ఆహార కణాలు పరుపులు, దుప్పట్లపై పడతాయి. ఇవి కంటికి కనిపించవు కానీ, బ్యాక్టీరియా, ఇతర కీటకాలను ఆకర్షిస్తాయి. దీనివల్ల చర్మ సంబంధిత అలర్జీలు, ఉబ్బసం ఉన్నవారికి శ్వాసకోశ సమస్యలు పెరగవచ్చు. మంచం పరిశుభ్రంగా లేకపోవడం వల్ల నిద్రలేమి సమస్యలు తలెత్తుతాయి. మెదడుకు మంచం అంటే నిద్రపోయే చోటు అనే సంకేతం ఉంటుంది. కానీ మీరు అక్కడే తినడం, ల్యాప్‌టాప్ వాడటం చేస్తే.. అది విశ్రాంతి తీసుకోవాల్సిన చోటా లేక పని చేయాల్సిన చోటా అని మెదడు గందరగోళానికి గురవుతుంది. దీనివల్ల రాత్రిపూట ప్రశాంతమైన నిద్ర కరువవుతుంది.

# వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్ ను తొలగించిన ఐసీసీ!

**2026 టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ ఔట్!**

**భారత్‌లో భద్రతా కారణాలతో టోర్నీని బహిష్కరించిన బంగ్లాదేశ్**

**బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను ఎంపిక!**



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్‌లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ జట్టును తొలగిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వర్గాలు తెలిపాయి. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను టోర్నమెంట్‌లోకి తీసుకుంటున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు ఐసీసీ లేఖ ద్వారా తెలియజేసినట్టు తెలుస్తోంది. 2007 నుంచి ప్రతి టీ20 ప్రపంచకప్‌లోనూ ఆడిన బంగ్లాదేశ్ ప్రస్థానానికి ఐసీసీ కఠిన నిర్ణయంతో తొలిసారి బ్రేక్ పడింది.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నమెంట్‌కు సంబంధించి భారత్‌లో తమ ఆటగాళ్ల భద్రతపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేసింది. ఈ సమస్యలను ఐసీసీ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సరైన పరిష్కారం లభించలేదని ఆరోపిస్తూ, టోర్నమెంట్‌ను బహిష్కరిస్తున్నట్లు బీసీబీ గురువారం ప్రకటించింది. ఈ వివాదాన్ని డిస్ప్యూట్ రిజల్యూషన్ కమిటీకి అప్పగించాలని బీసీబీ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. కమిటీకి అప్పీళ్లపై విచారణ జరిపే అధికారం లేదని, ఐసీసీ తీసుకున్న నిర్ణయమే అంతిమమని స్పష్టం చేసింది. టోర్నీలో ద పాల్గొనకపోతే స్కాట్లాండ్‌తో భర్తీ చేస్తామని ఇచ్చిన అల్టిమేటంపై బీసీబీ నుంచి స్పందన రాకపోవడంతో ఐసీసీ ఈ నిర్ణయాన్ని అమలు చేసినట్టు సమాచారం. దీనిపై ఐసీసీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఈ మార్పుతో స్కాట్లాండ్ జట్టు నేరుగా గ్రూప్ సిలో ప్రవేశిస్తుంది. ఈ గ్రూప్‌లో ఇంగ్లాండ్, వెస్టిండీస్, ఇటలీ, నేపాల్ వంటి జట్లు ఉన్నాయి. స్కాట్లాండ్ తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో ఆడాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఇటలీ, ఇంగ్లాండ్, నేపాల్‌తో మ్యాచ్ లు ఉన్నాయి.స్కాట్లాండ్ ఇప్పటివరకు ఐదు టీ20 ప్రపంచకప్‌లలో పాల్గొంది. గత రెండు టోర్నీల్లో సూపర్ 8 దశకు చేరుకోలేకపోయినా, పెద్ద జట్లకు గట్టిపోటీనిచ్చింది.

## ముమ్ముందు ఏం జరుగుతుందో మాకు తెలియదు: బంగ్లాదేశ్ క్రికెటర్ షోరిఫుల్ ఇస్లాం

**టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనడంపై అనిశ్చితి**

**మా పని ఆడటమేనని స్పష్టం చేసిన పేసర్ షోరిఫుల్ ఇస్లాం**

**భారత్‌లో భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్న బంగ్లా క్రికెట్ బోర్డు**

**షెడ్యూల్ మార్చేది లేదని తేల్చిచెప్పిన ఐసీసీ**

**బోర్డు నిర్ణయాన్ని గౌరవిస్తామన్న బంగ్లా క్రికెటర్లు**

**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలో జరగనున్న టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ పాల్గొంటుందా లేదా అనే విషయంపై ఆ దేశ ఫాస్ట్ బౌలర్ షోరిఫుల్ ఇస్లాం స్పందించాడు. ప్రపంచ కప్‌కు వెళ్లాలా వద్దా అనేది తమ చేతుల్లో లేదని, ఆటగాళ్లుగా తమ పని ప్రదర్శనపై దృష్టి పెట్టడమేనని స్పష్టం చేశాడు. భారత్‌తో దెబ్బతింటున్న సంబంధాల నేపథ్యంలో భద్రతా కారణాలను చూపుతూ, తమ జట్టును భారత్‌కు పంపేది లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తేల్చిచెప్పింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని డిమాండ్ చేసింది. అయితే, ఈ ప్రతిపాదనను ఐసీసీ తిరస్కరించింది. షెడ్యూల్ ప్రకారమే భారత్‌లో మ్యాచ్‌లు జరుగుతాయని బుధవారం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ టోర్నీకి దూరమయ్యే అవకాశాలున్నాయనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ వివాదంపై బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో 'ప్లేయర్ ఆఫ్ ది సీజన్' అవార్డు అందుకున్న అనంతరం షోరిఫుల్ మీడియాతో మాట్లాడాడు. "ఆటగాళ్లుగా, మేం ఎలా మెరుగ్గా రాణించాలనే దానిపైనే ఆలోచిస్తాం. ప్రపంచ కప్‌కు వెళ్లడం, వెళ్లకపోవడం అనేది మా చేతుల్లో లేదు. మా క్రికెట్ పెద్దలు తీసుకున్న నిర్ణయాన్ని మేం గౌరవిస్తాం. మా నియంత్రణలో లేని విషయం గురించి ఎక్కువగా మాట్లాడటంలో అర్థం లేదు" అని వివరించాడు.

ఈ విషయం జట్టులో చర్చకు వచ్చిందా, ఆటగాళ్లపై మానసికంగా ప్రభావం చూపుతోందా అని



అడగగా.. "ముమ్ముందు ఏం జరుగుతుందో మాకు తెలియదు. దాని గురించి ఆలోచించడం కంటే మా ఆటపై దృష్టి పెట్టడం మంచిది" అని షోరిఫుల్ బదులిచ్చాడు. ఇటీవలే ముగిసిన బీపీఎల్‌లో చట్టోగ్రామ్ రాయల్స్ తరఫున ఆడిన ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్, 26 వికెట్లతో అద్భుత ప్రదర్శన కనబరిచాడు.

## మళ్లీ గ్రౌండ్‌లోకి మహీ.. నెట్స్‌లో బ్యాటింగ్..

**ఐపీఎల్ 2026 కోసం ప్రాక్టీస్ మొదలుపెట్టిన ఎంఎస్ ధోనీ**

**నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న వీడియోను పంచుకున్న ఝార్ఖండ్ క్రికెట్ అసోసియేషన్**

**గత సీజన్‌లో సీఎస్‌కే, ధోనీ పేలవ ప్రదర్శన**

**44 ఏళ్ల వయసులోనూ ఐపీఎల్‌లో కొనసాగుతున్న దిగ్గజ ఆటగాడు**

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ... రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ కోసం సన్నాహాలు ప్రారంభించాడు. ఝార్ఖండ్ స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (జేఎస్‌సీఏ) తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియోలో, 44 ఏళ్ల ధోనీ నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. ఈ వీడియోలో ధోనీ, నెట్స్‌కు సిద్ధమవుతూ జేఎస్‌సీఏ కార్యదర్శి సౌరభ్ తివారీతో మాట్లాడుతున్న దృశ్యాలు కూడా ఉన్నాయి. "చూడండి ఎవరు తిరిగొచ్చారో. జేఎస్‌సీఏ గర్వకారణం: మహేంద్ర సింగ్ ధోనీ" అంటూ జేఎస్‌సీఏ ఈ పోస్టుకు క్యాప్షన్ ఇచ్చింది. 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ, కేవలం ఐపీఎల్‌లో మాత్రమే తన అభిమాన సీఎస్‌కే జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గత ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన నిరాశాజనకంగా ముగిసింది. ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం 4 మాత్రమే గెలిచి పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. బ్యాటర్‌గా ధోనీ కూడా పెద్దగా రాణించలేకపోయాడు. 13 ఇన్నింగ్స్‌లలో 24.50 సగటుతో కేవలం 196 పరుగులు మాత్రమే



చేశాడు. గాయపడిన గైక్వాడ్ స్థానంలో కొన్ని మ్యాచ్‌లకు కెప్టెన్సీ కూడా చేశాడు. ఇప్పటికీ సీఎస్‌కే జట్టులో అత్యంత కీలక ఆటగాడిగా, నాయకత్వ బృందంలో ముఖ్య సభ్యుడిగా ధోనీ కొనసాగుతున్నాడు. తన కెప్టెన్సీలో చెన్నై జట్టుకు ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించాడు. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 278 మ్యాచ్‌లు ఆడిన ధోనీ, 38.80 సగటుతో 5,439 పరుగులు సాధించాడు. ఇందులో 24 అర్ధ సెంచరీలు ఉన్నాయి.



**ఎంత అందం! సారా అర్జున్ తన లేటెస్ట్ ఫోటోలో చాలా అద్భుతంగా ఉంది**

## రాజసం ఉట్టిపడేలా.. చీరకట్టులో రాశి ఖన్నా అందాలు..

టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అంటూ భాషతో సంబంధం లేకుండా వరుస భాషా చిత్రాలలో నటిస్తూ మరింత బిజీగా మారిపోయింది ప్రముఖ హీరోయిన్ రాశి ఖన్నా. 2013లో 'మద్రాస్ కేఫ్'అనే సినిమాతో హిందీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తెలుగులో 2014లో అక్కినేని కుటుంబం నటించిన 'మనం' అనే సినిమాలో కేమియో పాత్రలో కనిపించి బాగా ఆకట్టుకుంది. ఆ తర్వాత ఊహలు గుసగుసలాడే సినిమాతో హీరోయిన్ గా భారీ క్రేజీ సంపాదించుకొని జోరు, జిల్, బెంగాల్ టైగర్, సుప్రీం, జై లవకుశ, రాజా ది గ్రేట్, తొలిప్రేమ తదితర చిత్రాలలో నటించి హీరోయిన్గా భారీ పాపులారిటీ అందుకుంది.

సోషల్ మీడియాలో యాక్టివ్ గానే ఉన్న రాశి ఖన్నా బ్లాస్ట్ అయ్యే అందాలతో కుర్రాళ్లను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అప్పుడప్పుడు గ్లామర్ ఫోటోలతో కూడా సడన్ సర్ప్రైజ్ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా చీరకట్టులో మరింత అందంగా ఆకట్టుకుంటోంది. చీరకట్టులో కూడా అందాలను దాస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన ఈమె.. ఈ ఫోటోలు చూసి అభిమానులు లవ్ , ఫైర్ సింబల్ తో వైరల్ చేస్తున్నారు. ఈ అమ్మడు చీరకట్టులో ఫోటోలు తెగ వైరల్ గా మారుతున్నాయి. ఇంకొంతమంది రాజసం ఉట్టిపడేలా చీర కట్టులో ఆకట్టుకుంటోంది అంటూ కామెంట్లు చేస్తున్నారు.రాశి ఖన్నా చివరిగా 2025 లో వచ్చిన 'తెలుసు కదా' అనే సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా ఫ్లాప్ గా నిలిచింది. ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో పాటుగా తమిళంలో ఒక సినిమా, హిందీలో మూడు చిత్రాలలో నటిస్తోంది. గతంలో చాలా బొద్దుగా ఉండే రాశి ఖన్నా ఈ మధ్యకాలంలో మరింత స్లిమ్ముగా మారి వరుస అవకాశాలను అందుకుంటోంది. తన పాత్ర నచ్చితే మాత్రం రాశి ఖన్నా సెకండ్ హీరోయిన్గా కూడా నటించడానికి సిద్ధంగానే ఉంటుంది.గతంలో కూడా ఇలా ఎన్నో చిత్రాలలో నటించి మంచి విజయాలను అందుకుంది. ప్రస్తుతం ఈమె ఫోకస్ మొత్తం ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా పైనే పెట్టిందని చెప్పవచ్చు. ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రాశి ఖన్నాతో పాటు యంగ్ బ్యూటీ శ్రీలీలా కూడా హీరోయిన్గా నటిస్తోంది. ముఖ్యంగా 13 ఏళ్ల తర్వాత మళ్లీ హరీష్ శంకర్ - పవన్ కళ్యాణ్ కాంబో రిపీట్ కాబోతుండడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఈ సినిమాతో రాశి ఖన్నా కచ్చితంగా బ్లాక్ బస్టర్ విజయం సొంతం చేసుకుంటుందని , ఈ సినిమాతో కచ్చితంగా టాలీవుడ్ లో కం బ్యాక్ అవుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ సినిమా రాశి ఖన్నాకు ఎలాంటి అ దృష్టాన్ని తెచ్చి పెడు తుందో చూడాలి.





**రుక్మిణికి స్టైల్‌తో ఎలా మెస్మరైజ్ చేయాలో తెలుసు**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965